# గుంటూరు కమ్మ హాస్టలు (బాలురు)

## సంగ్రహ చరిత్ర - స్వీయ అనుభవాలు

నూరు సంవత్సరాలు నిండిన సందర్భంగా ప్రచురణ


రచన

**డా॥ కొండబోలు బసవపున్నయ్య,** M.B.,B.S.

**నామినేని కోటేశ్వరరావు,** M.Sc.


సమర్పణ

**కమ్మ హాస్టలు పూర్వ విద్యార్థుల సంఘం**

4/4 అరండల్‌పేట - గుంటూరు - 2

# అంకితం

వేదమే నాదముగా

వైదికమే ప్రామాణికముగా

ధర్మ రక్షణే ధ్యేయముగా

పరహితమే ప్రాణముగా

పరోపకారమే జీవనముగా

సామాజిక సేవయే కర్తవ్యముగా

దైవచింతనే శ్వాసగా

విద్యాపోషణేద్యాసగా గడుపుచున్న

**కర్మయోగి మన బొల్లేపల్లి**



శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ, శ్రీమతి లలితాంబ దంపతులు

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముందుమాట | డా॥ జాష్టి వేంకటేశ్వర్లు | 5 |
| 2. | నాకు తెలిసిన కమ్మ హాస్టలు | డా॥ కొండబోలు బసవపున్నయ్య | 7 |
| 3. | నేనెరిగిన కమ్మ హాస్టలు | నామినేని కోటేశ్వరరావు | 41 |
| 4. | కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటి నేపథ్యం | | 79 |
| 5. | అనుబంధం – I | | 93 |
| 6. | అనుబంధం – II | | 94 |
| 7. | అనుబంధం – III | | 95 |
| 8. | అనుబంధం – IV | | 96 |
| 9. | అనుబంధం – V | | 98 |
| 10. | వారాల పద్ధతిలో ధనసహాయము చేసిన దాతలు | | 100 |
| 11. | అధ్యక్షులు | | 102 |
| 12. | కార్యదర్శులు | | 105 |
| 13. | వార్డెన్లు | | 108 |



డా॥ జాష్టి వేంకటేశ్వర్లు
M.Sc., Ph.D.
Detroit, (USA)

# ముందుమాట

I am very happy to know that a small book is coming out on the history of Kamma Hostel for boys, started in 1923. Thanks to the Secretary Mr. Namineni Koteswara Rao for his valient efforts and the support of President Dr. K. Basavapunnaiah garu.

At the time of converting a “Kamma Satram” that was sheltering Kammas on their work in predominantly Brahmin area of the town. The very rich mind of Sri Jagarlamudi Kuppuswamy Chowdary, thought of poor in the community. He was kind enough to make a permanent arragngement for 20% of selected poor, free boarding and lodging fecility.

Thank God, I could not have continued my education in Guntur for B.Sc. degree without that help from the hostel, during 1949 - 1951.

I know there are many from poor families of rural areas, who were benefitted by this arrangement and now multi millionaries in this country and outside India.

Thanks to the present and past administration who continued that most useful and good programme.

Special thanks to the President Basavapunnaiah garu on his efforts in the expansion of the two buildidngs. Apart from the provision of more rooms for the increased number of students, some commercial area is also provided for rental accommodation. The huge rent was enough to pay the expenses like taxes, electricity and water.

We, me and some friends, did our part in helping those expenses. Large amounts are sent through the help of a charitable foundation registered in U.S.A. and many students are helped to pay their expenses at the hostel.

In 2003 an organisation known as "Kakatiya Student Welfare Society" was started, with Dr. Basavapunnaiah garu as President, exclusively to help Kamma Students from rural poor. About 50 students are constantly helped every year from the hostel.

All that amounts to paying it back to the institution that helped us in the past.

Through this small statement, I appeal to all those present "Crore Pathis" to remember what they received from the hostel and helps some people exactly like you in these days. Also request you, the present inmates, to help the hostel grow in to a Huge instition to help the community, whenever you are in a position to do it.

Remember, "What is given to the needy is the only one, that comes with you."

GUNTUR 12.01.2015



డా॥ కొండబోలు బసవపున్నయ్య
M.B.,B.S.
గుంటూరు.

# కమ్మ హాస్టలు అర్ధశతాబ్దిపైగా నా అనుబంధం
(1969 - 2025)

కమ్మ విద్యార్థి సహాయ సంఘం 1917లో స్థాపితం. కమ్మ హాస్టలు అంటే - శాఖమూరి లక్ష్మీదేవమ్మగారు నిర్మించిన సత్రం - బాలుర హాస్టలు అనే అర్థం. గత కొన్ని సంవత్సరాలుగా కమ్మజన సేవాసమితివారు నిర్వహిస్తున్న గ్రామీణ కమ్మ విద్యార్థినుల వసతిగృహాన్ని వాడుకలో కమ్మ హాస్టలు అని పిలవడం పరిపాటి అయింది. ఇప్పుడు బాలుర, బాలికల వసతిగృహాలు రెండూ అవసరమే! కానీ, ప్రస్తుత సమాజంలో బాలికల్లో పోటీతత్వం పెరిగింది. ప్రభుత్వ ప్రోత్సాహ పథకాలతో బాలురకంటే బాలికలే ఎక్కువమంది ఉన్నత విద్యలను అభ్యసిస్తున్నారు. ముఖ్యంగా మన ప్రాంతం నుండి వచ్చే బాలికలు బాలురతో పోటీపడి ముందుకు దూసుకుపోతున్నారు. ఇప్పుడు నేను బాలుర కమ్మ హాస్టలును గురించి మాత్రమే నా అనుభవాన్ని పురస్కరించుకొని మీ ముందు ఉంచుతున్నాను.

శ్రీమతి శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి కమ్మ హాస్టలు, అరండల్‌పేట 4/4లో ఉన్న వసతిగృహం 1916-1918 సం॥ల మధ్య కట్టబడినట్లు హాస్టలులోని శిలాఫలకాలను బట్టి తెలుస్తున్నది. ఆమె మరణానంతరం, వారి కుమార్తె రాధాబాయమ్మ, అల్లుడు చిరుమామిళ్ళ లక్ష్మీనారాయణప్రసాదు గార్లు మనకు 1923లో దఖలుపరచి స్వాధీనపరచారు. 1918-1923

మధ్య అయిదు సంవత్సరములు ఇది కమ్మ సత్రముగా నడిచినట్లు హాస్టల్లో ఉన్న శాసనాలను బట్టి స్పష్టం అవుతున్నది.

నేను గుంటూరులో ఉన్నత విద్యను అభ్యసించుటకు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో చేరినపుడు నాకీ హాస్టలు గురించి తెలియదు. నా చిన్నతనము నుండి మా అమ్మమ్మ రావిపాటి నాగమ్మగారి పెంపకములో పెరిగినాను. మా స్వగ్రామము వేటపాలెం, చుండూరు మండలం, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా. మాది వ్యవసాయ కుటుంబము. నా తల్లి, నా 18 నెలల వయస్సులో, కాన్పులో గుఱ్ఱపువాతము జబ్బుతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించినది. మొదట నా అమ్మమ్మ, నా పెద్ద తల్లి అచ్చమ్మ గారి సంరక్షణలో పెరిగాను. వేటపాలెంలో, తరువాత చేబ్రోలులో, గూడవల్లిలో, అనంతరం గుంటూరులో ఏ.సి. కాలేజి, గుంటూరు మెడికల్ కాలేజిలో ఎక్కడ చదివినా నా అమ్మమ్మే నా సర్వస్వం. పై ప్రదేశములలో ఆమె నా వెంట ఉండి నా సంరక్షణ చూచుకొనుచుండెడిది. ఇదంతా చెప్పడానికి కారణం నాకు హాస్టల్ జీవితం అవసరము ఎందుకు లేకపోయిందో చెప్పడానికే! నాతోపాటు 10వ తరగతి చదివిన నా మిత్రులు కొండబోలు బుచ్చయ్య, ఘంటా పిచ్చయ్య, కోటపాటి మురహరిరావు వగైరాలు కమ్మ హాస్టల్లో ఉండేవారని తరువాత తెలిసింది.

1949–50 సంవత్సరముల మధ్య ఏదైనా కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కొన్నిసార్లు హాస్టల్‌కు వెళ్ళడం జరిగింది. నాకు అక్కడ ఉండవలసిన అవసరం కలుగలేదు. నాకు 1950 సంవత్సరము నుండే మన సామాజికవర్గములో మనము, మనవాళ్లు అనే భావాలు వ్రేళ్లూనుకొంటూ వచ్చినవి. ఆ తర్వాత, అంటే ఇంటర్మీడియట్, యం.బి.,బి.ఎస్. మొదటి రెండు సంవత్సరములు పూర్తయిన తర్వాత విశాఖపట్నం వెళ్ళవలసిన పరిస్థితులు, నన్ను మా అమ్మమ్మ, పెద్దమ్మల నుండి దూరం చేశాయి. విశాఖపట్నంలో మెడికల్ కాలేజి హాస్టల్‌లో ఒక సంవత్సరము ఉండి, తర్వాత

ఒక ప్రైవేట్ మెస్‌లో తింటూ, చదువుకొన్నాను. 1957లో గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేయుటకు వచ్చినాను.

ఒక ముఖ్య విషయం - మా అమ్మమ్మ నాకు 1951లో అంటే, ఇంటర్ ఫలితాలు రాకముందే వివాహం జరిపించింది. మళ్ళా నేను 1957లో నా భార్య, కుమారుడు, మా అమ్మమ్మలతో గుంటూరులో కాపురం పెట్టాను. మా అమ్మమ్మ తన జీవితాంతం నాతో గడిపి, నన్ను సరైన వ్యక్తిగా, మనసున్న మానవునిగా తీర్చిదిద్దింది. ఆ తర్వాత హౌస్ సర్జన్, సీనియర్ హౌస్ సర్జన్, హానరరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ గవర్నమెంట్ హాస్పిటల్, 1959 జనవరి 1వ తేదీ నుండి ప్రైవేట్ ప్రాక్టీసు...అలా జీవితం గడవడంవలన ఏ హాస్టల్ తోనూ, ముఖ్యంగా కమ్మ హాస్టల్‌తో సన్నిహిత సంబంధం ఏర్పడలేదు.

1959 నుండి 2009 వరకు ప్రైవేట్ ప్రాక్టీస్‌లో యం.బి.,బి.ఎస్. డిగ్రీతో ఒక చరిత్ర సృష్టించడం జరిగింది. 1967లో నా స్వంత హాస్పిటల్ 2600 గజముల స్థలములో కట్టగలిగాను. నాకు తెలిసి గుంటూరులో ప్రత్యేకంగా అంత స్థలం కొని, ప్రైవేట్ హాస్పిటల్ కట్టిన ప్రథముడను నేనేనేమో! ప్రైవేట్‌రంగంలో 72 పడకల హాస్పిటల్ ఆ రోజుకు అది ఒక చరిత్ర. డాక్టర్ కాసరనేని సదాశివరావుగారు ద్వారకాబాయి కట్టుకొన్న హాస్పిటల్ కొన్నారు. ఆ దశాబ్దం నా జీవితంలో అనేకమంది పెద్దలతో సాన్నిహిత్యం చేకూరింది. మంచిపేరున్నవారు, నా డైరెక్ట్ పేషెంట్స్ కాకపోయినా, వారి వారి మనస్సులలోకి నేను చొచ్చుకుపోయాను. నాకు వారి ఆశీస్సులు, దీవెనలు పుష్కలంగా ఉండేవి. వారిలో ముఖ్యులు నాజ్ సినిమాహాలు ప్రొప్రయిటర్ శ్రీ షరీఫ్‌గారు, శ్రీ చేబ్రోలు హనుమయ్యగారి జాయింటు కుటుంబం మొత్తం, శ్రీ శనక్కాయల అంకమ్మగారు, శ్రీ వై.కె.ఎస్. ప్రకాశరావుగారు, శ్రీ గోగినేని కనకయ్యగారు, శ్రీ గోగినేని నాగేశ్వరరావు గారు, శ్రీ జాగర్లమూడి చంద్రమౌళిగారు, శ్రీ వాసిరెడ్డి సీతాపతిరావుగారు ఇంకా ఎందరెందరో పెద్దలు. తేళ్ల క్రిష్ణమ్మచౌదరిగారు కూడా ఈ కోవలోనివారే!

డాక్టర్స్‌తో ఆ రోజులలో సదాశివరావుగారు, చిగురుపాటి నాగేశ్వరరావు గారు, గోపాలకృష్ణగారు, వై.వి. సుబ్బారావుగారు, చల్లపల్లి సాంబశివరావు గారు, పావులూరి కృష్ణచౌదరిగారితోనూ, ఇంకా అనేకమందితోనూ, ఇప్పుడు వైద్యవృత్తిలో ఉన్న వారందరితోనూ నాకు సత్సంబంధాలు ఉండేవి. పెద్దల ఆశీస్సులుండేవి.

1970లో ఒక రోజు నా మిత్రులు డాక్టర్ పావులూరి కృష్ణచౌదరి గారిని తీసుకొని ఆశ్చర్యకరంగా నా రూములోనికి శ్రీ తేళ్ళ క్రిష్ణమ్మచౌదరి గారు ప్రవేశించారు. విషయము నాకు తెలియదు. వారి మనసులో హాస్టల్ పాలకవర్గాన్ని మార్చి నన్ను ప్రవేశపెట్టాలని ఉన్నది. కృష్ణచౌదరిగారిని ఒప్పించి తీసుకువచ్చారు. "నేను ఒంటరిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. అంత సమయం వినియోగించలేను" అని తప్పుకున్నాను. తరువాత కొన్ని మాసాలకు మళ్ళా ఒకసారి వాళ్ళిద్దరే వచ్చి బ్రతిమాలగా, వాళ్ళ పెద్దరికాన్ని గౌరవిస్తూ, నేను వాళ్ళు చెప్పినదానికి ఒప్పుకొన్నాను. ఈ విషయంలో కృష్ణచౌదరిగారి పాత్ర ఎక్కువ. ఆయన హాస్టల్‌కు పూర్వ విద్యార్థి గనుక, నాకంటే వయసులో పెద్దవాడు గనుక వారినే ప్రెసిడెంట్‌గా ఎన్నుకొనుట, నేను వైస్-ప్రెసిడెంట్‌గా ఉండి కార్యనిర్వహణ జరుపుకొనుట అనే ఒప్పందం ప్రకారం నన్ను కార్యరంగంలోకి దింపారు. ఆ రోజుల్లో హాస్టల్ సభ్యత్వం అని ఒక లిస్టు కూడా తయారుచేయబడి లేదు. ఆ రోజున హాస్టల్‌కు ఒక వార్డెనుగాని, విధి నిర్వహణ బాధ్యత చూచే వ్యక్తిగాని లేరు. ఆ కాలంలో, అంటే 1970లలో సర్వసభ్య సమావేశం జరిపి, 10 మందిలోపు సభ్యులు కలిసి నిర్ణయాలు తీసుకునేవారు. నా మిత్రుడు కృష్ణచౌదరిగారు నిడుబ్రోలులో ప్రాక్టీస్ చేస్తూ, గుంటూరులోను, హైదరాబాదులోను బ్రాంచీలు పెట్టడంవలన హాస్టల్ కార్యకలాపాలు చూచుకొనలేకపోయారు. మా ఇద్దరి మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహం వలన నేనే పూర్తిగా హాస్టల్ బాధ్యత స్వీకరించే పరిస్థితికి దారితీసింది. డాక్టర్ జి. పరంధామయ్య (కంటి డాక్టరు)గారు కార్యదర్శిగా, కోశాధిపతిగా 1970-73 కాలంలో శ్రీ పాటిబండ్ల వెంకటప్పయ్యగారు బాధ్యత నిర్వహించే

పరిస్థితి ఆనాటిది. క్రమంగా పట్టణంలో ఉన్న, నాకు నచ్చిన ప్రముఖుల్లో కొంతమందిని జీవితసభ్యులుగా రూ. 250/- లు సభ్యత్వ ఫీజుతో చేర్చుకొనడం జరిగింది. డా. బి. రామేశ్వరరావుగారు, డా. యం. గోపాలకృష్ణగారు, శ్రీ కట్టా వెంకట సుబ్బారావుగారు మొదలగువారిని సభ్యులుగా చేర్చాము.

నన్ను ఈ రంగంలోకి దింపిన శ్రీ తేళ్ళ కృష్ణమ్మచౌదరిగారు రెండు మూడుసార్లు మాత్రమే వచ్చి, జరుగుతున్న పరిస్థితిని సమీక్షించి, ప్రశంసించి, "నా ఊహ నిజమైంది. ఇకనుండి నేను మా పెదనందిపాడు కళాశాల చూచుకొనుటకు ఎక్కువ సమయం వినియోగించుకొని, హాస్టల్‌కు ఎప్పుడో తోచినప్పుడు వచ్చి వెళుతుంటాను" అన్నారు. ఈ సందర్భంగా చెప్పదగినది, 1970-73లో కోరం లేక మీటింగులు వాయిదాపడేవి. కారణం, సరిగ్గా చెప్పలేము. గుంటూరులో దాదాపు లక్షమంది కమ్మవారున్నా ఎవరూ ఈ హాస్టల్ ఉనికిని గూర్చి గాని, అభివృద్ధిని గూర్చి గాని శ్రద్ధ చూపలేకపోయారు. అప్పటికి పరిస్థితులు అన్నీ అయిదు అరుగురు సభ్యుల మధ్యనే నడిచేవి.

1949-50లో నేను ఏ.సి. కళాశాలలో చదివేటప్పుడు ఎప్పుడైనా గెస్ట్‌గా హాస్టల్‌కు వెళితే ఆజానుబాహుడైన డా. పరుచూరి వీరయ్యచౌదరి గారు అధ్యక్షుడుగా వస్తూ పోతూ కనబడేవారు. అప్పటికి, ఈ కోస్తా జిల్లాల్లో ఆయన్నే శస్త్రచికిత్సానిపుణులుగా చెప్పుకునేవారు.

ఆయన తరువాత కాలములో శ్రీ తేళ్ళ కృష్ణచౌదరిగారు కొంతకాలం, ఆ తరువాత డా. సదాశివరావుగారు కొంతకాలం నడిపి, 1970లో శ్రీ పెద్ది వెంకటేశ్వరరావుగారిని సెక్రటరీగా, కృష్ణచౌదరిగారు అధ్యక్షులుగా కలిసి స్వయంగా నాకు, నా టీముకు అప్పగించారు. హాస్టల్‌కు ఒక గుమస్తా, ఒక వాచ్‌మెన్, ఒక వార్డెను తప్పనిసరి అని, ఆ వార్డెను కళాశాల అధ్యాపకుడైన యెడల క్రమశిక్షణ అమలుచేయుట సులభమని నా మనసుకు తోచింది. అప్పట్లో జే.కె.సి. కళాశాలలో పనిచేస్తున్న సమర్థుడైన ఒక అధ్యాపకుని

ఎన్నుకొని వార్డెనుగా నియమించాలని నిర్ణయించుకొని, శ్రీ మారుపూడి కోటేశ్వరరావు గారిని నియమించి, వారికే పూర్తి బాధ్యతలు ఇచ్చి, హాస్టల్లో ఉన్న క్రమ శిక్షణను సక్రమంగా నిర్వహించగలిగాను. 1970-73లో పరిస్థితులు గుర్తుకు తెచ్చుకుంటే చాల బాధ కలుగుతుంది. అప్పటికే శాఖమూరి లక్ష్మీదేవమ్మ హాస్టల్ పాత హాస్టల్గా పిలవబడుతూ, జంపాల సాంబయ్య హాస్టల్ అనబడే బిల్డింగు కొత్త హాస్టల్గా వాడుకలో ఉంది. పాత హాస్టల్ కాంపౌండ్వాల్ పూర్తిగా ఒరిగిపోయి, డ్రైనేజి కాలువ సరిగా లేనందున పడిపోతుందనే భయముతో సపోర్ట్లు కట్టించడం జరిగింది. కాలువ పునర్నిర్మాణం కూడా జరిపించాము. అప్పటికి రెండు హాస్టల్ భవంతులు కూడా గత 10 సంవత్సరాల్లో ఎప్పుడూ వెల్లవేయడంగాని, తలుపులు కిటికీలకు రంగులు వేయడంగాని జరగలేదు. 1972-73లో పైన ఉదహరించిన పనులన్నీ పూర్తిగా సాధ్యమైనంత వరకు చేయించి కొత్త హంగు సదుపాయాలు రూ. 9,758-50 పైసలు ఖర్చుతో కల్పించగలిగాము. 1973లో జనరల్ బాడీ ఎలక్షను మీటింగ్కి కోరం లేక వాయిదా వేసి, అక్టోబరు నెల బదులు నవంబరు నెల ఆఖర్లో ఎలక్షను మీటింగ్లో, 9 మంది సభ్యుల సమావేశంలో, ఎలక్షను జరుపుకొని, నేను అధ్యక్షుడుగాను, డా. పరంధామయ్యగారు సెక్రటరీ గాను, శ్రీ కట్టా వెంకటసుబ్బారావుగారు ఉపాధ్యక్షుడుగాను, డా. సదాశివరావుగారు కోశాధికారిగాను, శ్రీ పువ్వాడ నాగేశ్వరరావుగారిని ఒక సభ్యునిగాను ఎన్నుకొనడమైనది. డా. పావులూరి కృష్ణచౌదరిగారు మకాం హైదరాబాదుకు మార్చుటవలన, ఆయన స్థానంలో నేను అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాను. కృష్ణచౌదరిగారు గవర్నమెంట్ హోమియో కాలేజి ప్రిన్సిపాల్గా వెళ్ళారు. కమ్మ హాస్టల్ మెంబర్షిప్ కూడా చాలా తక్కువగా ఉంటూ, టౌన్లోనివారు 10 మందిలోపు, టౌన్ బయటివారు అయిదారుగురు మాత్రమే వస్తూ ఉండేవారు. వారిలో శ్రీ చింతమనేని శివరామయ్యచౌదరి (తెనాలి), శ్రీ గంటా కృష్ణారావు (అడ్వొకేట్, చీరాల), శ్రీ బొగ్గవరపు పెద్దఅమ్మయ్య (ఉప్పలపాడు, చిలకలూరిపేట దగ్గర) గార్లు

ప్రముఖులు. 1973 తరువాత నేను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తరువాత హాస్టల్‌లో విద్యార్థుల దగ్గర వసూలు చేయబడిన రుసుములో నికరాదాయం ఏమీ ఉండేదికాదు. ఉదాహరణకు - సంవత్సరానికి ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జెస్ క్రింద 36 రూపాయలు (4 నెలలకు ఒకసారి) వసూలు చేసేవారం.

| | |
|---|---|
| అప్లికేషన్ ఫారం ఫీజు | 2 రూ. |
| రీడింగ్ రూం ఫీజు | 3 రూ. |
| గేమ్స్ ఫీజు | 3 రూ. |
| సాంస్కృతిక కార్యక్రమాలు, వార్షికోత్సవం | 3 రూ. |
| కరంటుకు | 25 రూ. |
| 3 టర్మ్‌లకు 36×3 | 108 రూ. |

పైగా పూర్వం పెద్దలు ఏర్పరచిన నియమనిబంధనల ప్రకారంగా హాస్టల్లో ఉన్న విద్యార్థుల్లో 20% మందికి పై ఫీజుల్లో రాయితీలు, ఇంకా ఉచిత భోజనం - చాలా ఆలోచన చేసి, సమాజంలోని పెద్దలతో చర్చించి ఈ ఫీజులు మార్చి, క్రమంగా ప్రతి సంవత్సరమూ 10, 20 వేల మధ్య నికరాదాయం వచ్చేట్లు మార్చుట జరిగింది. 1975 వరకు వార్డెన్ శ్రీ ఎం. కోటేశ్వరరావుగారు తన స్వంత ఖర్చులతో రాకపోకలు సాగిస్తూ నిర్వహణ చేసేవారు. అందువలన రూ. 50/- లు గౌరవభృతి ఇవ్వడం జరిగింది. అప్పటి జీతాల వివరములు

| | |
|---|---|
| గుమస్తా | రూ. 140/- |
| వంట మనిషి | రూ. 112/- |
| అసిస్టెంట్ | రూ. 60/- |
| వాచ్మెన్ | రూ. 50/- |
| క్లీనర్స్ | రూ. 45/- |

(ఇవి రివైజ్డ్ శాలరీస్)

హాస్టల్లో రెండు పూటల తినగలిగినంత రుచికరమైన, శుచియైన మంచి భోజనం మాత్రం లభించేది. పడక నేలమీద. చాప, దిండు వారే తెచ్చుకొనేవారు. ఏదో పెద్ద పెద్ద పండుగలు, వార్షికోత్సవముల సందర్భములలో మాత్రమే స్పెషల్ భోజనం, మాంసాహారం, గారె, తీపి వగైరాలు. మంచం, చదువుకొనుటకు బల్లలు, కుర్చీలు ఏమీ ఉండేవికావు. 2010 సంవత్సరము నుండి తినగలిగినంత టిఫిన్, మధ్యాహ్న, రాత్రి భోజనం, మంచం, టేబుల్, కుర్చీ, ఫ్యాన్, ట్యూబ్ లైటు...సర్వసదుపాయము లతో హాస్టల్ విరాజిల్లుతున్నది. మెస్ బిల్లు 1950 లలో నెలకు రూ. 50/- చొప్పున, 1960 లలో రూ. 100/- లోపు, 1970 లలో రూ. 200/- లోపు, 1980 లలో రూ. 250-300 లోపు, 1990 లలో రూ. 350-400 వరకు ఉండేది. ఈ మెస్‌బిల్లు కాక నిర్వహణ ఖర్చులు అదనముగా ఉండెడివి. వారాలు పొందే విద్యార్థులకు మినహాయింపు. ఈ నిర్వహణ ఖర్చు 1950 లలో సంవత్సరమునకు రూ. 200/- నుండి పెరుగుతూ వచ్చి, 1990 లలో రూ. 600/- అయినది. ఈ నిర్వహణ ఖర్చు రూ. 200/- చొప్పున 3 టర్మ్‌లుగా వసూలు చేసెడివారము. ఇందులో ముఖ్యముగా కరెంటు బిల్లులు, టెలిఫోన్ బిల్లులు, ప్రింటింగ్, స్టేషనరీ, పాతభవనం రిపేరు, జీతభత్యములు వగైరాలు ఉండేవి.

క్రమక్రమంగా జీవితసభ్యులను చేర్చుకొని మొత్తం 70 మంది సభ్యులుగా నమోదు చేయబడినది. మొదటి నుండి అనగా 1970 నుండి 1990 వరకు డాక్టర్ గణేశుని పరంధామయ్యగారు సెక్రటరీగా పనిచేసి నాకు సంపూర్ణ సహకార మందించారు. శ్రీ పాటిబండ్ల వెంకటప్పయ్యగారు కూడా కోశాధిపతిగా సంపూర్ణ సహకారమందించారు. గత 42 సంవత్సరము లలో అనేకమంది మిత్రులు ఏ విషయంలోనూ విభేదించలేదు. కొంతకాలము శ్రీ కోగంటి వెంకటేశ్వరరావుగారు, శ్రీ దేవరపు సూర్యనారాయణగారు, శ్రీ పాపినేని లక్ష్మీనారాయణగారు, శ్రీ నాగళ్ళ చలపతిరావుగారు పూర్తిగా సహకరించారు.

1976 లో జరిగిన ఒక సంఘటన చెప్పుకోదగినది. ఆ సభకు 32 మంది హాజరైనారు. అదే సభలో మరొక 19 మందిని సభ్యులుగా చేర్చుకొన్నాము. అప్పటికి 70 మంది జీవితకాల సభ్యులుగా నమోదు అయినారు. అసంతృప్తికరమైనా చరిత్రాత్మక నిర్ణయాలు గనుక, రాబోయే తరాలవారికి కూడా మార్గదర్శకముగా ఉండవలయునని కోరుకుంటూ చెబుతున్నాను.

1. కమ్మ హాస్టల్ పేరులోని 'కమ్మ' పదమును తొలగించుట.

2. కమ్మవారికే కాకుండా ఇతర విద్యార్థులకు కూడా వసతి సదుపాయము కల్పించుట.

3. కమ్మ హాస్టలుని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటికీ అనుబంధము చేయుట.

ఈ 3 విషయములు తీర్మానములో వీగిపోయినవి. ఇద్దరు మాత్రమే విభేదించారు. వేరొక ఇద్దరు మీటింగుకు రాలేదు. మరల ఎప్పుడూ ఈ రకమైన సన్నివేశాలు ఏర్పడకుండా అన్నీ ఏకగ్రీవముగా సమైక్య అభిప్రాయముతో హాస్టల్ నిర్వహించబడుచున్నది. ఈ సందర్భంలో సెక్రటరీ డా. పరంధామయ్యగారు నాకు దృఢమైన తోడ్పాటు అందించారు. మన ఆంధ్రరాష్ట్రములో గత 90 సంవత్సరాలుగా నిరాటంకముగా, సరైనరీతిలో, క్రమశిక్షణతో, చక్కటి వాతావరణముతో, అతి తక్కువ ఖర్చుతో నిర్వహించ బడుతున్న హాస్టల్ గుంటూరులోని కమ్మ హాస్టల్ మాత్రమే! ఇది మన గుంటూరువాసులు గర్వించదగిన విషయము.

అనేకచోట్ల హాస్టళ్ళు ఉన్నవి. వాటికి బిల్డింగులు మాత్రమే ఉన్నవి. వేరే ఆఫీసులకు, సంఘాలకు అద్దెకివ్వబడిగాని, ఆ బిల్డింగుల అద్దెల ద్వారా వచ్చే ఆదాయము పేద విద్యార్థులకు అందజేయుట జరుగుచున్నది. ఈ దశకు కారణాలనేకములు. ముఖ్యంగా మేనేజిమెంటులో తగాదాలు,

గ్రూపులు, రాజకీయాలు, నిర్వహణలో నున్న ఈతిబాధలు సమర్థించుకోలేకపోవడం, అంకితభావం, ఐక్యత లోపించడం మొదలైన అనేక కారణాలు.

1977లో సంభవించిన భయంకరమైన తుఫాన్‌వల్ల జరిగిన నష్టమును పూరించుకొన్నాము. 1978 వ సంవత్సరము డిసెంబరు నెలలో 'కమ్మజన సేవాసమితి' వారికి ఆఫీసు లేనందున వారి కోర్కె మేరకు జంపాల సాంబయ్య హాస్టల్ భవనములో మన ఆఫీసు ప్రక్కనున్న ఈశాన్యమూల గదిని కొన్ని షరతులతో, అద్దె లేకుండా 18 మాసములపాటు వాడుకొనుటకు ఇచ్చాము. తరువాత ఆ సమితివారి కోర్కె మేరకు ఆ గడువును మరొక సంవత్సరం పొడిగించాము.

హాస్టల్లో ఉండేవారి డిమాండ్ పెరుగుట వలన 1970లో నున్న 100 మంది విద్యార్థుల సంఖ్యను అనేక మార్పులుచేసి కొన్ని వరండాలను, హాస్టల్‌ను పార్టిషన్ చేసి 115కు తేగలిగాము. కాని హాస్టల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున నిస్సహాయ పరిస్థితులలో ఉన్నాము. తీర్మానం ప్రకారం, గుంటూరులో కాలేజి విద్య నభ్యసించుటకు కొత్తగా గ్రామాల నుండి వచ్చు విద్యార్థులకు ఇంటర్మీడియెట్‌వారికి తప్పనిసరిగా ఇవ్వవలయునని, మిగతావి డిగ్రీ, యం.బి.,బి.ఎస్., బీ.టెక్., పి.జి. కోర్సెస్‌వారికి ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే ఇవ్వవలయునని నిర్ణయించడమైనది.

రెండు సమస్యలు నన్ను బాగా వత్తిడి చేయుచుండెడివి. ఒకటి వసతి. రెండు హాస్టల్ - నియమనిబంధనల ప్రకారం 20% ప్రతిభగల పేద విద్యార్థులకు ఉచిత భోజనము, నివాసము కల్పించుట. మొదటిదానికి ముఖ్యదాత ఎవ్వరూ ముందుకు రానందున, 10 మంది మిత్రులము సమావేశమైనాము. కొత్త భవనం తక్కువ ఖర్చుతో జంపాల సాంబయ్య హాస్టల్ బిల్డింగు ప్రాంగణంలో దక్షిణపు వైపున ఉన్న ఖాళీస్థలము, అంటే

అరండల్‌పేట 3వ లైనుకు ఆనుకొనియున్న 8 రూములు క్రింద మరొక 8 రూములు పై అంతస్తులో నిర్మాణం చేసి, తగిన శానిటరీ సదుపాయములు కల్పించుట. దీనికిగాను ది. 28-8-1980 గురువారం మధ్యాహ్నం గం. 2-57 ని.లకు ముహూర్తం నిర్ణయించి, నేనే అధ్యక్షుడుగా శంకుస్థాపన చేయటం జరిగింది. ఆరోజు ఉదయం 10 గం.లకు ఒక సభ ఏర్పాటుచేసి పురప్రముఖులను ఆహ్వానించగా 110 మంది పుస్తకములో సంతకం చేసినారు. అందరి విరాళములు కలిసి రూ. 250/- నుండి రూ. 5000/- వరకు వాగ్దానం చేసినది రూ. 36,898/- మాత్రమే. కొన్ని వందలమంది కమ్మవారు మీటింగ్‌కు హాజరైనారు. ఆ సభకు శ్రీ తేళ్ళ కృష్ణమ్మచౌదరిగారు అధ్యక్షత వహించినారు. శ్రీ పెద్ది వెంకటేశ్వరరావుగారు మాట్లాడి అందరినీ చేయూత నివ్వమని ప్రార్థించినారు. వీరిద్దరే నాకు కమ్మ హాస్టల్‌ను అప్పగించినది. హాస్టల్, దాని నిర్వహణను మెచ్చుకొన్నారు. ఆ సభకు అప్పటి వ్యవసాయశాఖా మంత్రిగానున్న శ్రీ యడ్లపాటి వెంకట్రావుగారు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే హైదరాబాదు కమ్మ సంఘము, ఇతరులు కూడా అభినందనలు తెలియజేసినారు. మన భవన ప్లాను ప్రకారం ప్రతిగదిలో ఒక ఫ్యాన్, 3 మంచములు, 3 అలమరలు, 3 టేబుల్స్, 3 కుర్చీలు, దగ్గరలో శానిటరీ సౌకర్యములతో ప్రణాళిక సిద్ధంచేసి పెట్టినాము. అప్పటికీ, ఇప్పటికీ ఆ రూములకే ఎక్కువ డిమాండు. భవన నిర్మాణ సమయంలో ఎన్ని మీటింగులు పెట్టినా ఐదారుగురు సభ్యులు, 6 లేక 7 మంది ప్రత్యేక ఆహ్వానితులు మాత్రమే వచ్చేవారు. చివరకు రూ. 5000/- ఇచ్చినవారికి వారుకోరిన పేరు ఒక గదికి పెడతాం అని అన్నప్పుడు మాత్రమే ఏడుగురు దాతలు ముందుకొచ్చారు. మిగతా 9 రూములకు దాతల ఇళ్ళకు తిరిగి వాగ్దానము చేయించుకొని, ఎక్కువమంది దగ్గర రూ.250/- వసూలు చేయగలిగినాము. శ్రద్ధ ఉన్నవారు హాస్టల్‌కు వచ్చి దాతల పేర్లు చూడగలరు. 1973 సం॥లో అప్పటి కమిటీవారు నాకు అప్పగించిన సొమ్ము రూ. 35,000/-. మన కమిటీ గత 10 సం॥ల నుండి కూడబెట్టిన ధనము, ఈ

విరాళములతో ఆ భవనము పూర్తి చేయుటకు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ వారి నుండి రూ. 25,000 విరాళము తెచ్చుకొన్నాము. క్రింది అంతస్తు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీవారి పేరుతోను, మన సమాజమునకు ఎనలేని సేవలు అందించిన 'కవిరాజు', సామాజిక విప్లవకారుడు శ్రీ త్రిపురనేని రామస్వామిచౌదరిగారి పేరు పెట్టవలయునని తీర్మానం చేశాము. అనుకొన్న ప్రకారం ఒక సం॥లో బిల్డింగ్ కట్టుబడి పూర్తిచేసి 8-10-1981 సాయంత్రం 3-30 ని.కు ఆనాటి హైకోర్టు మాజీన్యాయమూర్తి శ్రీ చల్లా కొండయ్యగారిచే ప్రారంభం చేయించినాము. చదరపు అడుగుకు రూ.35/- చొప్పున ఈ భవనము కరెంటు, శానిటరీ సౌకర్యములు అన్నీ కలిపి రెండు లక్షలైనవి. ఈ సందర్భముగా జరిగిన సభకు పురప్రముఖులెందరో విచ్చేశారు. సభను ఘనంగా నిర్వహించగలిగాము.

హాస్టల్ గత చరిత్రలోకి చూస్తే కులాభిమానముగల పెద్దలు ద్రవ్యమే కాక సుమారు 60 ఎకరముల భూమి నరసాయపాలెం, గోళ్ళమూడి, పెదకాకాని, గుంటూరు, వడ్లమూడి మున్నగు గ్రామాల వాస్తవ్యులు విరాళముగా ఇచ్చియున్నారు. 1945 సంవత్సరములో పైన ఉదహరించిన భూములన్నియు అమ్మి, ఆ వచ్చిన రాబడి ద్రవ్యముతో జంపాల సాంబయ్య హాస్టల్ భవనము కొని, కొంత ద్రవ్యముతో కొత్త హాస్టల్లో శానిటరీ సౌకర్యములు కల్పించారు. కాని దురదృష్టవశాత్తు ఈ భవనము కోర్టు తగాదాలలో పడి, 1964 సంవత్సరములో మాత్రమే మన స్వాధీనంలోకి వచ్చినది. ఆ రోజులలో మన విద్యార్థి సంఘ విద్యార్థులకు, ఇంకా ఇతరులకు చేసిన గొప్పసేవలకు, ముఖ్యంగా లక్ష్మీదేవమ్మగారి కమ్మ సత్రము బిల్డింగును హాస్టల్‌గా దఖలు పరచడంలో చేసిన కృషికి గుర్తింపుగా, ఈ రెండవ బిల్డింగును వారిపేరుతో 'జంపాల సాంబయ్య కమ్మ హాస్టల్'గా నామకరణము చేశారు. నేను నా వైద్యవృత్తిలోనున్న మొదటి సంవత్సరములలో అనగా 1958-62 ప్రాంతాల్లో ఈ బిల్డింగులో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసు ఉండేది.

నేను స్వయంగా నా ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ ఆడిటర్ లేకుండా సబ్మిట్ చేశాను. అప్పటి ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసరు శ్రీ నాగయ్యగారు చతురుగా "నీవొక్కడివే ఆడిటర్ లేకుండా సబ్మిట్ చేశావు" అని అభినందించి, కాఫీ ఇచ్చి పంపారు. ఇది 1961 సంవత్సరము నాటిమాట.

టైమ్ గడిచిన కొద్దీ హాస్టల్ డిమాండు పెరుగుతూనే ఉంది. 1988 లో 175-180 ఉండేవారు. కనీసం 25, 30 మందికి అదనంగా వసతి కల్పించుట అవసరముగా ఉండెడిది. 1970 నుండి చాలా గొప్పగా, సర్వ అవసరాలను తానే సమర్ధించుకొంటూ, పరిపాలనా కష్టనష్టాలను భరించి, కమిటీలోగాని, పట్టణములోగాని, కమ్మ సమాజములోగాని పేరుతెచ్చుకొన్న కామర్స్ డిపార్ట్‌మెంట్ లెక్చరర్ శ్రీ మారుపూడి కోటేశ్వరరావుగారు 1987 జూన్‌లో రాజీనామా చేయడంతో, తప్పనిసరిగా దీటైన వార్డెన్‌ను నియమించవలసిన అవసరం ఏర్పడింది. నా మనస్సులో ఎప్పటి నుంచో మెదలుచున్న ఆలోచన - ఇప్పుడున్న సెక్రటరీ శ్రీ నామినేని కోటేశ్వరరావుగారే! వారిని కోరినంతనే సంతోషంగా బాధ్యతలు తీసుకొనుట సరైన నిర్ణయముగా జరిగింది. పదవీ విరమణ చేసిన శ్రీ మారుపూడి కోటేశ్వరరావుగారి అనారోగ్య కారణం ఇంకొకటి. వారు విద్యార్థి లోకములోను, మేనేజిమెంటువారి దృష్టిలోను కూడా చాలా సమర్ధుడైన వార్డెను. ఇటీవలే అంటే 2012 సంవత్సరములో వారిని, వారి పూర్వ విద్యార్థులు, మా కమిటీవారి సమక్షంలో ఈ హాస్టల్ ప్రాంగణంలో మరపురానటువంటి ఘనసన్మానముతో సత్కరించాము.

ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జాతీయ పండుగలు రెండూ స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), రిపబ్లిక్ దినోత్సవం (జనవరి 26) జరుపుకొనుచున్నాము. కమిటీ సభ్యులలో ఒకరుగాని, పురప్రముఖులలో వేరొకరుగాని తప్పనిసరిగా జెండా ఎగురవేసి, వారి సందేశం ఇవ్వడం జరుగుతుంది. ఆ రెండు పండుగల రోజున మన విద్యార్థులకు జాతీయ

భావము, మన స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, క్రమశిక్షణ, కఠోర పరిశ్రమ అవసరాలను తెలియజేయుచూ, వారిని సన్మార్గములో ఉంచగలుగుతున్నాము. మొదటి నుండి ఈరోజు వరకూ క్రమశిక్షణారాహిత్యాన్ని కఠినముగా ఎదుర్కొంటూ, అవసరమైతే హాస్టల్ నుండి బైటకు పంపివేయుట జరుగు చున్నది. కొన్ని సందర్భములలో పిల్లలు అల్లరి చేయటం, తమలో తాము పోట్లాడుకోవటం, ఇరుగు పొరుగువారితో అరుదుగా గొడవలుపడటం జరుగుతూ ఉండినది.

కొన్నిసార్లు వార్డెన్‌గారు, నేను కూడా పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కవలసిన సందర్భాలున్నాయి. విద్యార్థుల సంఖ్య పెరిగిన కొలదీ పాత డైనింగ్ హాలును తూర్పు దిశగా పెంచి, ఇంకొక 30 మంది కూర్చొని భోజనం చేయు సదుపాయం కల్పించవలసి వచ్చినది. 1960లలో శ్రీ పాములపాటి ప్రసాదరావుగారు ఇచ్చిన విరాళముతో నిర్మించిన మద్రాసు దంతేల రూఫ్‌తోనే 2004 వరకు నెట్టుకురావడం జరిగింది. ఆ డైనింగ్ హాలు పైన రీడింగ్ రూము, టీవీ, లైబ్రరీ నిర్మించి మెట్లు కూడా ఏర్పాటు చేయటం జరిగింది.

ప్రతి రెండు సంవత్సరముల కొకసారి తప్పని సరిగా వార్షికోత్సవము జరుపుకొనుచున్నాము. నాకు గుర్తున్నంత వరకు 1972 లో శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారిని, తరువాత శ్రీ చింతమనేని శివరామయ్య (ప్రముఖ న్యాయవాది)గారిని, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుగారిని ఆహ్వానించాము. పట్టణములోని విద్యావంతులలో నుండి గాని, డాక్టర్స్, న్యాయవాదుల నుండి గాని, విరాళమిచ్చిన దాతల నుండి గానీ, ఆఫీసర్స్ నుండి గాని, పూర్వ విద్యార్థుల నుండి గాని వక్తలను పిలిచి, గౌరవించి, వారి సందేశాలు మన విద్యార్థులు విని, ఆచరించే విధంగా చేయడం జరుగుతున్నది.

చరిత్రలో గుర్తుండిపోయే విషయం - 1988 డిసెంబరు 26 వ తేదీన జరిగిన మారణకాండ. ఎక్కడో విజయవాడలో ఒక వ్యక్తి చనిపోవడం లేక చంపివేయబడటం, ఆ రోజున ఉన్న కమ్మ ప్రభుత్వం మీది ద్వేషము, కమ్మకులము మీద నున్న అసూయ, అప్పటి ప్రభుత్వమువారి అసమర్థత

కారణంగా పట్టణంలో కేవలం కమ్మవారు మాత్రమే నిర్వహించే అన్ని సంస్థలు దారుణదహనకాండలో ధ్వంసమైనవి. వాటిల్లో మొదటిది కమ్మ హాస్టల్, హాస్టల్లో చొరబడి పట్టపగలు ఉదయం 9-10 గం. మధ్య హాస్టల్‌ను తగులబెట్టడం, పిల్లల పుస్తకాలు, సామాగ్రి, బట్టలు, సైకిళ్ళు వగైరాలు ఎత్తుకుపోవటం, మెయిన్‌రోడ్ మీదకు వచ్చి రెండు హాస్టల్స్‌పై దాడిచేయటం చరిత్ర మరువలేనిది. హాస్టల్ అధ్యక్షుడినైన నా ఇల్లు, నా హాస్పిటల్, జే.కె.సి. కాలేజి, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు, కె.ఎల్.పి. పబ్లిక్ స్కూలు... ఇంకా ఇతర ప్రముఖ కమ్మవారి ఇళ్లు, వారి వారి సంస్థలను లూటీ చేసి సాయంత్రానికి భయోత్పాతం సృష్టించారు.

విద్యార్థుల డిమాండు ప్రకారం లోగడ రెండు అంతస్తులుగా నిర్మించిన భవనం జంపాల సాంబయ్య హాస్టల్లో దాని పైన మరొక అంతస్తు నిర్మాణం చేయ నిర్ణయించి, శ్రీ నామినేని కోటేశ్వరరావుగారి పర్యవేక్షణలో 1992 జనవరిలో ప్రారంభించి మూడు నెలలలో 8 రూముల నిర్మాణం పూర్తి గావించాము. జంపాల సాంబయ్య హాస్టల్ బిల్డింగ్ మొత్తమునకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజి, మున్సిపల్ వాటర్ కనెక్షన్ తీసుకోవడం జరిగింది. ఈ మూడవ అంతస్తు ఒక్కొక్క రూముకు రూ. 20,000/- విరాళమిచ్చిన వారి పేరుతో గదుల నిర్మాణము అతి తక్కువ సమయములో పూర్తి అయినది.

1995 నాటికి అన్ని అవసరాలు, అన్ని ధరలు (నిత్యావసర సరుకులు) పెరుగుచూనే ఉన్నాయి. ప్రతి రెండు, మూడు సంవత్సరములకు స్పెషల్ ఫీ ఫండ్ పెంచడం అనివార్యమైనది. స్పెషల్ ఫీ అనగా నీటి పన్నులు, కరెంటు బిల్లులు, టెలిఫోన్ బిల్లులు, స్టేషనరీ & ప్రింటింగ్ ఛార్జీలు మొదలగునవి. ఇవికాక రెండు, మూడు సంవత్సరములకు ఒకసారి వైట్‌వాష్, పెయింట్స్ వేయించుట, వీటితోపాటు పని చేయువారి జీవితావసరాలకుగాను నెలవారీ జీతాలు పెంచవలసిన అవసరం ఏర్పడింది. మెస్‌బిల్ నెల నెలా రూ.400/- మాత్రమే. భోజనం (రెండు పూటలు), టిఫిన్ ఖర్చు రూ.400/-, ఎస్టాబ్లిష్‌మెంట్ రూ.40/-గా ఉండేది. దీనిలోనే పేదవారికి మళ్ళీ రాయితీలు.

ప్రతి సంవత్సరం వరుసక్రమంగా అనేక సంవత్సరముల నుండి డాక్టర్ జాష్టి వెంకటేశ్వర్లుగారు అమెరికా నుండి మన హాస్టల్‌లోని పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1200 నుండి రూ. 2000 వరకు సహాయము చేయుచున్నారు. అలాగే మరొక పూర్వ విద్యార్థి శ్రీ జాష్టి వెంకటరత్తయ్యగారు కూడా అమెరికా నుండి మరియు 'చౌదరి'గారు మద్రాసు నుండి పిల్లలందరకు మంచములు, ఫ్యాన్లు అవసరమని మమ్ములను ప్రోత్సహించి వారు ద్రవ్యరూపమున భారీ యెత్తున సహాయము చేసినారు.

ఆనవాయితీగా సంవత్సరమునకు మూడు ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్‌లు, ఒకటి రెండు ఎకౌంట్స్ (జమా ఖర్చులు) సమావేశములు జరిపి, అందరితో చర్చించి, ఒప్పించి మాత్రమే ఏదైనను పని చేసేవారము. ఆనాటికి (1980, 1990లలో) ఎక్కువ మంది సభ్యులు పాల్గొనేవారు. అంటే 10 మంది లోపు ఎగ్జిక్యూటివ్ బాడీ, 20 మంది జనరల్ బాడీ, 30 లోపు ఎన్నికల మీటింగులకు. డా. గోపాలకృష్ణ, దేవరపు సూర్యనారాయణ, కోగంటి వెంకటేశ్వరరావు, పాటిబండ్ల వెంకటప్పయ్య, డా. పరంధామయ్య, నాగళ్ళ చలపతిరావు, పాపినేని లక్ష్మీనారాయణ, గుళ్ళపల్లి రామారాయుడు, కొర్రపాటి రామారావుగార్లు మరియు వార్దెను తప్పనిసరిగా పాల్గొనేవారు. 1970 నుండి 1993 వరకు డా. పరంధామయ్యగారు సెక్రటరీగాను, 1993 నుండి 2010 వరకు శ్రీ పాపినేని లక్ష్మీనారాయణగారు సెక్రటరీగా కొనసాగారు.

శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి హాస్టల్లో క్రింది అంతస్తులో సగము భాగము గ్రామీణరైతులు, పేదవారు ఉండుటకు వీలుగా పెద్దహాలుగా నుండెడిది. మిగిలిన సగము భాగము రూములుగా నుండి, మరలా అందులో సగము వెలుతురు లేక నిరుపయోగముగా నుండుటచే వాటిని స్టోర్ రూములుగా మార్చటమైనది. ఇదే సమయములో క్రింది అంతస్తులోనున్న సత్రము భాగమును 6 రూములుగా మార్చి మరి కొంతమందికి అనగా 15 మంది వరకు నివాసయోగ్యముగా మార్చటమైనది. ఇక్కడ, జంపాల

సాంబయ్య హాస్టల్లో కూడా కొన్ని పార్టిషన్లు చేయుట వలన సుమారు 240 మంది విద్యార్థులు ఉండే సదుపాయము ఏర్పడింది. కాని అప్పటి రోజులలో విద్యార్థులకు సైకిలే ప్రయాణ వాహనము. ఇప్పుడు రోజులు మారాయి. చాలా తక్కువమంది మాత్రమే సైకిళ్ళు వాడుతున్నారు. 1980, 1990 వరకు పాత హాస్టల్లో 70 నుండి 80 మంది సైకిళ్ళు పార్కు చేసుకొనుటకు కొత్త షెడ్డు డైనింగ్ హాలుకు తూర్పుగా నిర్మించటమైనది. అదే విధముగా కొత్త హాస్టల్లో బిల్డింగుకు పడమర భాగము శిధిలావస్థకు రావటంతో, ఆ పెంకుటిల్లు, కొంత డాబా పోర్షను కూడా తీసివేసి ఒక సైకిల్ షెడ్డు 70, 80 సైకిళ్లు పెట్టుకొనే సౌకర్యము కల్పించవలసి వచ్చినది.

రెండు హాస్టల్ బిల్డింగులు సున్నముతో గోడల మీద కప్పుతో కట్టబడి, కప్పు క్రింద అంతస్తు నుండి చిన్న చిన్న వర్షములకు కూడా కారుచు, టేకు కలప చెడిపోయే స్థితి వచ్చినందున, ఒక సంవత్సరం పాత హాస్టల్లో, మరొక సంవత్సరం కొత్త హాస్టల్లో పై అంతస్తు పైభాగములో చక్కగా వాస్తుబద్ధముగా రిపేరు చేయించినాము. అప్పటి నుండి ఈరోజు వరకు (1980 నుండి 2024) ఎటువంటి లీకులు లేవు అని వ్రాయుటకు ఆనందముగా నున్నది.

1999 సంవత్సరము నాటికి అన్ని అవసరాలు తీరాయి అని సంతోషంగా ఉన్నాము. ఆనాటికి విద్యార్థులు సుమారుగా 210 మంది ఉంటున్నారు. ఖర్చులు పెరిగినప్పుడు స్పెషల్ ఫీజు క్రింద, ఎస్టాబ్లిష్మెంట్, విద్యుత్తు, నీరు మొదలగువాటికి సంవత్సరమునకు రూ. 2000/- వసూలు చేయుట జరుగుచున్నది. మెస్ బిల్లు నెలకు రూ. 500/- వరకు వచ్చుచున్నది. అక్కడక్కడ ఆత్మహత్యలు పెరుగుచున్నవి అను ఆలోచనతో మనకున్న రెండు హాస్టల్సులోని పెద్దబావులు (9) ఇనుప జల్లెళ్లతో మూసివేసినాము. వార్డెను శ్రీ నామినేని కోటేశ్వరరావుగారు రాజీనామా చేయగా, జే.కె.సి. కళాశాల తెలుగుశాఖ లెక్చరర్ డా. పులిచెర్ల సాంబశివరావుగారిని వార్డెనుగా నియమించడమైనది. శ్రీ నామినేని కోటేశ్వరరావుగారిని కోశాధికారిగా

ఎన్నుకొనటమైనది. నా దీర్ఘకాల ప్రణాళికలో హాస్టలు విద్యార్థులు గుంటూరు పట్టణంలో స్థిరపడినవారిని కొంతమందిని ఎగ్జిక్యూటివ్ కమిటీలోకి తీసుకొన్న యెడల, హాస్టలులోని కష్టసుఖములు వారనుభవించినారు గనుక, వారికి సరియైన అవగాహన కలిగి యుండి హాస్టలు చక్కగ నిర్వహించగలరని ఆశ. అన్ని రూములకు ఒక ట్యూబ్‌లైటు, ఒక్కో విద్యార్థికి ఒక టేబులు, ఒక కుర్చీ, ఒక మంచము మొదలైన సౌకర్యములు కల్పించగలిగాము. కాని కరెంటు బిల్లులు, మునిసిపాలిటీ పన్నులు ఎక్కువ కావటంతో విద్యార్థుల నుండి అదనంగా వసూలు చేయవలసిన పరిస్థితి ఏర్పడినది. ఐనా సరే ఏరోజున పోల్చుకున్నా నాటికీ నేటికీ బయట నివసించే విద్యార్థి ఖర్చులో సగమే ఇక్కడ అవుతున్నది. దీనిలోనే పేద విద్యార్థులకు రాయితీలు, అనగా ఒక టర్మ్ మాత్రమే ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జీలు చేయుచుంటిమి. క్రమక్రమముగా జంపాల సాంబయ్య హాస్టలులో పడమర వైపునున్న భవనము (పెంకుటిల్లు) శిధిలావస్థకు చేరినందున, దానిని తొలగించి, అదేచోట ఒక సైకిల్ షెడ్డు నిర్మాణం చేసినాము. అందువలన కొన్ని రూములు తగ్గిపోవటంతో విద్యార్థుల సంఖ్యను 180కి మాత్రమే పరిమితము చేయవలసి వచ్చినది.

మన కమ్మ విద్యార్థి సహాయక సంఘమునకు లోగడ శ్రీ పాటిబండ్ల సీతారామయ్యగారు వారికున్న భూముల నుండి, అమరావతిరోడ్డులో గల 1 ఎకరము, 75 సెంట్లు విరాళముగా ఇచ్చి యున్నారు. ఆ సమీపములోనే చలపతి స్కూలు, కాలేజీలు స్థాపించుటవలన, మరియు లాంఫారం, మరికొన్ని నివాసకాలనీలు వచ్చుటవలన ఆ భూమియొక్క విలువ గణనీయముగా పెరిగినది. రియల్ ఎస్టేటువారు ప్లాట్లు వేయుటకు మన భూమికి వెనుకవైపున భూమిని కొని, మన భూమిలో నుండి 40 అడుగుల వెడల్పు రోడ్డు కావలయునని కోరినందున మన సర్వసభ్య సమావేశములో చర్చించి, మనకు పోయే భూమికిగాను వారు మనకు ఆనుకొనియున్న మన భూమిలో కలిసే ప్లాట్లకు రెట్టింపు భూమి ఇచ్చేవిధంగా అంగీకారము చేయించుకొని, ఒక

ఒప్పంద పత్రం రిజిస్ట్రేషన్ చేయించుకొని, సీతారామయ్యగారు ఇచ్చిన భూమిని కొంతమేర పెంచగలిగాము. ఆ భూమియొక్క మంచిచెడులు, కౌలు వసూలు చేయుట మొదలగు విషయములన్నీ మన కోశాధికారిగానుండిన శ్రీ పాటిబండ్ల వెంకటప్పయ్యగారే చూచుకొనుచుండిరి.

మన హాస్టలు చక్కటి వసతులతో, మంచి క్రమశిక్షణతో, తక్కువ ఖర్చుతో నిర్వహించబడుచున్నది అని అనేకమంది ద్వారా తెలుసుకొని, దాతృత్వం కలిగిన వనజాక్షమ్మ అనే మహిళ మనస్ఫూర్తిగా ముందుకువచ్చి వారి గ్రామమైన కోపల్లెలో, బకింగ్‌హామ్ కాలువకు దగ్గరలోని చాలా విలువైన మాగాణి భూమిని య. 2-14 సెంట్లు వారి 'వీలునామా' ద్వారా మనకు విరాళముగా ఇచ్చియున్నారు. వారికి సంతానము లేదు. కాని మేము వారసులమని కొంతమంది ఆమె బంధువులు పేచీ పెట్టుకొని, కోర్టులో దావా వేశారు. కాని ఆ గ్రామస్థులైన శ్రీ కృష్ణారావుగారు స్వయంగా శ్రద్ధ తీసుకొని మన ఆధీనములోనికి వచ్చునట్లు చేయగలిగినారు. ఈ సందర్భముగా అప్పటి కార్యదర్శి శ్రీ లక్ష్మీనారాయణగారితో కలిసి నేను నా కారులో ఆ గ్రామము వెళ్ళవలసి వచ్చినది. కోర్టు వ్యవహారం తెనాలిలో ప్లీడరుగా ప్రాక్టీసు చేయుచున్న నా తోడల్లుడు, కమ్మ హాస్టలు పూర్వ విద్యార్థి అయిన శ్రీ కోట లోకనారాయణ గారు ఫీజు తీసుకోకుండా కేసును చేపట్టి మనకు వచ్చేటట్లు చేయగలిగినారు. ఇదే పూర్వ విద్యార్థి చేయగల సాయము. ఈ కేసు విషయములో నేను, లక్ష్మీనారాయణగారు తెనాలి వెళ్ళి అప్పటి మాజీ మంత్రి, లోక్‌సభ సభ్యుడు, హాస్టలు పూర్వ విద్యార్థి అయిన శ్రీ యడ్లపాటి వెంకట్రావుగారిని, అలాగే అప్పటి శాసనసభ్యులైన డా॥ ఉమగారిని, ఇంకా కొంతమంది పెద్దలను కలిసి మాట్లాడినాము. తత్ఫలితంగా జిల్లా కోర్టులో మనము గెలుచుట, వనజాక్షమ్మగారి వారసులమనబడేవారు హైకోర్టుకు అప్పీలు చేయకపోవుట వలన ఆ భూమి (ఎ. 2-14 సెంట్లు) మన వశమైనది. దానిపై వచ్చే ఆదాయం మనకే చెందుతున్నది. 2001 సంవత్సరం చివరిలో డా. పులిచెర్ల సాంబశివరావుగారు రాజీనామా చేయగా, వారి వార్డెన్‌స్థానము

మన జే.కె.సి. కళాశాల నుండే కామర్స్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ శ్రీ గోగినేని సాంబశివరావుగారిని వార్డెనుగా నియమించుట జరిగినది. పూర్వపు వార్డెను శ్రీ నామినేని కోటేశ్వరరావుగారు కోశాధికారిగా వ్యవహరించుచుండిరి. లోగడ మన హాస్టల్‌కు మునిసిపాలిటీవారి పన్ను నామమాత్రంగా ఉండేది. 1995లో మున్సిపల్ కార్పొరేషన్ కావటం, ఆ తర్వాత కాలంలో ఇంటి పన్నులు గణనీయంగా పెరిగినవి. మన మంచిగాని, మన సేవలుగాని, మన పలుకుబడి గాని పనిచేయలేదు. 2001 నుండి ప్రతి సంవత్సరమునకు రెండు హాస్టల్ బిల్డింగ్‌లకు కలిపి రూ. 1,75,000/- వరకు, అదనముగా నీటిపన్ను చెల్లించవలసిరావటంతో ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జీలు బాగా పెంచవలసివచ్చినది.

2001లో పాత హాస్టల్ అనగా శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి హాస్టల్‌కు ఎపుడో కట్టవలసిన ప్రహరీగోడ దక్షిణపు దిక్కున చాలా అందముగా శేకూరు ఎఱ్ఱరాయితో కట్టుకోగలిగాము. 3 సంవత్సరములకు రెండు హాస్టల్స్‌కు పెయింట్స్ వేయుట, వెల్ల వేయుట జరుగుచున్నది. రెండు హాస్టల్స్‌లో నున్న వాచ్‌మెన్లు మన పరిసరములు, లోపలి ఆవరణను చాలా శుభ్రముగా నుంచుచూ, వచ్చిపోయేవారికి, ముఖ్యంగా పూర్వ విద్యార్థులకు, NRI మరియు అమెరికా నుండి వచ్చేవారికి చాలా ముచ్చటగా ఉండెడిది. రెండు బిల్డింగులు చాలా పురాతనమైనవి కావున, అందు 1910లో నిర్మించినవి కావున, కరెంటు సప్లై తరచూ పోవుచుండుట వలన దాదాపు కొత్త వైరింగు చేయవలసి వచ్చినది. పాత హాస్టల్లో త్రాగునీరు (ఆక్వాగార్డ్) సప్లై చేయడమైనది. 2004లో పూర్వ విద్యార్థులు, ముఖ్యంగా డా. జాష్టి వెంకటేశ్వర్లు (జె.వి.)గారు, శ్రీ జాష్టి వెంకటరత్తయ్యగారు, శ్రీ మద్రాసు చౌదరిగారు, ఇంకా అనేకమంది సహాయపడిరి. పేద విద్యార్థులకు వారములిచ్చు దాతలు క్రమంగా తగ్గుట, హాస్టల్ విద్యార్థుల సంఖ్య పెరుగుట, తత్ఫలితముగా ఎక్కువ వారములు పొందు విద్యార్థుల సంఖ్య పెరుగుట, 20% మందికి సహాయం చేయుట కష్టమనిపించుచున్నది. అందువలన మనం జాతీయ బ్యాంకులో ఒక ఖాతా

తెరచి 'పర్మినెంట్ ఫండ్' అనేది ఏర్పాటు చేయవలయునని తీర్మానించి, ఆ ఫండుపై వచ్చే ఆదాయము (వడ్డీ) పేద విద్యార్థులకు వారములు ఇస్తే బాగుండునని భావించి, ఆచరణలో పెట్టి సుమారు 10-15 లక్షల రూపాయల వరకు బ్యాంకులో వేయగలిగినాము.

కాని మన సంఘములోనివారు, కమిటీవారు, పట్టణ, పల్లెల పెద్దల నుండి విద్యార్థులకు ఇంకా ఎక్కువమందికి ఏర్పాటు చేయవలయునని సలహాలు, సూచనలు ఎక్కువగా వచ్చినవి. దీనికి కారణం చక్కటి నిర్వహణ మాత్రమే కాక, కొత్తగా ప్రభుత్వమువారి అనుమతితో ప్రారంభించిన ఇంజినీరింగ్ కాలేజీలు, ఎం.సి.ఏ., ఎం.బి.ఏ. కాలేజీలు.

2005 సంవత్సరమునాటికి విద్యార్థులుండుటకు చాలా వత్తిడి పెరగటం, మున్సిపల్ కార్పొరేషన్‌వారు వేయు పన్నులు క్రమక్రమంగా పెరిగి, విద్యార్థుల మీద భారము పెరిగిపోవుచున్నది. వారముల భారము కూడ కష్టమగుచున్నది. వారములిచ్చేవారు భోజన ఖర్చులివ్వగలరు గాని, నిర్వహణ ఖర్చులు పేద విద్యార్థి కూడా కొంత భరించవలసి వచ్చినది.

రెండు సంవత్సరములు ఆలోచించి, కొత్త భవనములు నిర్మించి, అందులో 200 నుండి 350 మంది వరకు విద్యార్థులు ఉండేలాగుననూ, కొత్త భవనాలలో అన్ని సదుపాయములు కల్పించి, రెండు బిల్డింగులలో క్రింది అంతస్తులు అద్దెలకు ఇచ్చినయెడల, ఆ అద్దెల ద్వారా వచ్చు ఆదాయం, మున్సిపల్ టాక్స్‌లకు (ఆస్తి పన్ను, నీటి పన్ను), కార్పొరేషన్‌వారు విధించు నిర్వహణ టాక్స్, క్రమం తప్పకుండా పెరిగే కరెంటు చార్జీలు చెల్లించే సౌలభ్యం ఏర్పడగలదని ప్లాను. కాని ఆ భవనములు నిర్మించుటకు అయ్యే వ్యయము ఎలా సాధ్యపడుతుంది. దాదాపు కోటిన్నర లేక రెండుకోట్ల రూపాయలు ఎలా తేగలమా అనే ఆలోచన మనస్సంతా నిండినది. చెప్పేవారు, సలహాలు ఇచ్చేవారు అంత ఉదారంగా విరాళములివ్వరు అని నాకు అనుభవము. నిర్మాణం చౌకగా, చక్కగా. చేయవలయునంటే ఎంతో వ్యయప్రయాసలకు

లోనుగావలసియున్నది. ఒకే మార్గము – మనము భారీగా విరాళం ఇచ్చి, స్నేహము, చనువు ఉన్నచోట దబాయించి వసూలు చేయుట. ఇంకొక ముఖ్య విషయం, ఇదే సమయంలో ఆడపిల్లల హాస్టల్ కమ్మజన సేవాసమితివారు ప్రారంభించి, చాలా గొప్పగా, మనరాష్ట్రంలో ఎక్కడా లేని సౌకర్యములు కల్పించుటకు పూనుకొని, భారీ విరాళములు తీసుకొనుట. విరాళములిచ్చే దాతలు అక్కడా, ఇక్కడా రెండుచోట్ల ఒకేసారి ఇవ్వాలంటే చాలా కష్టమని నాకు తెలుసు. బాలుర హాస్టల్ ఎంత అవసరమో, బాలికల హాస్టల్ ఇంకా ఎక్కువ అవసరము అని భావించి రెండు సంవత్సరముల కాలంలో ఎట్టి పరిస్థితులలోనైనా చేయవలయునని దానికి మనం ముందుండి, ఎక్కువ విరాళమిచ్చి, మిత్రులు, శ్రేయోభిలాషులు, పూర్వ విద్యార్థులు, సంఘములో ఆర్థికస్థోమత కలిగి ఇచ్చే మనసున్నవారిని మనకున్న మంచితనాన్ని, సామర్థ్యాన్ని హాస్టలు వినియోగించాలని ఒక కఠిన నిర్ణయం తీసుకోవలసి వచ్చినది.

2006 మార్చి నెలలో కొత్తగా కట్టుటకు తీర్మానించిన (బిల్డింగు) భవనము పాత హాస్టల్లో దక్షిణపు భాగములో 'L' షేపులోనున్న సైకిల్ స్టాండు, డైనింగ్ హాలు, కిచెన్ కూడా నిర్మూలించి, ఆ 700 చ.గ. స్థలంలో ఈ భవనము మున్సిపల్ కార్పొరేషన్‌వారి అనుమతి పొందిన తర్వాత ఆరంభించ వలయునని తీర్మానించడమైనది. మనమెంతో శ్రమకోర్చి పొదుపు పెంచుకొను చున్న 'పర్మినెంట్ ఫండ్' డిపాజిట్ 13 లక్షల రూపాయలను కూడా భవన నిర్మాణమునకు ఉపయోగించు కొనవలయునని మరొక తీర్మానము చేసి సర్వసభ్య సమావేశంలో, ఏకగ్రీవంగా ఆమోదించబడినది. ఆ ఫండు, మనకు గత 10 సంవత్సరముల నుండి ప్రతియేటా మిగుల్చుకొన్నది, NRIs ముఖ్యంగా డా. జాష్టి వెంకటేశ్వర్లుగారు, శ్రీ పావులూరి నరేంద్రనాథ్‌గారు, శ్రీ నూతక్కి విష్ణు మొదలగువారు ఇచ్చిన విరాళములు.

హాస్టల్ జీవిత సభ్యత్వం రూ. 5000/– నుండి రూ. 10,000/–లు చేయటమైనది. 2006 మార్చి నెలలో 'బైలాస్'ను మార్చి పర్మినెంట్

ఫండ్ డిపాజిట్ కాన్సిల్ చేసి ఆ డబ్బు 15-20 లక్షల రూపాయలు మధ్య డ్రా చేసి, మున్సిపల్ కార్పొరేషన్ పర్మిషన్ తెచ్చిన తరువాత మాత్రమే కొత్త బిల్డింగు శంకుస్థాపన చేయవలెనని తీర్మానించి డా. మద్దినేని గోపాలకృష్ణగారి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించుట జరిగింది. శంకుస్థాపనకు ముందే శాఖమూరి లక్ష్మీదేవమ్మ పాత హాస్టల్ భవనానికి దక్షిణ వైపు ఉన్న డైనింగ్ హాలు, పైనున్న రీడింగ్ రూమ్ & లైబ్రరీ, వంటశాల అన్నియు తీసివేయడమైనది. కార్పొరేషన్‌వారి నుండి బిల్డింగ్ పర్మిషన్ తెచ్చుకొని (3 అంతస్తుల బిల్డింగ్‌నకు) మా కమిటీవారు ఎన్నిసార్లు ప్రయత్నించినా, కలిసికట్టుగా వెళ్ళి ఏ దాతనూ కలిసి విరాళములు వసూలు చేయలేకపోయినందువలన నాకు ఆప్తమిత్రులు, ఒక ప్రముఖ పూర్వ విద్యార్థి, నేటి హోమియో వైద్యములో రాష్ట్రంలోనే మేటి అయిన డా॥ పావులూరి కృష్ణచౌదరిగారిని ఒప్పించి, నేను రూ. 10 లక్షలు విరాళమిచ్చి, వారి నుండి కూడా 10 లక్షల రూపాయలు విరాళము ఇచ్చుటకు ఒప్పించుకొని నిర్మాణం వేగం సాగించాము. ఆ తరువాత క్రమంలో డా. కామేపల్లి రత్నబాబు (ఆర్థోపెడిక్ సర్జన్)గారు, శ్రీ యర్రమననేని విజయకుమార్‌గారు చెరి 5 లక్షల రూపాయలు ఇచ్చినారు. అప్పటికి హాస్టల్ పూర్వ విద్యార్థులలోనూ, పుర ప్రముఖులలోనూ చైతన్యం ఏర్పడి, విరాళాలు ఇచ్చుటకు ముందుకు వచ్చారు. ఒక రూము పేరు పెట్టడానికి ఒక లక్ష మాత్రమే తీసుకొని, ఆ బిల్డింగ్ 3 అంతస్తులూ ఒక సంవత్సరములోగా నిర్మాణం పూర్తి చేయగలిగాము. విరాళాల వివరాలు అన్నీ మా సంఘం కార్యదర్శి అయిన శ్రీ నామినేని కోటేశ్వరరావుగారి వ్యాసంలో ఇవ్వబడినవి.

ఆ బిల్డింగ్ నిర్మాణంలో సహకరించిన వారి వారి నామధేయములను వారు కోరిన విధంగా డైనింగ్ హాలు, రీడింగ్ హాలు, బిల్డింగ్ గ్రౌండ్, మొదటి, రెండవ అంతస్తులపైన లిఖించడమైనది. ఈ భవనమునకు 10 లక్షల విరాళమిచ్చుటయే గాక, అహర్నిశలు కృషి చేసి విరాళములు వసూలు చేసి, ప్రతి దినము 1, 2 గంటల సమయం వెచ్చించి భవన నిర్మాణమును

సకాలములో పూర్తి చేసిన డా. బసవపున్నయ్యగారికి ధన్యవాదాలు తెలుపుతూ నూతన భవనమునకు దక్షిణపు వైపున, అనగా అరండల్‌పేట 4వ లైను వైపున ఆ భవనమునకు డా. కొండబోలు బసవపున్నయ్య భవనం అని లిఖించుటకు ఏకగ్రీవ తీర్మానం జరిగినది. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్ సగ భాగం పైగా కిచెన్ & డైనింగ్ హాలుకు వాడుకుంటూ, మిగిలిన భాగం అద్దెకు ఇవ్వవలెననియు, షాపులకు కాకుండా ఒకే ఆఫీసునకు ఇవ్వవలెనని నిర్ణయించారు. మొదటి అంతస్తు సగ భాగం రీడింగ్ హాలుగాను, మిగిలిన సగ భాగం కూడా అనగా కింద సగ భాగం, పైన సగ భాగం బిల్డింగు ఒక ఆఫీసునకు అద్దెకు ఇచ్చి, ఆ ఆదాయంతో మునిసిపల్ కార్పొరేషన్‌వారి పన్నులు చెల్లించాలని ఉద్దేశం. 3వ అంతస్తులో ఉన్న 12 పెద్ద పెద్ద గదులు ఒక్కొక్క గదిలో 5 మంది విద్యార్థుల చొప్పున అన్ని శానిటరీ వసతులతో ఓవర్ హెడ్ వాటర్ సప్లై పూర్తి చేశాము. హాస్టల్ పడమర వైపున పూర్వం నుండి ఉన్న బావిలోని నీరు చాలకపోవడంతో, ఈశాన్య భాగంలో ఒక (భూగర్భ జలానికి) బోర్ వేయగా మంచినీరు వాడుకొనుటకు లభించటం మన అదృష్టం. ఈ నిర్మించిన భవనం చాలా తక్కువ ఖర్చుతో చదరపు అడుగు ఒకటికి 300 రూపాయలతో చేయగలిగినాము.

ఈ భవన నిర్మాణంలో వచ్చిన ఉత్సాహంతో దాతల వితరణ వలన స్ఫూర్తితో కొత్త హాస్టల్ అనబడే జంపాల సాంబయ్య హాస్టల్ భవనంలో పడమరవైపున ఉన్న 40' × 60' స్థలములో సెల్లారు సౌకర్యముతో 3 అంతస్తుల భవనము నిర్మించవలెననియు, కార్పొరేషన్ అనుమతి వచ్చిన తరువాతనే నిర్మాణం చేయవలెనని తీర్మానించినాము. ఈసారి కూడా ముఖ్య దాతలను ఎన్నుకొని, వారి దగ్గర నాకున్న చనువు, మంచితనమును ఆసరాగా తీసుకొని, నేను మరల 10 లక్షల రూపాయలు విరాళము ఇచ్చి ప్రారంభించడం జరిగింది.

ఈ కమ్మ బాలుర హాస్టల్ నిర్వహణలో మొదటి నుండి (25 సంllలుగా) ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఉపకార వేతనములు అందించుచున్న

డా. జాష్టి వెంకటేశ్వర్లు (జె.వి.)గారు పూర్తిగా అభినందనీయులు. వారితో ఈ భవనము శంకుస్థాపన చేయించుట జరిగినది. నేను 2007లో అమెరికా వెళ్లటం జరిగింది. అక్కడ నా మిత్రులను కలిసి వారినుండి భూరి విరాళం సేకరించగలిగాను. డా. బిక్కిన రామారావుగారి పుత్రులిద్దరూ డా. బిక్కిన శాయి రమేష్ మరియు డా. బిక్కిన మహేష్‌గార్లు కలిసి 10 లక్షల రూపాయల విలువైన డాలర్లు పంపుటకు అంగీకరించి అనతి కాలంలోనే ద్రవ్యమును అందజేశారు. అమెరికాలోనే మరొక పూర్వ విద్యార్థి, ఎల్లప్పుడు మన హాస్టల్ శ్రేయస్సుకోరే, తరచు ఇండియా వచ్చినపుడు మన హాస్టల్‌ను చూచి సంతోషించే మరొక వ్యక్తి డా. జాష్టి వెంకటరత్తయ్యగారు. కాలిఫోర్నియా స్టేట్‌లో స్థిరపడిన నాసాలో సైంటిస్టు. వారిని టెలిఫోన్‌లో సంప్రదించి, మన కొత్త బిల్డింగ్ ప్రాజెక్ట్ వివరముగా తెలియపరచి, వారిని కూడా 10 లక్షల రూపాయలు రెండుసార్లుగా ఇచ్చేలాగా ఒప్పించుకొనిరావడం నాకెంతో ఆనందం కలిగించింది. అమెరికాలోనే ఇంకా కొంతమంది మిత్రులు డా. పావులూరి నరేంద్రనాథ్‌గారు, డా. ఈదర లోకేశ్వరరావుగారు ఇంకా వారి వారి మిత్రులను కలిసి వారినుండి కూడా ఒక్కొక్కరి నుండి లక్ష రూపాయలకు తక్కువ కాకుండా వాగ్దానం చేయించుకొని తిరిగివచ్చాను. అనగా పైన ఉదహరించిన సుమారు 25 లక్షల రూ.ల విరాళములు చేతికి వచ్చినట్లే!

భవన నిర్మాణం ప్రతి రోజూ ఒక గంట సమయానికి తక్కువ కాకుండా పర్యవేక్షిస్తూ, అనుకున్న సమయంలో సెల్లారు, 3 అంతస్తులూ పూర్తిచేయ గలిగాము. ఈ సందర్భంలో జరిగిన కమిటీ మీటింగ్ భవనం పైన 'ఈ భవన నిర్మాణ సారథి డా. కొండబోలు బసవపున్నయ్యగారు' అని వ్రాయ వలెనని తీర్మానం చేయడం జరిగింది. ఈ భవనంలో కూడా గ్రౌండ్ ఫ్లోర్ మొత్తము సగం సెల్లార్ ఫ్లోర్‌లోని భాగం ఒకే అద్దెదారునకు ఇచ్చి, ఆ వచ్చే ఆదాయంతో నానాటికి పెరిగే కరెంట్ బిల్లులు మరియు పేద విద్యార్థులకు ఎక్కువ సహాయం చేయాలనే ఆలోచన. పూర్వ విద్యార్థి, సామాజిక శ్రేయోభిలాషి అయిన శ్రీ మండవ వెంకటరామయ్యగారు నాతోపాటు 10

లక్షల రూపాయల విరాళం సంతోషంగా ఇచ్చారు. ఈ భవన నిర్మాణానికి కూడా మన పూర్వ విద్యార్థులు అనేకమంది ఒక్కొక్క లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ భవన నిర్మాణానికి మన కమిటీ సభ్యులైన శ్రీ కొర్రపాటి రామారావుగారు, శ్రీ పాపినేని లక్ష్మీనారాయణగారు, శ్రీ మాదల రత్నగిరిబాబు (జనచైతన్య)గారు, శ్రీ కాట్రగడ్డ లక్ష్మీనరసింహరావుగారు మొదలగువారు సంతోషంగా విరాళాలు ఇచ్చారు. ఇంకా కొంతమంది మిత్రులు వారి వారి స్నేహితుల ద్వారా ఇప్పించారు. ఈ రెండు భవనాల నిర్మాణంలో చందారూపంలో లక్ష రూపాయల లోపు ఇచ్చినవారు కూడా కొందరు ఉన్నారు. ఈ కొత్త హాస్టల్ (జంపాల సాంబయ్య హాస్టల్) భవనంలో 110 మంది విద్యార్థులు అన్ని సౌకర్యాలతో నివసించడానికి ఏర్పాటు చేశాము. ప్రస్తుతం కమ్మ విద్యార్థుల హాస్టల్ భవనాలు రెంటిలో కలిపి 350 నుండి 400 దాకా అవసరానికి ఏర్పాటు చేయగల పరిస్థితి కలిగింది. నేటి పరిస్థితి, మనకు నెలసరి వచ్చే అద్దెల నుండి కార్పొరేషనువారి బిల్డింగ్ పన్నులు, నీటి తీరువా పన్ను, కరెంటు బిల్లులు, అన్ని ఖర్చులుపోనూ మిగిలిన మరి కొన్ని లక్షల రూపాయలు హాస్టల్ విద్యార్థుల వసతి, భోజన ఖర్చులకు వాడుకొనగలుగుచున్నాము. ఉదాహరణకు నేటి విద్యార్థి సంవత్సరము బిల్లు రూ. 11000/- మాత్రమే. వారాల లబ్దిపొందే విద్యార్థికి సంవత్సరమునకు రూ. 6000/-లు మాత్రమే. ఇప్పుడు శ్రీ నామినేని కోటేశ్వరరావుగారు సెక్రటరీ అయినప్పటినుండీ (గత 3 సంవత్సరము) ఇద్దరు వార్డెన్లను నియమించి, హాస్టల్ నిర్వహణభారం అంతా సెక్రటరీగారే చూచుకొనుచున్నారు. నేడు మన హాస్టల్‌కు ఏవిధమైన ఆర్థిక ఇబ్బందులు లేవు.

ఈ భవన నిర్మాణాల్లో నాకు సహకరించిన మిత్రులు, కమిటీ మెంబర్లు, పురప్రముఖులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ హాస్టల్లో ఇలాగే భవిష్యత్‌లో కూడా నడిచేలాగున భగవంతుని ప్రార్థిస్తున్నాను.



**డా॥ కొండబోలు బసవపున్నయ్య**

కమ్మ హాస్టలు అధ్యక్షులు 1972 నుండి



1972 – శ్రీ కొడాలి వెంకటరత్నం చౌదరి



1972 – శ్రీ తేళ్ళ కృష్ణమ్మ చౌదరి, డా॥ కె. బసవపున్నయ్య,
శ్రీ పెద్ది వెంకటేశ్వరరావు




1974 – డా॥ బసవపున్నయ,  శ్రీ వై.కె.యస్. ప్రకాష్‌రావు,
శ్రీ జాగర్లమూడి  చంద్రమౌళి



1974 – శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు



1974 – శ్రీ నాగళ్ళ చలపతిరావు, శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి, శ్రీ అన్నె సంజీవయ్య, డా॥ కాసరనేని సదాశివరావు, శ్రీ కట్టా సుబ్బారావు, శ్రీ మల్లవరపు ఇన్నయ్య, శ్రీ పాలడుగు లక్ష్మణరావు, శ్రీ పి. నాగేశ్వరరావు.



1974 – డా॥ గణేశుని పరంధామయ్య, శ్రీ గుమ్మడి బసవపున్నయ్య, డా॥ చల్లపల్లి సాంబశివరావు, డా॥ కాసరనేని సదాశివరావు, శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు




1974 – శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, శ్రీ చెరుకూరి శివరామయ్య
డా॥ బసవపున్నయ్య



1975 – శ్రీ మారుపూడి కోటేశ్వరరావు, శ్రీ పెద్ది వెంకటేశ్వరరావు,
డా॥ పావులూరి కృష్ణచౌదరి



1975 – డా॥ కె. బసవపున్నయ్య, శ్రీ పెద్ది వెంకటేశ్వరరావు,
డా॥ పావులూరి కృష్ణమ్మచౌదరి




1980 – శ్రీ వై.కె.యస్. ప్రకాష్‌రావు, డా॥ మద్దినేని గోపాలకృష్ణ,
శ్రీ సాదినేని చౌదరయ్య, శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి, శ్రీ చల్లా కొండయ్య,
డా॥ బసవపున్నయ్య, డా॥ పరంధామయ్య, 8. శ్రీ అన్నె సంజీవయ్య,
డా॥ కాసరనేని సదాశివరావు, కృష్ణారావు, శ్రీ మారుపూడి కోటేశ్వరరావు



1980 – శ్రీ అడుసుమల్లి ధర్మారావు, డా॥ మద్దినేని గోపాలకృష్ణ, శ్రీ చల్లా కొండయ్య, శ్రీ వై.కె.యస్. ప్రకాష్‌రావు, డా॥ కె. బసవపున్నయ్య, డా॥ గంగాధరరావు



1980 – డా॥ కె. గణేశుని పరంధామయ్య, జాగర్లమూడి చంద్రమౌళి, శ్రీ చల్లా కొండయ్య



1980 – డా॥ కె. బసవపున్నయ్య



**నామినేని కోటేశ్వరరావు,** M.Sc.
గుంటూరు.

# నేనెరిగిన కమ్మ హాస్టలు
(1959 - 2016)

1915వ సంవత్సరం ప్రాంతంలో ఆర్ధికపరమైన / భూమిపరమైన పేచీలు ఎక్కువగా ఉండుట వలన, పల్లె ప్రాంతముల నుండి కోర్టు వ్యవహారాల కొరకు లాయర్లను సంప్రదించుటకై గుంటూరు ఎక్కువగా వచ్చుచుండెడి వారట! ఏ కారణం చేతనైనా ఆగిపోవలసి వస్తే, రాత్రి బస చేయుటకు ఏ విధమైన వసతి ఉండేది కాదట! అందువలనే ఆనాడు ఆర్ధిక పరిపుష్టి కలిగిన పెద్దలు కులసత్రములను ఏర్పరచిరి. కమ్మ హాస్టలు ఆ కోవకు చెందినదే. కొన్ని ఉదాహరణలు: 1) యడవల్లివారి సత్రము (ప్రస్తుతము కృష్ణాపిక్చర్ ప్యాలసు మరియు దానికి దక్షిణంగా కాసు శాయమ్మ హైస్కూలు ఉన్న విశాల స్థలము. 2) ఓవర్ బ్రిడ్జ్ ప్రక్కనే రైల్వేస్టేషన్‌కు వెళ్ళేదారిలో నున్న విశాలమైన ఆర్యవైశ్య సత్రము, 3) పిచ్చుకలగుంటలోని కూర్మనాయుడు సత్రము, 4) అరండల్‌పేట 6వ లైను 3వ అడ్డరోడ్డులోని శ్రీ బాలేమర్తి లక్ష్మీనరసింహంగారి సత్రము.

ఈ పైన ఉదహరించిన ఆస్తుల విలువ ప్రస్తుత ధరల ప్రకారము కొన్ని వందల కోట్ల రూపాయలు.

అదే విధముగా, నరసరావుపేట దగ్గరలో వున్న ముత్తనపల్లి జమిందారీ కుటుంబానికి చెందిన శ్రీ శాఖమూరి వెంకటప్పయ్యగారు, వారి ధర్మపత్ని

లక్ష్మీదేవమ్మగారు అరండల్‌పేట 4వలైను 4వ అడ్డరోడ్డులో 1918వ సంవత్సరంలో కమ్మ సత్రమును నిర్మించిరి. వారికి ఏకైక సంతానం శ్రీమతి రాధాబాయమ్మ. అందువలన ఆ ప్రాంగణమునకు "రాధావిలాస్" అని పేరు పెట్టిరి. శ్రీ శాఖమూరి వెంకటప్పయ్యగారు 1918కి పూర్వమే మరణించగా శ్రీమతి శాఖమూరి లక్ష్మీదేవమ్మగారు 18.08.1923వ సంవత్సరమున పరమపదించిరి.

శ్రీమతి రాధాబాయమ్మగారి భర్త అడిగొప్పల / ఓబులేసునపల్లె గ్రామమునకు చెందిన శ్రీ చిరుమామిళ్ళ లక్ష్మీనారాయణ ప్రసాదుగారు. వారు డిప్యూటీ కలెక్టరుగా పనిచేయుచుండెడివారు.

శ్రీమతి లక్ష్మీదేవమ్మగారి మరణానంతరము ఆనాటి కమ్మకుల పెద్దలైన స్వర్గీయ శ్రీ పాటిబండ్ల సీతారామయ్యగారు (లామ్ వాస్తవ్యులు), శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారు, స్వర్గీయ రావ్‌సాహెబ్, శ్రీ జంపాల వెంకటేశం చౌదరిగారు (దుగ్గిరాల వాస్తవ్యులు, (కేంద్ర మాజీ మంత్రివర్యులు స్వర్గీయ కొత్త రఘురామయ్య గారి మామగారు) అప్పుడప్పుడే పరిసర గ్రామముల నుండి ఉన్నత విద్య నభ్యసించుటకు కమ్మ కులమునకు చెందిన గ్రామీణ విద్యార్థులకు, గుంటూరు పట్టణంలో కుల వ్యవస్థ ఎక్కువగా ఉండుట వలన, అద్దె గదులు లభ్యమగుట కష్టముగా ఉండేది. ముఖ్యముగా అరండల్‌పేట, బ్రాడీపేటలలో బ్రాహ్మణ ఆధిక్యత ఎక్కువగా ఉండెడిది. (దీనికి మంచి ఉదాహరణ – శ్రీ యడ్లపాటి వెంకట్రావుగారిని "నీ జంధ్యమేది బాబు అని అడగటం, దానికి నేను బ్రాహ్మణుడను కాను" అని చెప్పిన వెంటనే గది ఖాళీ చేయించుట వలన, వారు 1935లో కమ్మహాస్టలులో ప్రవేశం పొందిరి).

ఈ పరిస్థితులలో కమ్మ విద్యార్థుల ఇబ్బందులను గ్రహించి, పైన చెప్పిన కులపెద్దలు శ్రీమతి లక్ష్మీదేవమ్మగారి కుమార్తె రాధాబాయమ్మను, వారి భర్త చిరుమామిళ్ళ లక్ష్మీనారాయణ ప్రసాదుగారి అనుమతితో 1923లో

"కమ్మ సత్రము"ను కమ్మ విద్యార్థుల వసతి గృహముగా మార్చబడినట్లు హాస్టల్‌లో ఉన్న శిలాఫలకము ద్వారా తెలియుచున్నది. 1923-1935 సం॥రల మధ్యలో హాస్టలు చరిత్రను కొంతవరకైన చెప్పగలిగినవారు లేకపోవుట వలన ఆ కాలమునకు చెందిన పరిస్థితులను వివరించలేక పోవుచుంటిని. ఈనాడు మన మధ్యనే ఉన్న ప్రముఖ రాజకీయ నాయకులు, మాజీ మంత్రివర్యులు, కేంద్ర పార్లమెంటు సభ్యులు అయిన శ్రీ యడ్లపాటి వెంకట్రావుగారు 1935-40 మధ్యకాలంలో కమ్మ హాస్టలులో ఉండి గుంటూరు ఎ.సి. కాలేజీలో విద్యనభ్యసించినారు.

వారి సమకాలీయులలో కొందరు ప్రముఖులు 1) ఇప్పటి ప్రస్తుత గుంటూరు పార్లమెంటు సభ్యులు శ్రీ రాయపాటి సాంబశివరావుగారి తండ్రి కీర్తిశేషులు 1) శ్రీ రాయపాటి వెంకట రంగారావుగారు, 2) 1950వ ప్రాంతంలో ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ రాజకీయ దురంధరులు శ్రీ మాకినేని బసవపున్నయ్య గారు, 3) శ్రీ మాదల నారాయణస్వామిగార్లు, 4) తాడికొండ వాస్తవ్యులై యుండి విద్యానంతరం 1960 ప్రాంతంలో వ్యాపార రంగంలో ప్రవేశించి ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యవస్థాపకులలో ప్రముఖులైన శ్రీ వై.కె.యస్. ప్రకాశరావుగారు, 5) ప్రస్తుతం నెల్లూరులో నడపబడుచున్న బొల్లినేని హాస్పటల్స్ వారి పూర్వీకులైన డా॥ బొల్లినేని రామచంద్రరావుగారు, 6) బోడపాడు వాస్తవ్యులు మరియు ప్రస్తుతం అమెరికాలో ఉన్నతస్థానంలో స్థిరపడిన శ్రీ జాష్టి వెంకటరత్తయ్య గారు, 7) జాష్టి వెంకటేశ్వర్లు (JV) గారు (కొప్పర్రు గ్రామము), 8) డా॥ నూతక్కి (మందడం), 9) డా॥ వై.వి. సుబ్బారావుగార్లు (బ్రాహ్మణకోడూరు) (ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే).

1951వ సం॥ వరకు హాస్టలు నిర్వహణ ఏ విధముగా జరిగినది, ఎవరి యాజమాన్యంలో ఉన్నది అటువంటి వివరములను సేకరించలేక పోతిని. 1951వ సం॥లో ఆనాటి ప్రముఖ వైద్యులు తురుమెళ్ళ గ్రామ వాస్తవ్యులు స్వర్గీయ శ్రీ పర్చూరి వీరయ్యచౌదరిగారు బాధ్యతలు స్వీకరించి 1958వ సం॥ వరకు నిర్వహించిరి. ఇదేకాలంలో విద్యార్థుల బాగోగులు

పరిశీలించుటకు ఆనాటి సామాజిక కార్యకర్త శ్రీ డి. వెంకయ్యగారు హాస్టలులోనే ఉండెడివారట.

హాస్టల్ నిర్వహణకై ఆనాటి కులపెద్దలు భూమిని దానముగా ఇచ్చి యున్నారని తెలియుచున్నది. విస్తీర్ణము తెలియదు గానీ భూములు ప్రాతూరు గ్రామం, గోళ్ళమూడిపాడు గ్రామము మరియు మంగళగిరి రోడ్డులోను ఉండెడివట. శ్రీ పర్చూరి వీరయ్యచౌదరిగారి ఆధ్వర్యంలో నున్న కమిటీ ప్రాతూరు, గోళ్ళమూడిపాడులలో ఉన్న భూమిని విక్రయించి ఆరండల్‌పేట 4వలైను 3వ అడ్డరోడ్డులోని కాకాని పుండరీకాక్షుని పార్కుకు ఎదురుగా నున్న ఒకప్పటి ఇన్‌కమ్‌టాక్స్ భవనమును స్వర్గీయ కాకాని సుందరరావు గారి నుండి కొన్నారు. కానీ వారసత్వమైన పేచీలు ఉండుట వలన ఆ ప్రాంగణ స్వాధీనము వెంటనే జరుగలేదు, మరియు కోర్టులలో పరిష్కరించు కోవలసి వచ్చినది.

1951వ ప్రాంతంలో హాస్టలులో నివసించు అతి బీద విద్యార్థులు భోజన వసతి కొరకై, ఆనాటి కులపెద్దల ఇళ్ళ దగ్గర వారాల ఏర్పాటు చేసుకొనేవారట. ఇదే క్రమములో దుగ్గిరాల వాస్తవులు జంపాల వెంకటేశం గారి సోదరుడు శ్రీ జంపాల సాంబయ్యగారు డిస్ట్రిక్ట్ పంచాయితీ ఆఫీసరుగా విధులు నిర్వహించుచు అరండల్‌పేట 3వలైనులో ఉండెడివారట. హాస్టల్‌లో వున్న బీదవిద్యార్థులందరకును వారానికి ఒకరోజు భోజన వసతి కల్పించుచు, కొన్నటువంటి క్రొత్త భవనం యొక్క కోర్టుపరమైన లావాదేవీలను పర్యవేక్షించుచు, సుప్రీంకోర్టు వరకు వెళ్ళి ఆ ఆస్తిని హాస్టలుకు స్వాధీనం చేయుటలో ముఖ్యపాత్ర పోషించుట వలనే, ఆ ప్రాంగణమునకు “శ్రీ జంపాల సాంబయ్య కమ్మ హాస్టల్” అని పేరు పెట్టుట జరిగినది.

నేను 1959వ సంవత్సములో గుంటూరు ఎ.సి. కాలేజీలో విద్య నభ్యసించుచు పాత హాస్టలులో ఉండెడివాడను. పాత హాస్టలు అనగా శ్రీ శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి పేరుతో ఉన్నది. క్రొత్త హాస్టలు శ్రీ జంపాల

సాంబయ్యగారి పేరుతో ఉన్నది. నేను 1959-62 మధ్యకాలంలోను, మరియు 1964వ సం॥లో కొన్ని నెలలు హాస్టలులో ఉన్నాను.

నాకు పూర్వం ఉన్న విద్యార్థులెవరైనా తటస్థ పడితే అడిగే మొదటి ప్రశ్న "రామకోటి ఉన్నాడా?" అని. ఈ రామకోటి సుమారుగా 23 సంవత్సరములు వంటమనిషిగా పనిచేసి వంటకూ, హాస్టలుకు మరోపేరుగా నిలిచాడు. రామకోటికి సహాయకుడిగా సుబ్బయ్య అనే వ్యక్తి ఉండేవాడు. సుబ్బయ్య కుమారుడైన మూగవాడు రామకోటి వద్ద వంటకు సహాయము చేయుచు నేను ప్రవేశించేనాటికి ఈ మూగవాడే వంటమాస్టరుగా ఉండేవాడు. ఆ రోజులలో ముఖ్య భవనమునకు పడమర వైపునున్న విశాలమైన బావికి, దక్షిణం వైపున పెంకుటింటి వంటగది ఉండెడిది. దానికి దక్షిణం వైపున ఒకేమారు 60మంది కూర్చొనుటకు వీలుగా ఉండడే భోజనశాల ఉండేది. భోజనము చెక్కపీటలపై కూర్చొని అరిటాకులలో తినుచుండేవారు. ఆ రోజుల్లోనూ, నాకు పూర్వపు రోజుల్లోనూ కమ్మ హాస్టలు సాంబారు, గడ్డపెరుగు, గంటె నెయ్యిల గురించి కళాశాలలో తోటి విద్యార్థులు వింతగా చెప్పుకొనేవారు. ఈ గడ్డపెరుగు ఖ్యాతి అంతా కోయవారిపాలెం నుండి సుమారుగా 25 సంవత్సరాలు సరఫరా చేసినటువంటి నాగయ్యకే చెందుతుంది.

ఇదే సందర్భంలో మా రోజులలో, మా ముందు రోజులలో కమ్మ హాస్టలు భోజనము గుంటూరు పట్టణములో అందరి నోళ్ళలో నానుచుండెడిది. ఉదయము ఏ విధమైన అల్పాహారము ఉండెడిది కాదు. 2 పూటలా పరిమితులు లేని భోజనము (రుచికి, శుచికి పెట్టింది పేరు). ఆదివారం మధ్యాహ్నం లడ్డూ, పకోడి వంటి పదార్థములు (లడ్డు పరిమాణం ఇప్పటి తిరుపతి లడ్డుకన్నా పెద్దది). ఆదివారం ఉదయానే గొర్రెలమండికి వెళ్ళి గొర్రెపోతును కొనుక్కొని పాతహాస్టలు ఆవరణలో ఆగ్నేయమూలగా ఉన్న పెంకుటి గదులకు వెనుకవైపున కోసి తల, తోలు అమ్మగా మిగిలిన మాంసము రాత్రిపూట పరిమితి లేకుండా వడ్డించేవారు. భోజనశాల పై, రేకుల కప్పుతో కూడిన పఠనమందిరముండెడిది.

ఆ రోజులలో భోజన ఖర్చును రోజువారీగ లెక్కించి నెలకు అయిన ఖర్చును ఆ మాసాంతములో విద్యార్థుల దగ్గర నుండి వసూలు చేసేవారు. ఈ విధంగా లెక్కించినప్పుడు రోజుకు 14 అణాల నుండి 16 అణాలలోపు ఉండెడిది. (రూపాయికి 16 అణాలు). 1958కి పూర్వం విద్యార్థులను చదువు, తిండితో పాటు వారి యోగక్షేమములను పర్యవేక్షించుటకు వార్డెన్లు ఉండెడి వారు కాదు. కానీ 1958వ సంవత్సరములో ఆనాటి ఏ.సి. కాలేజీలో ఇంగ్లీషు అధ్యాపకునిగా ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ ఎలవర్తి రోశయ్యగారిని రెగ్యులర్ వార్డెన్‌గా నియమించడమైనది. వారి పదవీ కాలములోనే నేను హాస్టలులో ఉండట వలన, ఈనాటికీ క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, శ్రమించే గుణం వారి నుండి నేను పొందిన ప్రేరణగా భావిస్తున్నాను.

1923లో కమ్మ హాస్టల్‌గా మార్చబడిన తరువాత ఆ రోజులలో గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షునిగా వ్యవహరించుచు, జమిందారీ కుటుంబానికి చెందిన, దానశీలిగా పేరు పొందిన కారంచేడు వాస్తవ్యులు శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారి ఆధ్వర్యములో, పరిసర గ్రామ దాతల నుండి ధన సహాయముచే, (దాతల వివరములు ఒకటవ అనుబంధంలో ఉన్నవి) హాస్టలు మొదటి అంతస్థు నిర్మింపబడినదనియు, దానిని 1929వ సం॥లో అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ బొల్లినేని మునిస్వామి నాయుడుగారు ప్రారంభించినట్లు ఆధారములున్నవి. మరియు శ్రీ మునిస్వామినాయుడు గారిని గుంటూరు రైల్వేస్టేషన్ నుండి ఎర్ర తివాచీపై, పూలపై నడిపించినట్లుగా పెద్దలు చెప్పుచుండెడివారు.

ఈ పైన చెప్పినవారు హాస్టల్‌లో నివసించినపుడు విద్యుత్ దీపములు ఉండెడివి కావట. మరుగుదొడ్ల సదుపాయం లేక దూరప్రాంతాలకు బహిర్భూమికి వెళ్ళుచుండెడివారట. స్నానాదుల కొరకు ఆవరణలో ఉన్న బావి ఉపయోగ పడుచుండెడిదట. కాటూరు గ్రామమునకు చెందిన వెల్లంకి

అక్కయ్యగారు హాస్టల్‌లో చదువుకొన్న సంవత్సరం తెలియదు కానీ, వారి ఆధ్వర్యంలో 1938వ సంవత్సరములో హాస్టల్‌లో విద్యుదీకరణ జరిగినట్లు శిలాఫలకమును బట్టి తెలియుచున్నది.

1923 నుండి 1929 వరకు సుమారుగా 40 మంది ఉండుటకు వీలుగా వున్న ప్రాంగణం 1929 తరువాత సుమారుగా 80మందికి సౌకర్యముగా ఉండుటకు వీలు కల్గి ఉండేది.

1962 సం॥ వరకు విద్యార్థులందరు బావి నీటిని బక్కెట్లతో తోడుకొని బావిచుట్టూ స్నానం చేసేడివారము. స్నానపుగదుల సౌకర్యం ఉండెడిది కాదు. పాత భవనమునకు ఈశాన్యం మూలలో ఆధునిక మరుగుదొడ్లు మాత్రమే ఉండెడివి. గదులలో పడుకొనుటకు మంచములు ఉండెడివికావు. చాపల మీదనే పండుకొనెడివారము. నా గదిలో మా గ్రామమునకు చెందిన (కొప్పర్రు) నాకు సీనియర్ శ్రీ బత్తిని శేషగిరిరావుగారు, పాలపర్రు గ్రామమునకు చెందిన శ్రీ బండ్ల మోహన్‌రావుగార్లు ఉండెడివారు. శ్రీ బండ్ల మోహనరావు తెలుగు సాహిత్యాభిమాని. మహాకవి "తెలుగులెంక" శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు మా గదికి వచ్చి మాతో పాటే చాపపై పరుండెడి వారు.

1958వ సం॥లో శ్రీ తేళ్ళ కృష్ణమ్మ చౌదరిగారి ఆధ్వర్యంలో ఉన్న పాలకవర్గం మంగళగిరి రోడ్డులో ప్రస్తుతం నవభారత్ కంపెనీవారి క్రింద ఉన్న భూమిని వారికి విక్రయించగా వచ్చిన ధనమును మున్సిపల్ నీరు, స్నానపు గదులు, భవనమునకు అవసరమైన రిపేర్లు, క్రొత్త భవనం తాలూకు కోర్టు ఖర్చులకు వెచ్చించినట్లుగా తెలియుచున్నది.

తేళ్ళ కృష్ణమ్మచౌదరిగారి తరువాత హాస్టలు బాధ్యతను స్వీకరించిన డా॥ కాసరనేని సదాశివరావుగారు, అప్పటి వార్డెన్ శ్రీ ఎలవర్తి రోశయ్యగారు హాస్టలు నిర్వహణలో ఎంతో శ్రద్ధ చూచూపితిరి. విద్యార్థులపై చదువుపై దృష్టి పెట్టి, విద్యార్థుల నిత్యకృత్యములను పరిశీలించుచూ ఎంతో క్రమశిక్షణతో

నడిపారు అని చెప్పుటకు నేనే సాక్షిని. ఆనాటి వార్డెన్ శ్రీ ఎలవర్తి రోశయ్య గారు అరండల్‌పేట 5వ లైనులో నివసించుచు, ఆదివారము సెలవు రోజులలో ఇంటి దగ్గర నుండి నవ్వారు మంచం, 3 దిండ్లు తెప్పించుకొని అశోకవృక్షం క్రింద కాలక్షేపం చేయుచు హాస్టలులోనే విద్యార్థులతో పాటు భోజనం చేస్తూ రోజంతా విద్యార్థులతో చదువుకు సంబంధించిన చర్చ కొనసాగిస్తుండేవారు (ముఖ్యంగా ఇంగ్లీషు గ్రామర్). ఆ రోజులలో డా॥ సదాశివరావుగారు వృత్తిపరమైన కార్యక్రమాన్ని ముగించుకొని ఇంటికి వెళ్ళేటపుడు హాస్టలు వద్ద ఆగి, బాగోగులను పరిశీలించేవారు. శ్రీ రోశయ్యగారితో ఇంగ్లీషు, తెలుగు సాహిత్యపరమైన చర్చలలో మునిగి కొన్నిసార్లు అర్ధరాత్రి వరకు ఉండెడివారు.

ఆ రోజులలో ఇతరులకు హాస్టలులో నిద్రించే సౌకర్యం ఉండెడిది కాదు. దీనిని పర్యవేక్షించుటకు వార్డెనుగారైన రోశయ్యగారు అర్ధరాత్రిపూట చేతుల బనియను, లుంగీ, తలగుడ్డ, ఆరడుగుల కర్ర, టార్చిలైటుతో నిద్రించే మా గదుల తలుపులు కొట్టి ఇతరులు ఎవరైనా ఉన్నారేమోనని పరీక్షించే వారు. అప్పుడప్పుడు విద్యార్థుల కుటుంబ సభ్యులు మాత్రం ఉండుటకు అంగీకరించేవారు. అంతే కాకుండా రోజూవారీ పర్యవేక్షణలో విద్యార్థులు చదివే పుస్తకములను కూడా పరిశీలించేవారు. ఎవరి దగ్గరైనా చౌకబారు పాఠ్యపుస్తకములు గానీ, ఇతర పుస్తకములు గానీ ఉన్నచో తీవ్రంగా మందలించెడివారు. మాకు ఆ రోజులలో అర్థమైనా, కాకపోయినా ఆయన కిష్టమైన "మ్యాక్‌మిల్లన్" ప్రచురణను మాత్రం వారికి కనపడేటట్లు బయట పెట్టేవారము. అంతే కాకుండా వారి మెప్పు పొందుటకు వారి ఆలోచనా విధానమునకు అనుగుణంగా పనులను నిర్వర్తించుచుండేవారము. ఆ రోజులలో హాస్టల్ ప్రవేశ మార్గం అరండల్‌పేట 4వలైనులో నున్న చిన్న ద్వారము ద్వారా రాకపోకలు జరుగుచుండెవి. (ఇప్పుడు మూయబడి యున్నది).

4వ అడ్డరోడ్డు వైపున ఉన్న పెద్ద ద్వారము ద్వారా రాకపోకలు సాగెడివి కావు. తూర్పు వైపునున్న స్థలమంతా నిరుపయోగంగా పడి ఉండుటయే కాక ఆ స్థలము మధ్యలో సమాధిని పోలిన సిమెంటు కట్టడము, దానికి ఉత్తరంవైపున తులసికోట ఉండెడివి. మరియు దానికి ఉత్తరంవైపున మధ్య భాగములో సిమెంటు విగ్రహం, దాని వెనుక సిమెంటు స్తంభము ఉండెడివి. ఆ విగ్రహమే శ్రీమతి శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి అల్లుడైన శ్రీ చిరుమామిళ్ళ లక్ష్మీనారాయణ ప్రసాదుగారిది.

నేను 64వ సంవత్సరములో యం.ఎస్.సి. పూర్తిచేసేనాటికి, కొత్త హాస్టలు భవనం కోర్టు ద్వారా హాస్టలు హక్కు ఏర్పడినది. 1964లో ఏప్రిల్, మే మాసములలో నేను కొత్త హాస్టల్ భవనములో ఉండుటకు ఆనాటి సెక్రటరీ శ్రీ పువ్వాడ నాగేశ్వరావుగారి నుండి అనుమతి పొందితిని. ఆ సమయమునకు శ్రీ ఎలవర్తి రోశయ్యగారు వార్డెన్ బాధ్యతల నుండి విరమించుకున్నారు. ఆ రోజులలో హాస్టలకు ప్రత్యేకమైన వార్డెన్ అంటూ లేరు.

తరువాత హాస్టల్ బాధ్యతలను స్వీకరించిన ప్రజల డాక్టర్ డా॥ కాసరనేని సదాశివరావుగారు అధ్యక్షులుగాను, ప్రముఖ లాయరు శ్రీ పెద్ది వెంటేశ్వర్లు గారు కార్యదర్శిగా నున్నటువంటి కార్యవర్గము ఏ.సి. కాలేజీలో లాజిక్ లెక్చరర్గా పని చేయుచున్న శ్రీ ముక్కాల రాజగోపాలరావుగారిని వార్డెన్గా నియమించుట, వారు అదే సంవత్సరములో బాధ్యతల నుండి విరమించు కొనుట జరిగినది. అదే కార్యవర్గము తరువాతి వార్డెన్గా ప్రముఖ లాయర్ శ్రీ నాగండ్ల చలపతిరావుగారిని వార్డెన్గా నియమించుట, వారు ఆ బాధ్యతలను 1972వ సంవత్సరము వరకు నిర్వర్తించిరి. వారి ఆధ్వర్యములో హాస్టల్లో నడుపబడుచున్న భోజనపు ఏర్పాట్లు అన్నియు విద్యార్థులే పర్యవేక్షించి, వారే దానికైన ఖర్చును కూడా లెక్కలు వేసుకొనేవారు. రోజుకు రూ॥ 2ల కన్నా తక్కువగా ఉండెడిదని శ్రీ నాగండ్ల చలపతిరావుగారి నుండి తెలుసుకున్నాను. అంతకు పూర్వం విద్యార్థులకు గదులలో ఏ విధమైన ఫర్నీచరు ఉండెడిది కాదట. మొదటిసారిగా విద్యార్థుల గదులలో టేబులు,

స్టూలు ఏర్పాటు చేయటంతో పాటు భోజనశాలలో భోజనము చేయుట కొరకై బల్లలు కూడా ఏర్పాటు చేసినట్లుగా వారి నుండి తెలుసుకొనటమైనది.

వారి రోజులలో గానీ, అంతకు పూర్వము గానీ హాస్టలులో జాతీయ పండుగలైన రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే వంటి కార్యక్రమములు జరిగెడివి కావట. వార్షికోత్సములు కూడా జరిగినట్లుగా ఆధారములు లేవు.

1971వ సం॥లో నూతన కార్యవర్గం ఏర్పడుట దాని అధ్యక్షునిగా ప్రముఖ హోమియో వైద్యులు శ్రీ పావులూరి కృష్ణచౌదరి గారు, కార్యదర్శిగా యువకులు మరియు కంటి డాక్టర్ గణేశుని పరంధామయ్య గారు బాధ్యతలు స్వీకరించిరి. డా॥ పావులూరి కృష్ణచౌదరిగారు కొద్దికాలములోనే తమయొక్క నివాసమును హైదరాబాదుకు మార్చుట వలన అప్పటి ఉపాధ్యక్షులు డా॥ కొండబోలు బసవపున్నయ్యగారు బాధ్యతలు స్వీకరించిరి. ఆనాటికి పాతప్రాంగణములో పాత రెండతస్తుల భవనము, దానికి ఈశాన్యమున మెట్లు, పడమరవైపున బావి, దానికి ఉత్తరమున స్నానపుగదులు, బావికి దక్షిణమున ఊకపొయ్యితో కూడిన పెంకుటి వంటగది, దానికి దక్షిణమున 'మద్రాసు టెర్రస్'కప్పు కలిగి 70 మంది భోజనం చేయుటకు వీలుగా నుండే భోజనశాల, దానిపైన సిమెంటు రేకులతో కూడిన పఠన మందిరములు ఉండెడివి.

హాస్టలు పూర్వ విద్యార్థి, పార్లమెంటు సభ్యులు అయిన శ్రీ పాములపాటి అంకినీడు ప్రసాదుగారి ధన సహాయముతో శిధిలావస్థలో నున్న పెంకుటి వంట గదిని తొలగించి, 1964వ సంవత్సరములో ఆర్.సి.సి. బిల్డింగ్ ఏర్పాటు చేసినట్లుగా తెలియుచున్నది.

పాత భవనము క్రింది అంతస్తులో తూర్పు భాగమున విశాలమైన హాలు ఉండి దానిలో విద్యార్థులు తమ సైకిళ్ళను పెట్టుకొనుచుండెడివారు. పాత భవనమునకు దక్షిణం వైపు ఖాళీ స్థలం ఉండెడిది. అదే విధముగా శ్రీ జంపాల సాంబయ్యగారి కమ్మ హాస్టల్‌లో కూడా రెండతస్తుల మేడ, దానికి

ఆనుకొని పడమర వైపు విశాలమైన పెంకుటిల్లు, దానికి పడమరగా బావి, బావికి  ఉత్తరం వైపున స్నానపు గదులు, దక్షిణం వైపున మరుగుదొడ్లు ఉండెడివి. ముఖ్య భవనమునకు దక్షిణం వైపున ఖాళీ స్థలము ఉండెడిది. ఆ రోజులలో రెండు ప్రాంగణములలో కలిపి సుమారుగా 130 మంది విద్యార్థులు ఉండుటకు అనుకూలంగా ఉండెడిది. విద్యార్థుల గదులలో మంచములు గానీ, ఫ్యాన్లు గానీ ఉండెడివి కావు. ఆర్ధిక వనరులు లేని విద్యార్థులు, వారికి వారే వారాలు ఏర్పాటు చేసుకొని, భోజనమునకు అయిన డబ్బు దాతల వద్ద నుండి డబ్బును కూడా వారే తీసుకొచ్చి హాస్టలుకు జమచేసేవారు.

1968 వ సంవత్సరము  జె.కె.సి. కాలేజి ప్రారంభించుట, ప్రారంభం వెనుక కమ్మవారి ఆధిపత్యం, దానికి అనుగుణంగా మొదటి బాచ్ ముప్పై ముగ్గురు అధ్యాపకులలో 28 మంది కమ్మ కులమునకు చెందిన యువకులు ఉన్నారు. ఆనాటి యాజమాన్యం విద్యార్థులను పర్యవేక్షించుటకు అధ్యాపకులు ఉండుట సమంజసమని తలచి జె.కె.సి. కాలేజిలోని వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు శ్రీ మారుపూడి కోటేశ్వరరావుగారిని వార్డెన్‌గా నియమించుట జరిగినది. కారణాలు ఏమైనా జె.కె.సి. కాలేజ్‌లో అత్యధిక విద్యార్థులు కమ్మవారగుట, కమ్మకులములో చదువుకొనే విద్యార్థుల సంఖ్య పెరుగుట, హాస్టల్‌లో అయ్యే ఖర్చు తక్కువగుట వలన, విద్యార్థుల రద్దీ పెరుగటం, వసతి చాలకపోవడం, ఒత్తిడి వలన ఎక్కువమందిని చేర్చుకొని గదులలో వసతికి మించిన విద్యార్థులుండుట జరిగినది.

ఈ పరిస్థితులను ఆనాటి డా॥ బసవపున్నయ్యగారి ఆధ్వర్యములో నున్న యాజమాన్యము వసతిని పెంచవలెననే ఉద్దేశ్యంతో పాత, కొత్త భవనములలో వున్న విశాలమైన వరండాలను నడకకు వీలుగా వదలి, మిగిలిన భాగమును 1982వ సంవత్సరములో గదులుగా మార్చడమైనది. ఈ మార్పుల వలన సుమారుగా 160 మంది విద్యార్థులు ఉండుట

జరుగుచుండెడిది. ఆ రోజులలో విద్యార్థుల నుండి లాభనష్టములు లేని ప్రాతిపదికపై భోజన చార్జీలను వసూలు చేయుట వలన, నామమాత్రపు ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జీలు వసూలు చేయుట వలన, హాస్టలుయొక్క ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగానే ఉండెడిది. ఏ విధమైన నిల్వ ధనం ఉండెడిది కాదు. ఈ పరిస్థితులలో విద్యార్థుల ఒత్తిడిని గమనించి డా॥ కొండబోలు బసవపున్నయ్య అధ్యక్షునిగా, డాక్టర్ గణేశుని పరంధామయ్యగారు కార్యదర్శిగా పాలకవర్గం నూతన గదులను నిర్మించవలెనని తలచి దాతల సహాయము కొరకు ఆలోచన చేసి ఒక్కొక్క దాత నుండి రూ. 5,000/-లు ఇచ్చినచో ఒక గదికి ఆ దాత పేరు పెట్టవలెనని నిర్ణయించి, వారి ధన సహాయముతో శ్రీ జంపాల సాంబయ్య కమ్మ హాస్టల్ ముఖ్య భవనమునకు దక్షిణం వైపునున్న, అనగా అరండల్‌పేట 3వ లైను ఆనుకొనియున్న ప్రదేశమును ఎంచుకొని రెండతస్తులుగా పదహారు గదులను నిర్మింపతలచి ది. 2.08.1980వ సం॥లో డా॥ కొండబోలు బసవపున్నయ్యగారు నూతన భవనమునకు శంఖుస్థాపన చేసిరి (ఆ గదులకు ధన సహాయము చేసిన దాతల పేర్లు రెండవ అనుబంధంలో ఇవ్వబడినవి).

ఈ భవనమును ది. 8.10.1981 తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ చల్లా కొండయ్యగారిచే ప్రారంభింపబడినది. ఈ గదులు ఆధునికముగా కట్టినందువలన ఒక్కొక్క గదిలో ముగ్గురు విద్యార్థులు సౌకర్యంగా ఉండుటకు వీలుపడుచున్నది.

ఇన్ని మార్పులు జరిగిన తరువాత 1987వ సంవత్సరములో శ్రీ మారుపూడి కోటేశ్వరరావుగారి నుండి నేను వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించితిని. అంతకు పూర్వమునుండే శ్రీ మారుపూడి కోటేశ్వరరావు తనను వార్డెన్ బాధ్యతల నుండి తప్పించమని అడుగుట, యాజమాన్యంవారు వెంటనే నిర్ణయం తీసుకొనకపోవుట వలన, ఆ సంధి కాలములో హాస్టలు విద్యార్థులలో కొంతవరకు క్రమశిక్షణారాహిత్యం ఏర్పడినది. ఇది గమనించిన నేను శక్తికి మించిన పట్టుదలతో మా గురువుగారు శ్రీ రోశయ్యగారిని

ఆదర్శంగా తీసుకొని అర్ధరాత్రి ఒంటిగంట, రెండు గంటల వరకు హాస్టలులోనే ఉండి సెకండ్ షో సినిమాలకు వెళ్ళి గోడలు దూకి గదులలో ప్రవేశించిన విద్యార్థులపై నాదైన రీతిలో కఠినచర్యలు తీసుకొన్నాను. ఆ విధమైన క్రమశిక్షణారాహిత్యాన్ని రూపుమాపుటకు నాకు కొంత సమయం పట్టినది.

మరియొక విశేషం, పల్లెటూరి నుండి వచ్చు విద్యార్థుల బంధువులు, మిత్రులు, స్నేహితులు రాత్రులందు హాస్టలులోనే నివసించుచుండెడివారు. ఈ క్రమములోనే హాస్టలు విద్యార్థుల సంఖ్య, ఇతరుల సంఖ్య సుమారుగా సమానంగా ఉండెడిది. విద్యార్థులనుకాక ఇతరులకు ప్రవేశం లేకుండా చేయుటకు నేను చాలా కష్టపడవలసి వచ్చినది. దీనికి మంచి ఉదాహరణ – ఆనాటి విద్యార్థి – ఈనాటి వినుకొండ ఎమ్మెల్లే 'శ్రీ జి.వి.యస్.ఆర్. ఆంజనేయులు'కు సంబంధించినవారు ఒక రాత్రి 19 మంది వరండాలలో పండుకొనుట నేను గమనించి శ్రీ ఆంజనేయులును హాస్టలు నుండి వెంటనే పంపించటం జరిగినది. కారణాలు ఏమైనా నేను హాస్టలు వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించేనాటికి భోజన సమయము పాటించుటగానీ, పఠన సమయము ప్రత్యేకముగా ఉండుటగానీ, విద్యార్థులు చెల్లించవలసిన బిల్లులు గడువు లోపున చెల్లించుటగానీ జరుగుచుండెడిది కాదు.

నా మొదటి కార్యక్రమముగా క్రమశిక్షణను పెట్టుకొని హాస్టల్‌లో విద్యార్థి ప్రవేశం పొందునపుడే అనుసరించివలసిన నియమ నిబంధనలను రూపొందించి, ప్రవేశ సమయములో విద్యార్థి తండ్రి వచ్చునట్లుగా, ఉండవలసిన విధానమును వారికి వివరముగా చెప్పిన తరువాతే హాస్టలులో చేర్చుకొనుట జరిగేది. పఠన సమయము రాత్రితోపాటు వేకువజామున 5.00 గంటలకు ప్రారంభమగుట వలన నేను తెల్లవారుజామున 4.00 గంటలకే హాస్టలు ఆవరణలో ఉండెడివాడను. ఇలా నా ప్రయత్నాలతో విద్యార్థులలో క్రమశిక్షణ తీసుకురావటానికి సుమారుగా 2 సంవత్సరాల కాలం పట్టినది.

ఈ కాలంలో కొంతమంది సంఘపెద్దల నుండి విమర్శలు వంటి వ్యాఖ్యలు, మరికొన్ని ఇబ్బందులకు గురి కావలసి వచ్చినది. 1988వ సంవత్సరంలో శ్రీ జాగర్లమూడి చంద్రమౌళిగారు మరణించుట, హాస్టలు విద్యార్థులందరము ర్యాలీగా వెళ్లివారి దేహమునకు పుష్పములు సమర్పించుట, ఆ రోజు ఉదయం హాస్టలులో వంట చేయకపోవుట ఇప్పటికీ నా మదిలో మెదులుతుంది. అదే సంవత్సరం డిసెంబర్ 26వ తేదీన ఉదయం సుమారు 7-00 గంటల ప్రాంతంలో హాస్టలు నుండి ఇంటికి వెళుతూ హెయిర్ కటింగ్ కొరకు షాపులో ఆగినపుడు రేడియోలో శ్రీ రంగా హత్య గావించబడినారు అని చెప్పుకొనుచుండగా విని నేను ఆచార్య ఎన్.జి. రంగాగారేమో అనుకొని, ఇంటికి వెళ్ళి, కాలేజికి వెళ్ళిన తరువాత సుమారుగా 8.30 గంటల ప్రాంతంలో హాస్టలు వద్ద గొడవలు జరుగుచున్నవి, వెంటనే రావలసినదిగా కాలేజీకి ఫోను చేసిన తరువాత నేను తెలుసుకొన్నది చనిపోయినది ఎన్.జి. రంగా కాదని, శ్రీ వంగవీటి రంగా అని, ఆ తరువాత కుల ఘర్షణ వలన హాస్టలు వద్ద గొడవ జరుగుచున్నదని, నేను వెంటనే వెళ్ళినప్పటికీ శ్రీ జంపాల సాంబయ్య హాస్టల్ గేటు ఎదురుగా పెద్ద మంట, ఆ మంటలో విద్యార్థుల బట్టలు, పుస్తకములు, బక్కెట్లు, సైకిళ్ళు దగ్ధమగుట, విద్యార్థులు చల్లాచెదురుగా వెళ్ళిపోవుట, ముఖ్య భవనం ముఖద్వారము తగులబడుట గమనించి, పాత హాస్టలు వద్ద ఏమి జరుగుచున్నదో అని అక్కడకు వెళ్ళగా, భవనము లోపల నుండి పొగ రావటం గమనించి నిశ్చేష్టుడనై రోడ్డు మీద నిలబడి యుండగా "వీడేరా వార్డెన్ వేసెయ్యండి" అని కొంతమంది అరచుట, మరికొంత మంది నివారించుచుండగా, ఆనాటి అరండల్‌పేట 10వ లైనులో మెస్ నిర్వహించుచున్న శ్రీ అప్పారావుగారు "మీరిక్కడ వద్దు, రండి" అని తన స్కూటరుపై వారింటికి తీసుకొని వెళ్ళగా, సాయంత్రం వరకు అక్కడే యుంటిని.

కమ్మ హాస్టలుతో పాటు మరికొన్ని ప్రాంతాలు కూడా దుండగుల దుశ్చర్యకు నష్టం జరుగుచున్నట్లు తెలుసుకొని నాకు మిత్రుడు అప్పటి టౌన్

డి.యస్.పి. శ్రీ కామరాజు కృష్ణమూర్తిని సంప్రదించి పోలీసుల చెయ్యి కూడా దాటిపోయినదని తెలిసి మిన్నకుండడమైనది. ఆనాడు ధ్వంసానికి గురి అయిన ఇతర ముఖ్య ప్రదేశములు 1) జె.కె.సి. కాలేజి, 2) ఎస్.పి.ఎస్. హైస్కూలు, 3) డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి ఇల్లు, హాస్పటల్. అనగా ముఖ్యంగా కమ్మ కులమునకు చెందినవారి ఆస్తులు. అప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండుట వలన, స్వర్గీయ ఎన్. టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా, నరసరావుపేట వాస్తవ్యులు డా॥ కోడెల శివప్రసాదరావు గారు హోమ్ మినిష్టరుగా ఉన్నారు. గుంటూరు పార్లమెంటు సభ్యులుగా శ్రీ ఎన్.జి. రంగా గారున్నారు.

ఆ రోజు హాస్టలు వార్డెన్ ఆఫీసులో ఉన్న బీరువాలో ఎక్కువ మొత్తము డబ్బు ఉన్నది. దుశ్చర్యకు పాల్పడినవారు ఆ గది జోలికి వెళ్ళకపోవుట వలన ఆ డబ్బును మధ్యాహ్నమునకు అప్పటి క్లర్క్ శ్రీ బొల్లేపల్లి శ్రీనివాసరావు గారిచే తెప్పించుకుంటిని. ఇది జరిగిన కొద్ది రోజులకే అప్పటి గౌరవ ముఖ్య మంత్రివర్యులు డా॥ NTR గారు, డా॥ కోడెల శివప్రసాదురావుగారు, శ్రీ ఎన్.జి. రంగాగారు హాస్టళ్ళకు విచ్చేసి జరిగిన నష్టాన్ని గమనించి, విద్యార్థులకు మనోధైర్యమును కల్గించిరి. ఈ దాడులలో నాజ్ సెంటర్‌లో స్వర్గీయ గడ్డిపాటి కోటేశ్వరరావుగారు నడుపుచున్నటువంటి నవయుగ బార్ & రెస్టారెంట్‌కు కూడా ఎక్కువ నష్టం జరిగింది. శ్రీ గడ్డిపాటి కోటేశ్వరరావుగారు హాస్టలు విద్యార్థులకు భోజనం కొరకు ఆర్థిక సహాయం చేయుటయేకాక హాస్టలు మంచి చెడులను గమనిస్తూ ఉండేవారు. ఆ సంవత్సరం గుంటూరు కలెక్టరుగా ఉన్న మనసున్న మహామనీషి శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మగారు. వారు నష్టపోయిన ప్రాంతములను పరిశీలించి, విద్యార్థులకు జరిగిన నష్టాన్ని గమనించి ఊరట వచనములు పలికి సానుభూతిని తెలియజేసిరి. ఈ అవాంఛనీయ సంఘటన తరువాత కమ్మ కులమునకు చెందిన పెద్దలు ముఖ్యంగా హైదరాబాదు కమ్మ సంఘంవారు శ్రీ వీరరాజు ఆధ్వర్యములో తెనాలి వాస్తవ్యులు సూరిరెడ్డి సూర్యమోహనరావు

గారు, రోటరీ క్లబ్‌వారు ఉదారముగా ధన సహాయము చేసిరి మరియు అరండల్‌పేట 4వలైనులో వైశ్యా బ్యాంకువారు రూ. 5,000/–లు విరాళంగా ఇచ్చిరి. అప్పటి డా॥ కొండబోలు బసవపున్నయ్యగారు అధ్యక్షునిగా, డా॥ గణేశుని పరంధామయ్యగారు సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించి విద్యార్థులకు జరిగిన నష్టమును పూడ్చవలెననే తలంపుతో సైకిలు షాపు నిర్వహించు శ్రీ డి. నరసింహారావుగారి ద్వారా కొంత రాయితీతో 44 కొత్త సైకిళ్ళను, మరియు నేను చీరాల వాసవి క్లాత్ మార్కెట్‌కు వెళ్ళి ఒక్కొక్క విద్యార్థికి రెండు ప్యాంట్లు, 2 షర్టులు చొప్పున తీసుకు వచ్చి పంచిపెట్టుట జరిగినది. రాష్ట్ర ప్రభుత్వం వారు జరిగిన నష్టాన్ని కొంతవరకైనా పూడ్చే దిశలో, నష్టపోయిన వారికి టేకు దుంగలు సరఫరా చేసిరి.

ఆ రోజులలో కలప వ్యాపారం చేయుచున్న శ్రీ జొన్నలగడ్డ మల్లేశ్వర రావుగారి సహాయంతో ఆ కలపను వారి అడితికి చేర్చి అక్కడే చెక్కలుగా మార్చి ఆ చెక్కతో విద్యార్థులు చదువుకొనుటకు వీలుగా 110 టేబుళ్ళు, 110 స్టూళ్ళు చేయించడమైనది. ఈనాడు హాస్టలులో జరిగే ఫంక్షన్లకు ఉపయోగించేటటువంటి పోడియం ఆ కలపతోనే చేయించుట జరిగినది. ఆ సంవత్సరం జరిపినటువంటి వార్షికోత్సవమునకు కలెక్టరుగారైన శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మగారిని ఆహ్వానించుట, వారితోపాటే అప్పటి డి.ఆర్.డి.ఏ. డైరెక్టర్ శ్రీ కోగంటి వెంకటేశ్వర్లుగారిని కూడా ఆహ్వానించుట జరిగినది. ఈ సందర్భంగా శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మగారిని నేను ఎక్కువసార్లు కలియుట వలన వారితో కొంత పరిచయం ఏర్పడినది. తరువాత కొద్దికాలమునకు శ్రీ శర్మగారు ఎలక్ట్రిసిటి బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిరి. ఆ రోజుల్లో హాస్టలు విద్యుత్ చార్జీలు కమర్షియల్ క్యాటగిరి కింద ఉండుట వలన ఎక్కువ మొత్తంలో చెల్లించుచుంటిమి. వేరే పనిమీద హైదరాబాదు వెళ్ళినప్పుడు శ్రీ శర్మగారిని కలిసి హాస్టలు విద్యుత్ ఇబ్బందులను తెలపగా, వారు వెంటనే క్రింది అధికారులకు తగు సూచనలు ఇచ్చి కమర్షియల్ క్యాటగిరి నుండి

డొమెస్టిక్ క్యాటగిరిగా మార్చుట వారి ఉదారతకు నిదర్శనం. దీనికి కారణం హాస్టలు నిర్వహణను వారు లోగడ స్వయంగా పరిశీలించుట వలన జరిగినది.

నేను 1989 సంవత్సరం నుండి రాత్రుళ్ళు హాస్టలులోనే ఒక గదిలో పడుకొనేవాడను. దానికి కారణం విద్యార్థులలో చదువు ఎడల శ్రద్ధ పెంపొందింప వలెనని దానికి నేను మార్గదర్శకునిగా ఉండవలెనని తలంపుతో రాత్రి 10.30 గంటల ప్రాంతంలో గదుల వెంట తిరిగి విద్యార్థుల హాజరు తీసుకొని మరలా వేకువజామున 4.45 గంటలకు విద్యార్థులను లేపెడివాడను. భోజన సమయం కూడా ఖచ్చితంగా పాటించుట జరిగినది. నేను కూడా విద్యార్థులతో పాటే భోజనం చేసెడివాడను. 1989వ నాటికి హాస్టలు నిర్వహణ క్రమశిక్షణకు మారుపేరుగా ఉండెడిది. దీని వెనుక విద్యార్థుల సహకారం, యాజమాన్యంవారి ప్రేరణ కూడా చెప్పుకోదగినది.

దీనికి కారణం – క్రమశిక్షణలేని విద్యార్థులను నిర్ధాక్షిణ్యంగా బయటకు పంపుట గానీ, లేక ప్రవేశం ఇవ్వకపోవుట గానీ జరుగుచుండెడిది. ఈ విషయాలలో యాజమాన్యంవారు ఎప్పుడూ తలదూర్చకపోవడం అభినందనీయం. 89వ సంవత్సరం నాటికి భవనములు వెలవెలపోవుచున్నవి. దానితో పాటు 88 డిసెంబర్ 26వ తేదీన జరిగిన సంఘటన పురస్కరించుకొని రెండు ప్రాంగణములకు రంగులు వేయించుటకు కావలసిన డబ్బు చేతిలో ఉండుటవలన ఆ కార్యక్రమమును పూర్తి చేసితిమి.

నేను వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించక పూర్వం (1987కు పూర్వం) వారాల ఏర్పాట్ల రూపంలో ఉన్నటువంటి సదుపాయమును ఉపయోగించుకొని విద్యార్థులే దాతలను ఏర్పరచుకొని వారిచ్చే ధన సహాయమును నెలవారీ బిల్లుల రూపంలో హాస్టలులో జమ చేయుచుండెడివారు. ఈ క్రమములో కొందరు విద్యార్థులు ఈ కార్యక్రమమును దుర్వినియోగం చేయుటయేకాక, విద్యార్థుల కాలం ఎక్కువగా వృధాయగుట గమనించాను. ఇందువల్ల విద్యార్థులలో న్యూనతాభావము

ఏర్పడుచుండెడిది. వీటిని అధిగమించుటకు డా॥ బసవపున్నయ్యగారు బాధ్యతలను స్వీకరించి దాతలతో మాట్లాడి దాతలను ఒప్పించి, వారిచ్చే ధనసహాయమును ప్రతినెల మొదటివారంలో హాస్టల్ గుమాస్తాయే వసూలు చేసి హాస్టలుకు జమ చేయుచుండెడివారు. కమ్మ హాస్టల్ నియమనిబంధనలను అనుసరించి విద్యార్థుల సంఖ్యలో 20% మందికి వారాల ఏర్పాటు చేయవలయును. అట్టివారి నుండి హాస్టలు యాజమాన్యం వారు ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు కాదు. ఈ కార్యక్రమం అంతా డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగు చుండెడిది. మరియు ప్రతి సంవత్సరం జూన్, జులై మాసములలో భోజన వసతికి సహాయపడే దాతలను సంప్రదించుట కొంతమందికి నచ్చజెప్పి ఒప్పించవలసి వచ్చెడిది. 1987-92 మధ్య నిరాటంకముగా కొనసాగించుట వలన హాస్టలులో ప్రవేశం కొరకు విద్యార్థుల నుండి, కులపెద్దల నుండి ఒత్తిడి ఎక్కువగా నుండుట వలన డా॥ బసవపున్నయ్యగారు దూరదృష్టితో జంపాల సాంబయ్యగారి హాస్టలు వెనుక వైపున అప్పటికే నిర్మించిన 16 గదుల పై భాగములో (3వ అంతస్తుగా) మరియొక 8 గదులను వేయవలెననే ఉద్దేశ్యంతో, ఒక్కొక్క గదికి రూ॥ 30 వేలు ఇచ్చినచో ఆ దాతపేరు పెట్టేటట్లుగా నిర్ణయించి (దాతల పేర్లు 3వ అనుబంధంలో ఉన్నవి) ఒక సంవత్సర కాలం లోపలే ఆ గదులను పూర్తిచేసి 15.08.1992వ సంవత్సరంలో "కళాప్రపూర్ణ పండిత గోపదేవశాస్త్రి"గారిచే ప్రారంభించుట జరిగినది.

1994 సంవత్సరంలో జంపాల సాంబయ్యగారి హాస్టల్ ప్రాంగణము లోనున్న పాత భవనము కప్పు బీటలువారి వర్షాకాలములో గదులలో నీరు కారుచుండెడిది. బిల్డింగ్ పైభాగము 4 అంగుళాల మేర తొలగించి ప్లాస్టిక పట్టావేసి, సన్నకంకరతో కాంక్రీటు వేయబడినది. తరువాత కొంత కాలమునకు ఉడెన్ కర్ర కడ్డీలు బలహీనపడుట, మరలా నీరు కారుటవలన 2002 సంవత్సరంలో పైకప్పు అంతయు పూర్తిగా తొలగించి, ఇనుప చువ్వలతో R.C.C. కాంక్రీట్ వేయడమైనది. భవనము గోడలుగాని,

స్తంభములుగాని ఎక్కడా బలహీనపడలేదు. ఈ క్రమములో తొలగించిన బర్మా టేకు దుంగలు తరువాత కాలములో కొంత ఉపయోగించి, మిగిలినది అమ్మట జరిగినది.

ఇన్ని మార్పుల జరిగిన తరువాత జంపాల సాంబయ్యగారి ప్రాంగణంలో పాత భవనములో సుమారుగా 30 మంది విద్యార్థులు, దానికి పడమర వైపునున్న పెంకుటింట్లో సుమారు 15 మంది, నూతనంగా నిర్మించిన భవనములో 72 మంది విద్యార్థులు ఉండెడి వారు. ఆ కాలంలో పాత హాస్టలులో సుమారు 90 మంది విద్యార్థులు ఉండెడివారు. భోజనహాలులో 90 మంది కూర్చొని భోజనం చేయుటకు వీలుగా ఉండెడిది. పాత భవనము ప్రాంగణంలో తూర్పు వైపునున్న శ్రీ చిరుమామిళ్ళ లక్ష్మీనారాయణ ప్రసాదు గారి విగ్రహాన్ని ఏ విధమైన నష్టంవాటిల్లకుండా అక్కడి నుండి తరలించి పాతభవనములో ఓపెన్ టు స్కై ప్రదేశంలో ముఖద్వారమునకు ఎదురుగా ప్రతిష్టించడమైనది. అదే సమయంలో అదే ప్రాంగణంలో ఈశాన్యమూల ఉన్న మరుగుదొడ్లను తొలగించి పాతభవనమునకు పడమరవైపున, వాయువ్య మూలలోనున్న విశాలమైన స్నానపుగదులను రెండుగా విభజించి పడమర వైపు మరుగుదొడ్లుగాను, తూర్పువైపు స్నానపు గదులుగాను మార్పుచేయుట జరిగినది. అదే విధముగా జంపాల సాంబయ్యగారి ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లను కూడా తొలగించి తూర్పువైపు ముఖములను, పడమరవైపుగా మార్చుట (క్రింది భాగంలో) వెనుకవైపు నిర్మించిన నూతన గదులకు ప్రతి అంతస్తులోనూ పడమర వైపు మరుగుదొడ్లు, స్నానపు గదులను ఏర్పరచుట, అప్పుడే గుంటూరు మున్సిపాలిటీవారు భూగర్భ మురుగుపారుదల ఏర్పాటు చేయుటవలన హాస్టలు రెండు ప్రాంగణములలోను భూగర్భ మురుగు పారుదలను ఏర్పాటు చేయటమైనది. మరియు క్రొత్తగా కట్టిన భవనంపై నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి వాటి నుండి స్నానపుగదులకు, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయడమైనది.

ఈ ప్రక్రియలో మున్సిపల్ వాటరుకు ఒక మోటరు (త్రాగునీటి కొరకు), బావి నుండి మరియొక మోటరు (ఇతర అవసరముల కొరకు) అమర్చడం చేత నీటి సౌకర్యం పుష్కలంగా ఉండెడిది. ఈ మార్పులు చేర్పులు నూతన భవన కట్టుబడి అంతయు డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుచుండెడివి. వారు ప్రతిరోజూ ఒక గంట సమయము పనివారితో గడిపి వారికి తగిన సూచనలు ఇచ్చి సివిల్ వర్క్‌లో అనుభవంతో మార్కెట్‌కన్నా తక్కువ ఖర్చుకే పూర్తి చేయగలిగేవారము. సంవత్సరములు గడిచే కొద్దీ, చిన్న చిన్న మార్పులకు, రిపేర్లకు తదితరమైన ఖర్చులకు దాతల నుండి సహాయము కోరక, హాస్టలు వనరుల నుండి మాత్రమే పూర్తి చేయగలిగే వారము. ఈ పైన ఉదహరించిన పనులన్నియు 1992వ సంవత్సరమునాటికి పూర్తి చేయడమైనది.

నేను వార్డెన్‌గా పని చేసిన కాలమునకు నాకు ఎంతో తృప్తినిచ్చింది (1987-98). నా విధి నిర్వహణలో ఎటువంటి ప్రమేయం లేకుండా పూర్తి స్వేచ్ఛనిచ్చి తగు సూచనలు చేస్తూ నాకు దన్నుగా నిలచిన అధ్యక్షులు డా॥ కొండబోలు బసవపున్నయ్యగారు మరియు కార్యదర్శి శ్రీ గణేశున పరంధామయ్యగార్లకు నేను ఎంతో కృతజ్ఞుడను. వార్డెన్‌గా నా విజయానికి వెనుక ఆనాటి విద్యార్థులే. చదువుతోపాటు హాస్టలు గుమస్తా బాధ్యతలు కూడా నిర్వర్తించి నా పనిని కొంత వరకు సులువు చేసిరి. వారు 1) చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలానికి చెందిన రవీంద్రనాయుడు, 2) సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామమునకు చెందిన శ్రీ ఆళ్ళ సాంబశివరావు, 3) సంక్రాంతిపాడు గ్రామానికి చెందిన శ్రీ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, 4) కొప్పర్రు గ్రామానికి చెందిన శ్రీ బొల్లేపల్లి సుబ్బారావు మరియు 5) శ్రీ బొల్లేపల్లి శ్రీనివాసరావుగారు ముఖ్యులు.

ఆ రోజులలో భోజన వసతికి అయ్యే ఖర్చును రోజువారీగా లెక్కించి ఎన్ని రోజులు భోజనం చేస్తే అన్ని రోజులకు వసూలు చేసెడివారము. 3

రోజుల కన్నా తక్కువగా సెలవు పెట్టినచో, లెక్కించే విధానములో సెలవుగా పరిగణించేవారము కాము. అంతన్నా ఎక్కువ రోజులు సెలవు పెట్టిన యెడల ఆ రోజులను మాత్రమే సెలవుగా పరిగణించెడివారము. ఈ పై లెక్క ప్రకారము 1987 సంవత్సరములో రోజు ఒక్కింటికి 2 పూటల భోజనము చేసిన సుమారుగా రూ॥ 6.00 ఉండెడిది. నేను వార్డెన్ బాధ్యతలను విరమించుకొన్న సంవత్సరంలో (1998) రోజుకు అయ్యే ఖర్చు రూ॥ 22.00 వరకు ఉండెడిది. ఆ రోజులలో వంటచేయుటకు వరి ఊకను వాడుతుండెడివారము (ఊకపొయ్యి సహాయముతో). ఆధునిక గ్యాస్‌తో పోల్చినప్పుడు ఊకకు అయ్యే ఖర్చు సగముకన్నా తక్కువగును. నేను విద్యార్థిగా ఉన్న రోజులలో కట్టెలను ఉపయోగించెడివారు. డా॥ బసవపున్నయ్యగారు అధ్యక్షునిగా, శ్రీ మారుపూడి కోటేశ్వరరావుగారు వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఊకపొయ్యి ఏర్పాటు జరిగినది. అదే సమయంలో విద్యార్థులు భోజనం చేయుటకు ఎండుటాకుల స్థానంలో పింగాణిప్లేట్లు ఏర్పాటు జరిగింది. ఆ రోజులలో డొంకరోడ్డు వైపు రైలుకట్టను ఆనుకొని నివసించే యానాది కులమునకు చెందినవారు వంటపాత్రలను, వంటశాలను శుభ్రం చేయటంతోపాటు హాస్టలు ఆవరణను కూడా ఎంతో శుభ్రంగా ఉంచెడివారు. వీళ్ళు నాకు పూర్వమే, శ్రీ మారుపూడి కోటేశ్వరరావుగారు వార్డెన్‌గా ఉన్న రోజుల నుండి, నా పదవీ కాలం అంతయూ కూడా ఎంతో నమ్మకంగా, నిజాయితీగా పనిచేసిరి. దానికి నిదర్శనం నేను పదవి స్వీకరించినపుడు ఉన్న 100 కంచాలు నా పదవీ విరమణనాటికి 99 కంచాలుగా మారినవి. మరియొక ఉదాహరణ ప్రముఖ హోమియోపతి డాక్టర్ మరియు పూర్వపు కమ్మ హాస్టలు అధ్యక్షులు డా॥ పావులూరి కృష్ణచౌదరిగారు ఒకసారి సందర్శించి “మా ఇంటికన్నా హాస్టలే శుభ్రంగా నున్నది” అని అన్నారు. మరియొక విశేషం శ్రీ మారుపూడి కోటేశ్వరరావుగారి కాలంలో పాలు సరఫరా చేసిన స్వర్గీయ రామారావుగానీ, ఆయన మరణం తరువాత వారి అబ్బాయి నాగేశ్వరరావు ఇప్పటికీ హాస్టలుకు పాలు సరఫరా చేయుచున్నారు (అనగా గత 34 సంవత్సరముల నుండి).

నేను వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించేనాటికి డొంకరోడ్డులో నున్న (అరండల్‌పేట 7వలైను ఎదురుగానున్న) వైశ్యులు శ్రీ విశ్వనాథంగారు బియ్యం సరఫరా చేసేవారు. నాకు ఎవ్వరినీ మార్చే ఉద్దేశ్యం లేక వారిని బియ్యం సరఫరా చేయమనుట, వారు సందిగ్ధం వ్యక్తం చేయుట, తరువాత వారు బ్రతికి ఉన్నంత కాలం హాస్టలు నిర్వహణ గురించి ఇతరులతో ఎంతో గొప్పగా చెప్పుచుండుట మాకు సంతోషాన్ని కల్గించెడిది. భోజన నిర్వహణ మొత్తము అనగా పదార్ధముల ఎంపిక, జమా ఖర్చులు లెక్కించే విధానం అంతకూ విద్యార్థులతో కూడిన కమిటీవారే నిర్ణయిస్తారు. కాకపోతే పదార్ధముల ఎంపికలో ఆర్ధికముగా మధ్యతరగతివారిని దృష్టిలో పెట్టుకొని ఎంపిక జరుగుచుండెడిది. అప్పుడప్పుడు ఏర్పాటు చేసే మాంసాహారమునకు బిల్లు ప్రత్యేకముగా ఉండెడిది. ఈ విధంగా సజావుగా సాగుచున్నప్పుడు నేను 1998వ సంవత్సరములో జె.కె.సి. కాలేజి నుండి కొన్ని కారణాలవల్ల స్వచ్ఛంద పదవీ విరమణ చేసి, డాక్టర్ కె.ఎల్.పి. పబ్లిక్ స్కూలులో ప్రవేశించుట జరిగినది. మరియు నేను వార్డెన్‌గా 10 సంవత్సరాలకు మించి పని చేయుట వలన ఇంకా కొనసాగటం మంచిది కాదనే ఉద్దేశ్యంతో హాస్టలు అధ్యక్షులు, నన్ను వార్డెన్‌గా బాధ్యతలు అప్పజెప్పిన డా॥ బసవపున్నయ్యగారితో చెప్పగా వారు అంగీకరించలేదు.

నేను వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత విద్యార్థులు భోజనం చేసే పింగాణి ప్లేట్లు అనుకూలంగా లేకపోవుట వలన వాటి స్థానంలో స్టీలు పళ్ళెములు, స్టీలు గ్లాసులు, స్టీలు పెరుగు కప్పుల ఏర్పాటు జరిగినది. నేను వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహించిన కాలంలో మరియు ఆ తరువాత కూడా క్రమం తప్పకుండా జాతీయ ఉత్సవములైన రిపబ్లిక్‌డే, స్వాతంత్ర్య దినోత్సవమును పెద్దలను ఆహ్వానించి జరుపుకొనుచుండెడివారము. మరియు వార్షికోత్సవములను కూడా జరుపుకొనెడివారము. ఆ సందర్భంగా విద్యార్థు లలో పోటీ మనస్తత్వము పెంపొందించవలెనని వివిధ అంశములలో పోటీలు ఏర్పాటు చేయుట, బహుమతులు ఇచ్చుట జరుగుచుండెడిది.

ఈ కార్యక్రమములన్నింటిని జె.కె.సి. కళాశాల అధ్యాపకులైన డా॥ పులిచర్ల సాంబశివరావుగారు, శ్రీ గడ్డం అమ్మారావుగారు, శ్రీ గద్దె బుచ్చయ్య గారు, శ్రీ పర్చూరు గోపిచంద్‌గారు సహకారము అందించెడివారు. నేను వార్డెన్‌గా బాధ్యతలను నిర్వహించకపూర్వమే డా॥ గణేశుని పరంధామయ్య గారు సెక్రటరీగా ఉండేవారు. వారి స్థానంలో 1994వ సంవత్సరములో సీనియర్ లాయర్ శ్రీ పాపినేని లక్ష్మీనారాయణగారు బాధ్యతలను స్వీకరించిరి. వీరు క్రమము తప్పకుండా సంవత్సరమునకు రెండుసార్లు కార్యవర్గ సమావేశం ఏర్పరచుట, సంవత్సరమునకు ఒకసారి సర్వసభ్యుల సమావేశము ఏర్పరచి, ఆయా సమావేశములలో జరిగిన చర్చ, నిర్ణయములు ఇప్పటికీ హాస్టలు మినిట్స్ బుక్‌లో నిక్షిప్తమై ఉన్నవి.

జనరల్‌బాడీ సర్వసభ్యుల సమావేశమునకు ఎక్కువమంది వచ్చెడివారు కాదు. కార్యవర్గ సమావేశములో నిర్ణయానుసారము వార్డెన్ తన విధులను నిర్వర్తించుచుండేవారు. నా పదవీకాలంలో పైన ఉదహరించిన సెక్రటరీలు ఇద్దరు తమయొక్క సహాయసహకారములను అందించుట వలననే నేను నా బాధ్యతలను తృప్తిగా నిర్వహించగల్గితిని. దానికి మంచి ఉదాహరణ 1972- 1994 వరకు కార్యదర్శిగా వ్యవహరించిన డా॥ గణేశుని పరంధామయ్య గారిని ఎవరైనా హాస్టలుకు నీవు చేసినది ఏమిటి? అని అడిగినపుడు "నేను ఏమీ చేయలేదు, దానిని అట్లానే ఉంచాను." ఈ మాటల వెనుక ఎంత అర్థమున్నదో తెలుసుకొనుట కష్టము. ఆ రోజులలో ఆంధ్రప్రదేశ్‌లో 11 కమ్మ హాస్టళ్ళు ఉండెడివని, అవి తరువాతి కాలంలో అనేకరూపాలుగా మారి కమ్మ విద్యార్థులకు ఏ విధంగా సహాయపడుచున్నవో ఒకసారి ఆలోచించితే గుంటూరు కమ్మ హాస్టల్ ప్రత్యేకత అర్థమౌతుందని డా॥ పరంధామయ్యగారు అంటూ ఉండెడివారు.

నేను 1998వ సం॥లో బాధ్యతల నుండి తప్పుకొన్న తరువాత నా మిత్రుడు జె.కె.సి. కాలేజిలో తెలుగు అధ్యాపకులు డా॥ పులిచర్ల సాంబశివ రావుగారిని బలవంతంగా ఒప్పించి ఆ బాధ్యతను అప్పజెప్పడమైనది. వార్డన్లకు

దినచర్యలో పూర్తి స్వేచ్ఛ ఉండుట వలన ఎవరి ఆలోచనకు అనుగుణంగా వారు నడుపుచుండెడివారు. శ్రీ సాంబశిరావుగారికి హిందూ ఆచారాలపైన ఉన్న మక్కువతో చెప్పులు వేసుకొని భోజనం చేయుట సరికాదని భావించి విద్యార్థులందరూ చెప్పులు బయట వదిలి భోజనశాలలో ప్రవేశించే టట్లుగా మార్పుచేసిరి. మరియు అన్నింటికన్నా గొప్ప విశేషము ఎవరి ప్లేటు వారే పెట్టుకొనుట, వారే శుభ్రము చేసుకొనుట వలన తరువాతి రోజులలో పనివారితో ఏ విధమైన ఇబ్బంది లేకుండుట జరుగుచుండెడిది. మరియు ప్రతి సంవత్సరము కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి రోజున రాత్రి 10 గంటల తరువాత పాలు ఏర్పాటు చేసి ఆ పాలలో చంద్రకిరణములు పడేటట్లుగా ఒక ప్రదేశంలో ఉంచి పెద్దలతో చిన్నపాటి మీటింగ్ ఏర్పాటు చేసి ఆనాటి విశిష్టతను తెలిపిన తరువాత విద్యార్థులందరూ ఆ పాలు తాగినచో ఆరోగ్యము పెంపొందునని చెప్పెడివారు.

ఈ విధముగా నిర్వహింపబడే ఉత్సవమును "కొజాగిరి" అని చెప్పు చుండెడివారు. శ్రీ సాంబశివరావు కూడా పాత పద్ధతులలోనే పట్టుతప్పకుండా హాస్టలు నడిపెడివారు. శ్రీ సాంబశివరావుగారు హాస్టలు వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆనాటి పెద్దలు నేను కూడా కార్యవర్గంలో ఉండుట మంచిదని భావించి, నాకు "కోశాధికారి" బాధ్యతలను అప్పజెప్పిరి. నేను వార్డెన్‌గా ఉన్నపుడు వలె కాకుండా ఎక్కువ రోజులు సాయంకాలము హాస్టలుకు వెళ్ళి సాంబశివరావుగారికి మనోబలాన్ని కలిగించెడివాడను. శ్రీ సాంబశివ రావుగారు సున్నిత మనస్కుడైనందు వలన విధి నిర్వహణలో వచ్చే చిన్న చిన్న ఇబ్బందుల వలన మనస్థాపం చెంది నాలాంటివారికి, ఇలాంటి బాధ్యతలు తగవని అనేకసార్లు నాతో చెప్పి, తనను విముక్తునిగా చేయమని అడగడం అదేక్రములో జె.కె.సి. కాలేజి వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు శ్రీ గోగినేని సాంబశివరావుగారికి 2002వ సంవత్సరములో వార్డెన్ బాధ్యతలను అప్పజెప్పుట, వారి ముక్కుసూటితత్వముతో ఏ విధమైన క్రమశిక్షణా రాహిత్యానికి తావివ్వకుండా నడిపిరి.

శ్రీ సాంబశివరావుగారు వార్డెన్‌గా ఉన్నంతకాలము వారికి తోడుగా వయసులో పెద్దవారైన శ్రీ ఆర్. క్రిష్ణయ్యగారు డిప్యూటీ వార్డెన్‌గారు సాంబశివ రావుగారికి ఎంతో సహాయకారిగా ఉండెడివారు. అప్పుడు కూడా నేను హాస్టల్ కోశాధికారిగా శ్రీ పాపినేని లక్ష్మీనారాయణ కార్యదర్శిగా ఎక్కువ రోజులు రాత్రి 8.00 గంటల వరకు హాస్టలులోనే గడుపుచుండెడివారము. జె.కె.సి. కాలేజిలో 2004వ సంవత్సరంలో పరిపాలనాపరమైన మార్పులు జరుగుట, ఆ క్రమములో శ్రీ గోగినేని సాంబశివరావుగారు కొంత మనస్తాపం చెంది తనను హాస్టల్‌వార్డెన్‌గా బాధ్యతల నుండి తప్పించమని ఒత్తిడి చేయుటవలన, అదే కళాశాలలో హిందీ అధ్యాపకునిగా పనిచేయుచున్న యువకుడు శ్రీ తుమ్మల శ్రీనివాసరావుగారికి వార్డెన్‌గా బాధ్యతలను అప్పజెప్పుట జరిగినది. కానీ కారణాలు ఏమైనప్పటికీ కొన్ని నెలల వ్యవధిలోనే శ్రీనివాసరావుగారు ఆ బాధ్యతలనుండి తప్పుకొన్నారు.

తరువాత వార్డెన్‌ను నియమించుటలో సరి అయిన అభ్యర్ధి లభించక పోవుటవలన కొంత జాప్యము జరిగినది. ఆ మధ్యకాలంలో రోజూ నేను సాయంత్రం పూట భోజనం ముగిసేటంత వరకు నేను హాస్టల్‌లో ఉండవలసి వచ్చెడిది. అంతకు ముందు డిప్యూటీ వార్డెన్‌గా ఉన్న శ్రీ ఆర్. క్రిష్ణయ్య గారు ఎక్కువగా బాధ్యతలను నిర్వహించెడివారు. అప్పటి కార్యవర్గ ఆలోచన హాస్టలు వార్డెను బాధ్యతలను, హాస్టలు పూర్వవిద్యార్థులు చేపట్టిన యెడల బాగుగా ఉండునని తలచి అంతకు పూర్వం శ్రీ మారుపూడి కోటేశ్వరరావు గారు మరియు నేను వార్డెన్‌గా ఉన్నప్పుడు హాస్టల్ విద్యార్థి అయిన కొప్పర్రు గ్రామమునకు చెందిన శ్రీ గుత్తా శ్రీనివాసరావు ప్రత్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూలు హెడ్‌మాష్టరుగా పని చేయుచుండెడివారు.

మరియొక హాస్టల్ పూర్వ విద్యార్థి శ్రీ బొల్లేపల్లి శ్రీనివాసరావు, నేను, శ్రీ గుత్తా శ్రీనివాసరావును సంప్రదించి, 2006 వ సంవత్సరంలో వార్డెన్‌గా నియమించడమైనది. శ్రీ గుత్తా శ్రీనివాసరావు తన సౌలభ్యం కొరకై తన నివాసమును హాస్టల్ దగ్గరకు మార్చుకొని విద్యార్థులలో క్రమశిక్షణను

పెంపొందించుటకు ఎక్కువ సమయము గడిపిరి. కానీ శ్రీనివాసరావు వార్డెన్ బాధ్యతలను నిర్వహించిన కాలము గుమస్తాల సమస్య వెంటాడుచుండుట వలన శ్రీ శ్రీనివాసరావుగారు ఆర్థికంగా కొంత నష్టపోవలసి వచ్చింది.

శ్రీ గుత్తా శ్రీనివాసరావు వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహించుచున్నప్పుడే అనగా 2006-2010 మధ్య ఆధునిక నిర్మాణ కార్యక్రమం మొత్తము జరిగినది. ఈ నిర్మాణ కార్యక్రమము పర్యవేక్షించుటకు తన్నీరువారిపాలెం గ్రామవాస్తవ్యులు శ్రీ కొల్లా సత్యవెంకట్రావుగారిని నియమించడమైనది. అప్పటి వరకు హాస్టల్ గుమస్తాగా పనిచేయుచున్న ఆర్. క్రిష్ణయ్యగారు తన కుమారులు నిర్వహించుచున్న వ్యాపారమందు ప్రవేశించుట వలన హాస్టల్ విధుల నుండి తప్పుకోవడం, హాస్టలు బాధ్యతలు కూడా భవన నిర్మాణ కార్యక్రమాన్ని పర్యవేక్షించుచున్న కొల్లా సత్య వెంకట్రావుగారే శ్రీ గుత్తా శ్రీనివాసరావుగారికి సహాయపడేవారు. శ్రీ గుత్తా శ్రీనివాసరావు ప్రతిరోజూ ప్రత్తిపాడు వెళ్ళటం, గుంటూరులో కాపురం ఉండుట ఎక్కువ టైమ్ హాస్టల్ బాధ్యతలలో గడపలేక పోవుచున్నాను. నేను అనుకొన్న విధమగా సమయం చాలకపోవుట వలన నన్ను వార్డెన్ బాధ్యతల నుండి తప్పించవలసింది"గా కోరడం, దానికి మరియొక కారణం వారికి ప్రత్తిపాడు నుండి ట్రాన్స్‌ఫర్ జరగడం. మరలా కొత్త వార్డెన్ అన్వేషణ ప్రారంభం కావటం, విద్యార్థుల సంఖ్య పెరగడం వలన ఇద్దరు వార్డెన్లు ఉంటే మంచిదని తలంచి, నేను వార్డెన్‌గా ఉన్నప్పుడు హాస్టల్ పూర్వ విద్యార్థి వీరన్నపాలెం గ్రామమునకు చెందిన మొవ్వా శ్రీనివాసరావుగారిని మరియు 'సొలస' గ్రామమునకు చెందిన కిలారు జయలక్ష్మీనారాయణగార్లను 2009 వ సంవత్సరంలో ఎంపిక చేసితిమి. శ్రీ శ్రీనివాసరావు విజ్ఞాన్‌లారా కాలేజీలో ఇంగ్లీషు అధ్యాపకులుగా పనిచేయు చుండెడివారు.

శ్రీ లక్ష్మీనారాయణ R.V.R. & J.C. లో Maths Department లో Asst. Professor గా పనిచేయుచున్నారు. కొన్ని నెలల తరువాత శ్రీ

శ్రీనివాసరావుగారికి టైమ్ అడ్జస్ట్ కాకపోవటం వలన వార్డెన్ బాధ్యతల నుండి తప్పుకొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుట, ఉదయం అల్పాహారం ఏర్పాటుచేయుట, స్టడీ అవర్స్‌లో క్రమశిక్షణ పెంచుటకు, మరో ఇద్దరు డిప్యూటీ వార్డెన్లు ఉండటం మంచిదని ఆలోచన చేసి సంక్రాంతిపాడు గ్రామమునకు చెందిన శ్రీ ముప్పవరపు సత్యనారాయణగారిని, గుంటూరు స్తంభాలగరువుకు చెందిన శ్రీ ఆలపాటి నరేంద్రను నియమించటం, వారు ముగ్గురు తమ విధులను క్రమశిక్షణతో నిర్వహించుట వలన కార్యవర్గము ఊహించిన పద్ధతిలో హాస్టల్ నిర్వహణ అన్ని విధములా జరుగుచున్నది.

కాకపోతే కాలం గడిచేకొద్దీ పనివారి సమస్యలు పెరుగుచు వచ్చినవి. ఒక్కొక్కసారి పనివారు విసిగించేటప్పుడు మనోధైర్యాన్ని కూడా కోల్పోవలసి వస్తుంది. డిప్యూటీ వార్డెన్లు శ్రీ సత్యనారాయణ, నరేంద్రగార్లు ఉదయం 6.00 గంటల నుండి 11.00 గంటల వరకు, సాయంత్రం 4.00 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు విద్యార్థుల భోజన కార్యక్రమమును, స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించుచూ, విద్యార్థుల మధ్యనే గడిపెడివారు. వార్డెన్ శ్రీ లక్ష్మీనారాయణగారు సాయంత్రం 6.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు హాస్టల్‌లో ఉండేవారు. అధ్యక్షులైన శ్రీ బసవపున్నయ్యగారు అప్పుడప్పుడు రాత్రిపూట రెండు గంటలు వివిధ అంశములను సమీక్షించెడివారు. నేను ప్రతిరోజూ ఒకటి, రెండు గంటలు హాస్టల్‌లో గడిపెడివాడను. డిప్యూటీ వార్డెన్లను నియమించిన తరువాత విద్యార్థులను ఎక్కువకాలం పరిశీలించే వీలుండుట వలన హాస్టల్లో విద్యార్థులు చేరే సమయంలో వారి సలహాలకు ప్రాముఖ్యత ఇచ్చెడివారము.

ఇంతమంది వార్డెన్లు మారినా, కార్యదర్శులు మారినా, పాలకవర్గం మారినా, వారాల విద్యార్థుల భోజన వసతి కొరకు వారాలు అందించే దాతల పరిశీలన మాత్రం ఒక్క డా॥ బసవపున్నయ్యగారే ముందుండి తాను

ఇస్తూ, ఇతరులను నుండి ఒప్పించుట, ఒత్తిడి చేయడం ఎల్లకాలం సరికాదనే ఆలోచన చేసి హాస్టలుకు కొంత ఆదాయపు వనరులు ఉంటే బాగుంటుందని తలచి, మరియొక కారణం హాస్టలులో ప్రవేశం పొంద కోరిన విద్యార్థులందరికీ అవకాశం కల్పించలేక పోవుట, మరియు లక్ష్మీదేవమ్మగారి ప్రాంగణంలో దక్షిణం వైపున ఉన్న ప్రదేశం నిరుపయోగంగా పడియుండుట, భోజనశాల కూడా విద్యార్థుల సంఖ్య పెరుగుట వలన భోజనం చేయుటకు ఎక్కువ సమయం పట్టుట మరియు పూర్తిగా పాతదైపోవుట, దానిపైనున్న రేకు కప్పుతో కూడిన పఠన మందిరము వర్షమునకు కారుచుండెడిది.

ఈ పై ఉదహరించిన కారణములు అన్నియు పరిగణనలోనికి తీసుకొని ఆ భాగములో నూతన భవనము నిర్మింపవలెనని (భోజనశాలను పూర్తిగా తొలగించి) తలంచి సర్వసభ్య సమావేశమునకు తెలిపి తాను ముందుగా (డా॥ కొండబోలు బసవపున్నయ్యగారు) 10 లక్షల ధన సహాయము ప్రకటించి మున్సిపల్ కార్పొరేషన్ వారి అనుమతి పొందారు. నిర్మాణ కార్యక్రమమునకు ది. 06.03.2006న డా॥ మద్దినేని గోపాలకృష్ణగారు శంఖుస్థాపన చేసిరి. దానికి అప్పటి కులపెద్దలతో పాటు ఆ రోజులలో గుంటూరు-2 శాసన సభ్యులైన శ్రీ తాడిశెట్టి వెంకట్రావుగారు కూడా విచ్చేసిరి (వారి ఆఫీసు హాస్టలుకు ఎదురుగా ఉండెడిది). ఆ ప్రారంభించిన భవనంలో మొదటి అంతస్తు తూర్పు సగభాగము అద్దెకిచ్చునట్లుగా, పడమర సగభాగం భోజనశాలగానూ, రెండవ అంతస్తులో తూర్పు సగభాగము కూడా అద్దెకిచ్చునట్లుగాను, పడమర సగభాగము మీటింగ్ హాలుగా, 3వ అంతస్తు అంతయు 11 విశాలమైన గదులుగా విద్యార్థుల కొరకు ఉండేటట్లుగా చేయడమైనది. ప్రారంభించే నాటికి డా॥ బసవపున్నయ్యగారు ప్రకటించిన 10 లక్షలతోపాటు మరియొక 10 లక్షలు హాస్టల్ మూలధనం ఉండెడిది. నేను కోశాధికారి స్థానములో ఉన్నప్పటికీ ఈ బిల్డింగ్ మనం పూర్తి చేయగలమా? అనే అనుమానం నన్ను ఎప్పుడూ

వెంటాడుచుండెడిది. ఇదే భావాన్ని నేను బసవపున్నయ్య గారితో వ్యక్తం చేసినప్పుడు "నువ్వేమి భయపడకు. డబ్బులు అవే వస్తాయి" అనే మనోధైర్యాన్ని ఇచ్చుచూ దాతలను సంప్రదించి లక్ష రూపాయలు ఇచ్చిన దాతకు ఒక గదికి పేరు పెట్టుటగా నిర్ణయించి కార్యక్రమమును మొదలుపెట్టి విజయవంతముగా పూర్తి చేయుట జరిగినది. (దాతలపేర్లు 4వ అనుబంధం).

ఈ భవనం మొదటి అంతస్తుకు శ్రీమతి కొండబోలు వెంకటసుబ్బమ్మ Block అనియు, రెండవ అంతస్తుకు డా॥ పావులూరి కృష్ణచౌదరి Block అనియు, మూడవ అంతస్తుకు శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు Block అని పేరు పెట్టుట జరిగినది.

ఆ భవనము క్రింది భాగములోనున్న భోజనశాలకు, డా॥ కామెపల్లి రత్నబాబుగారి కోరికమేరకు, మురకొండపాడు వాస్తవ్యులైన శ్రీ యర్రా వెంకటసుబ్బయ్యగారి పేరు పెట్టుట జరిగినది. అదే విధంగా భోజనశాల పైభాగమునున్న మీటింగు హాలుకు, హాస్టలు, పూర్వ విద్యార్థి, తాడికొండ గ్రామస్తులు ప్రముఖ పొగాకు వ్యాపారవేత్త శ్రీ Y.K.S. ప్రకాశరావుగారి పేరు వారి కుమారుని కోరికమేరకు పెట్టడమైనది.

మరియొక విశేషం మాలో ఎవ్వరికీ తెలియని ఒక అపరిచితవ్యక్తి నాకు ఫోన్ చేసి (నేను కె.ఎల్.పి. స్కూలులో ఉండగా) తన పేరు శ్రీ పావులూరి సాంబశివరావు అని, తను హాస్టల్ పూర్వ విద్యార్థి అని, తాను అరండల్‌పేట 4వలైనులో వెళ్ళుచుండగా నిర్మాణ కార్యక్రమమును గమనించానని చెప్పి ఒక లక్ష రూపాయలు విరాళము స్వయముగా తీసుకు వచ్చి కె.ఎల్.పి. స్కూల్‌లో అందజేయడం మాకెంతో సంతోషాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది. ప్రస్తుతం వారు సాయిబాబా రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ నిర్మాణ కార్యక్రమం అంతయు ఒక సంవత్సరమున్నర కాలంలోనే పూర్తి చేయుట జరిగినది.

ఈ సమయంలో డా॥ బసవపున్నయ్యగారి పాత్ర "సైట్ ఇంజనీర్" పాత్ర. వారికి ఉన్న అపారమైన అనుభవంతో బిల్డింగ్ ప్లాన్ మొదలు పూర్తి అయ్యే వరకు ప్రతిరోజు ఉదయం హాస్టల్‌లో ఉండి నిర్మాణ కార్యక్రమం పర్యవేక్షించుచూ తగు సూచనలను చేయుచుండెడివారు మరియు వారికున్న అనుభవముతో నిర్మాణ వ్యయము కూడా చదరపు అడుగుకు రూ॥ 530 మాత్రమే అయినది. ఈ మార్పుల తరువాత భోజనశాలలో ఒకేసారి 150 మంది విద్యార్థులు భోజనం చేయుటకు వీలు కలిగినది. పనిలోపనిగా నూతన భవనముతో పాటు భోజనశాలలో బల్లలు, భోజనశాలకు మీటింగ్ హాలుకు కావలసిన కుర్చీలు, పఠన మందిరంలోకి కావలసిన బల్లలు ఏర్పాటు చేయడమైనది. ఆ భవనమును ది. 18.08.2007న వితరణశీలి, ధార్మిక వేత్త, అనేక సంవత్సరములు హాస్టలు విద్యార్థుల భోజనము కొరకు ఎంతో ధన సహాయము చేసిన శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణగారిచే ప్రారంభించ బడినది.

ఇప్పటికి బసవపున్నయ్యగారు అధ్యక్ష బాధ్యతలను స్వీకరించి 35 సంవత్సరములు అయినది. (1972 – 2007). ఈ కాలములో కార్యదర్శులు మారినా, కోశాధికారులు మారినా, వార్డెన్లు మారినా, అందరిని ఒక త్రాటిపై నడిపించుచూ హాస్టల్ పురోభివృద్ధికి చేసిన సేవకు గుర్తింపుగా ఈ నూతనముగా నిర్మించిన భవనమునకు వారి పేరు పెట్టుట సమంజసమని తలచి కార్య వర్గంలో ఏకగ్రీవంగా తీర్మానించిన తరువాత విమర్శించటం వారికెంతో బాధ కల్గించినది. మరియొక కారణం వారిచ్చిన భూరి విరాళంతోపాటు మిగిలిన దాతలను ఒప్పించుటలోనూ, వారే ప్రముఖపాత్ర పోషించిరి. అదియునూకాక, ఈ 35 సంవత్సరముల నుండి హాస్టల్‌లోని బీద విద్యార్థులకు మొదట వారు, తరువాత వారి కుమారులు ధన సహాయం చేస్తున్నారు. ఇన్ని జరిగిన తరువాత వారి పేరు ఉండుటయే సమంజసమని తలచి నూతన భవనమునకు అరండల్‌పేట 4వలైను వైపున వారి పేరు పెట్టుట జరిగినది.

అప్పటికీ హాస్టల్ గదులలో విద్యార్థులు పరుండుటకు మంచములు ఉండెడివి కావు. 1940వ ప్రాంతంలో హాస్టలు విద్యార్థిగా నున్న బోడపాడు వాస్తవ్యులు శ్రీ జాష్టి వెంకటరత్తయ్యగారు అమెరికాలో ఉన్నతస్థానంలో ఉన్నారు. వారు 2006లో ఇండియాను సందర్శించినపుడు హాస్టలుకు విచ్చేసి విద్యార్థుల మంచిచెడులను, వసతులను గమనించి, ఈ రోజులలో విద్యార్థులకు మంచాలు ఉండవలెనని తలంచి వాటికయ్యే ఖర్చు తాను భరించెదనని వాగ్దానం చేయుట వలన మొదటిసారిగా 250 మంచములు చేయించడమైనది. దఫాలవారీగా వారు సుమారు 10 లక్షల రూపాయలకు సమానమైన అమెరికన్ డాలర్లు పంపియున్నారు. దానికి గుర్తింపుగా వారి పేరు, వారి తల్లిదండ్రులైన శ్రీమతి జాష్టి చంద్రమ్మ, రాఘవయ్యగార్ల పేర్లు తరువాత నిర్మించిన భననములో ఒక అంతస్తుకు పెట్టుట జరిగినది. శ్రీ గోగినేని సాంబశివరావుగారు వార్డెన్‌గా వున్న సమయంలో (2005) హాస్టలు ఒకప్పటి విద్యార్థి గుంటూరు సమీపంలోని లామ్ గ్రామవాస్తవ్యులు, ప్రస్తుతము మద్రాసు సినీపరిశ్రమలో స్థిరపడిన శ్రీ వి.వి.ఆర్. చౌదరిగారు చాలా కాలము తరువాత హాస్టలుకు విచ్చేసి, వారు ఉన్న రోజులను గుర్తు చేసుకొని, వారి చదువు కొనసాగుటకు సహాయ సహకారములను అందించిన శ్రీ పాటిబండ్ల సీతారామయ్య వంటి పెద్దల ప్రేరణతో, హాస్టలు గదులలో ఫ్యాన్లు లేకపోవుట గమనించి, గదులతో పాటు అవసరమైన మిగిలిన భాగములకు కూడా కావలసినన్ని (సుమారుగా 80) ఫ్యాన్లు వారే స్వయముగా కొనుగోలు చేసి 4 రోజులు హాస్టలులోనే ఉండి, విద్యార్థులతో పాటే భోజనం చేస్తూ గదులలో ఫ్యాన్లు బిగించే కార్యక్రమము పూర్తి చేసిరి.

వారు ప్రత్యేకమైన వ్యక్తి. తన వివరములు చెప్పమంటే చెప్పరు. నా కొరకు మీరు ప్రయత్నించవద్దు. నేను వస్తూ ఉంటాను అని అప్పుడప్పుడు హాస్టలుకు వచ్చిపోయేవారు. ఇన్ని మార్పులు జరిగిన తరువాత హాస్టలులో ఉండే విద్యార్థుల సంఖ్య సుమారుగా 260 వరకు ఉండుటకు వీలుగా

ఉండేది. డా॥ బసవపున్నయ్యగారు ఈ నిర్మాణ కార్యక్రమాన్ని ఇంకను కొనసాగించవలెననే తలంపుతో శ్రీ జంపాల సాంబయ్యగారి హాస్టలులో మెయిన్ బిల్డింగుకు పడమరవైపున నిరుపయోగంగా ఉన్న పెంకుటింటిని తొలగించి దానితోపాటే వాయువ్యమూలలో ఉన్న స్నానపుగదులను కూడా తొలగించి పెంకుటింటికి పడమరవైపు మధ్యలోనున్న బావిని పూడ్చి ఆ ప్రాంతమంతయు చదునుచేసి కొంతకాలము ఖాళీగా ఉంచడమైనది. అదే సమయంలో డా॥ బసవపున్నయ్యగారు గుంటూరు నడిబొడ్డున ఇంత ఖాళీ స్థలం నిరుపయోగంగా పడి ఉండుట ఎవరూ హర్షించరు. దీన్ని కూడా “మనం ఏదో ఒకటి చేద్దాం” అని అంటూ ఉండేవారు. ఒకరోజు “ఈ స్థలమును కూడా కట్టుబడి ప్రారంభిద్దాం, అందుకు నేనే మరియొక 10 లక్షల విరాళం ఇస్తానని” చెప్పి హాస్టలులో జరిగే నిర్మాణ కార్యక్రమాన్ని అంతటినీ డా॥ బసవపున్నయ్యగారితో పాటు సలహాలు పంచుకొనే R.V.R. & J.C. Engineering College లోని Site Engineer Sri G. Bhaskar Rao గారిని ఆ పనికి పురమాయించి, అవసరమైన మున్సిపల్ ప్లాన్‌ను రూపొందించి ది. 23-03-2008 వ తేదీన కొప్పర్రు వాస్తవ్యులు ఒకప్పటి పూర్వ విద్యార్థి, అమెరికాలో స్థిరపడిన Dr. J.V. గారు శంఖుస్థాపన చేసిరి. ఈ మధ్యకాలంలో మేము కోరుకున్న విధంగా మున్సిపాలిటీవారు ప్లాన్ అంగీకరించకపోవటం అందునిమిత్తం డా॥ రాయపాటి శ్రీనివాసరావుగారు అప్పటి మునిసిపల్ కమీషనర్‌తో మాట్లాడటం, నేను ఆ పని మీద ఎన్నో రోజులు, కొన్ని గంటల కాలం మున్సిపల్ ఆఫీసులో వేచి యుండటం, చివరకు మున్సిపల్ కమీషనర్‌గారే స్థలము వద్దకు విచ్చేసి మేము కోరిన విధంగా ప్లాన్‌కు అంగీకరించిరి. ఈ క్రమములో నేను అనేకమార్లు భవన నిర్మాణం కొరకు కావలసిన డబ్బు చేతిలో లేకపోవుట వలన, భయపడుతూ ఉన్నప్పటికీ డా॥ బసవపున్నయ్యగారు నిబ్బరంగా “నువ్వేమి భయపడవద్దు. డబ్బులు అవే వస్తాయి” అంటూ తన మనస్సులో ఒక ప్రణాళికను

ఏర్పరచుకొని దాని ప్రకారం ఒక్కొక్కరిని సంప్రదించి కావలసిన ధనమును సమకూర్చారు.

ఈ సమకూర్చటంలో ఒక విధంగా తనకు బాగా సన్నిహితులైన మిత్రులను డిక్టేట్ చేసినంత పని చేశారు. అందుకు ఉదాహరణ తన చిరకాల మిత్రుడైన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన డా॥ బిక్కిన రామారావుగారి కుమారుడు చిరంజీవి సాయిరమేష్, సాయిమహేష్‌లు అమెరికాలో స్థిరపడుట వలన, వారిని 10 లక్షల రూపాయలు పంపమని ఒక విధంగా ఆర్డరు వేయడం జరిగింది. అదే విధంగా ప్రత్తి విత్తనాల వ్యాపారరంగంలో బాగా స్థిరపడిన నూజివీడు సీడ్స్ అధిపతి శ్రీ మండల వెంకట్రామయ్యగారిని అడగటం, వారు 10 లక్షల రూపాయలు ఇవ్వటం జరిగింది. వీరితోపాటు ఇదివరకు సహాయం చేసిన దాతలను సంప్రదించుట, వారు సంతోషంగా ఒక లక్ష రూపాయలు తగ్గకుండా విరాళం ప్రకటించుట జరిగినది. ఈ బిల్డింగ్‌నకు కూడా ఒక లక్ష రూపాయలు ఇచ్చిన దాతకు ఒక గది పేరు పెట్టుట జరిగినది.

ఈ నిర్మాణ కార్యక్రమం అంతయూ 18 నెలల్లో పూర్తి చేసి మార్కెట్ విలువకన్నా తక్కువగా పూర్తి చేయుటలో శ్రీ బసవపున్నయ్యగారు తన మేధస్సునంతయూ ఉపయోగించిరి. ఈ కట్టడంలో సెల్లార్ పార్కింగు, అద్దెకిచ్చుటకు వీలుగా బేస్‌మెంట్, దానిపైన ఒక్కొక్క అంతస్తులో విశాలమైన 10 గదులతో కూడిన రెండంతస్తుల భవనం, వాటిపైన రెండు గదులు నిర్మించుట జరిగినది. ఈ భవనములో 1వ అంతస్తు: శ్రీమతి బిక్కిన వీరభద్రమ్మ, డా॥ రామారావు పేరు, 2వ అంతస్తు: శ్రీమతి మండవ రమాదేవి, వెంకట్రామయ్యగారి పేరు, 3 అంతస్తు : శ్రీమతి జాష్టి చంద్రమ్మ, రాఘవయ్య గారి పేర్లు పెట్టుట జరిగినది. (గదులపైనున్న దాతల పేర్లు 4వ అనుబంధంలో ఇవ్వబడినవి). ఈ బిల్డింగ్‌ను 12-8-2009వ తారీకున డా॥ కొండబోలు బసవపున్నయ్యగారిచే ప్రారంభింపబడినది.

ఈ నిర్మాణ కార్యక్రమమంతయూ పూర్తి అయిన తరువాత 360మంది విద్యార్థులు సౌకర్యవంతముగా ఉండుటకు వీలగుచున్నది. పాత హాస్టలు, కొత్త భవనంలోని కొంత భాగము అప్పటికే 2007 సం॥ల అద్దెకివ్వటం జరిగినది (ఫర్నిచర్ షాప్). కొత్త హాస్టలులోని కొత్త భవనము బేస్‌మెంటులో కొంత భాగము, మిగతా సగ భాగములో కంప్యూటర్ సెంటర్‌కు 2009వ సంవత్సరంలో అద్దెకివ్వటమైనది (మహాలక్ష్మి హోమ్‌నీడ్స్).

2007 సంవత్సరంవరకు విద్యార్థుల భోజనవసతికి అయ్యే ఖర్చు లాభనష్టములు లేని పద్ధతిలో లెక్కించి ప్రతినెలా జమచేయుచుండెడివారు. అదే విధముగా వారాల ఏర్పాటు కలిగిన విద్యార్థుల భోజన ఖర్చును హాస్టలు గుమస్తాయే ప్రతినెలా వసూలు చేసెడివారు. ఈ సందర్భంగా చెప్పవలసిన మరొక విషయం వారాల సహాయం పొందే విద్యార్థుల ఎంపిక. నేను వార్డెన్‌గా ఉన్నంతకాలం జూన్ మాసంలో అడ్మిషన్లు పూర్తి కాగానే జులై మాసంలో విద్యార్థుల నుండి దరఖాస్తులను స్వీకరించి ప్రెసిడెంట్‌గారు, కార్యదర్శిగారు, వార్డెన్‌తో కూడిన కమిటీ దరఖాస్తు చేసిన విద్యార్థులను ప్రత్యక్షంగా విచారించి ఎన్నుకొనుట జరిగెడిది. ఈ ఎంపికలో విద్యార్థి మార్కులు, నడవడి, కుటుంబ నేపథ్యం పరిశీలించుట జరుగుచుండెడిది. మార్కులు తక్కువ వచ్చినవారికి, క్రమశిక్షణ లేనివారిని ఎవరు చెప్పినా పరిగణలోనికి తీసుకునేవారముకాదు. ఈ విధంగా నెలవారీ లెక్క కట్టడం విద్యార్థులు సకాలంలో చెల్లించకపోవడం, సమస్యలు తలెత్తగా 2009వ సంవత్సరంలో సంవత్సరమునకు మొత్తం (భోజన వసతితో కలిపి రూ॥ 12,000/-) గా నిర్ణయించగా విద్యార్థులు అడ్మిషన్ల సమయమందు రూ॥ 6,000/- లు, నవంబర్ మాసములో మరియొక 6,000/- లు చొప్పున జమ చేయుచుండెడివారు.

ఆనాడు ఈ కట్టిన డబ్బు సరిపోనిచో ఏమి చేయవలెననే ఆలోచన వచ్చినప్పుడు అద్దె ద్వారా వచ్చే డబ్బుతో పూడ్చుకొనవచ్చును అని ఆలోచన చేసితిమి. ఆ సంవత్సరం గడిచిన తరువాత వచ్చిన అనుభవముతో మరియు

2010వ సంవత్సరంలో క్రొత్త హాస్టలులోని క్రొత్త భవనం కొంత భాగం కూడా అద్దెకిచ్చి, ఆ ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని తరువాత సంవత్సరం (2010–11) విద్యార్థి నుండి 11 వేల రూపాయలే వసూలు చేయవలెనని నిర్ణయించి దానితోపాటే మారిన కాలానికి అనుగుణంగా రెండుపూటలా భోజనంతో పాటు ఉదయం అల్పాహారము కూడా ఏర్పాటు చేయడమైనది.

2010 సంవత్సరంలోనే వారాలకు సహాయం చేసే దాతల వద్ద నుండి డబ్బు వసూలు చేయుట ఆపి, హాస్టల్‌కు అద్దెలరూపంలో వచ్చే డబ్బులో బీద విద్యార్థుల భోజన, వసతికి అయ్యే ఖర్చును హాస్టలే భరించుచుండెడిది. ఈ సందర్భంగా మనం తెలుసుకోవలసిన ముఖ్య విషయము ఆస్తి పన్ను, నీటి పన్ను, కరెంటు పన్ను, పరిపాలనా పన్ను మొదలగునవి. నేను వార్డెనుగా బాధ్యతలు స్వీకరించేనాటికి (1987) హాస్టలు భవనమునకు ఏ విధమైన ఆస్తిపన్ను ఉండేది కాదు. కరెంటు బిల్లు కూడా గదులలో ఫ్యాన్లు లేకపోవుట వలన, వంటశాలలో ఇతర కరెంటుపై పనిచేసే పరికరాలు లేకపోవుటవలన బిల్లులు తగుమాత్రంగానే వచ్చుచుండెడివి. విద్యార్థుల నుండి భోజన ఖర్చులను నెలవారీ వసూలు చేయుచుండుట వలన ఇతర ఖర్చుల నిమిత్తమై సంవత్సరమునకు 2000/– రూపాయలు ప్రవేశ సమయమందు వసూలు చేసి ఆ ఖర్చులను భరించుచుండెడివారము. దీనిలో వారాల విద్యార్థుల నుండి ఎస్టాబ్లిష్మెంట్ చార్జీలు వసూలు చేసేవారము కాదు. మరియు విద్యార్థి ప్రవేశ సమయంలో 1000/– రూపాయలు కాషన్ డిపాజిట్ తీసుకొని సంవత్సరం చివర వెళ్ళేటప్పుడు ఇచ్చేవారము.

అడ్మిషన్ విధానం కూడా ఏ సంవత్సరమునకు ఆ సంవత్సరమే అడ్మిషన్ ఇచ్చుచుండెడివారము. క్రమశిక్షణ లోపించినవారిని, సంవత్సరం మధ్యలో బయటకు పంపిన విద్యార్థులను హాస్టలులో చేర్చుకొనేవారముకాదు. గుంటూరు మునిసిపాలిటీ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన తరువాత ఆస్తిపన్ను విధించుట, దఫాలవారీగా పెరిగి, (2012 నాటికి) 2 బిల్డింగులకు

కలిపి సుమారుగా 4,00,000/- రూపాయలు, అదే విధముగా కరెంటు చార్జీలు కూడా దఫాలవారీగా పెరుగుట, విద్యార్థులకు సౌకర్యాలు పెరుగుటవలన నెలసరి కరెంటు బిల్లులు సగటున 35,000/- రూపాయలుగా వస్తున్నవి. అనగా మునిసిపల్‌పన్నులు, నీటిపన్నులు, కరెంటుచార్జీలు, అడ్మినిస్ట్రేషన్ చార్జీలు కలుపుకొని సంవత్సరమునకు సుమారుగా 10,00,000/- రూపాయలు చెల్లించవలసి వచ్చుచున్నది.

ఈ అద్దె సౌలభ్యం ఉండుట వలన విద్యార్థులపైన ఈ చార్జీలు విధించక పోవటం వలన భోజన వసతి కొరకు మాత్రమే 11,000/- రూపాయలు వసూలు చేయుట, ఆ డబ్బుతో అద్దెలలో కొంత మిగిలిన ధనముతో భోజన ఏర్పాట్లు చాలా జాగ్రత్తగా నడుపవలసి వచ్చుచుండెడిది. ఇదే సందర్భంలో వారాల కొరకు దాతల నుండి ఏ విధమైన డబ్బు సేకరించక పోవుట వలన అద్దెద్వారా వచ్చే డబ్బుతో వారి భోజనఖర్చు కూడా జరుపవలసి వచ్చుచున్నది. ఇన్ని బాధ్యతలతో జరుపుతున్నపుడు "డబ్బు తగ్గితే దాతలనే అడుగుదాములే" అని డా॥ బసవపున్నయ్యగారు అంటుండేవారు. తక్కువ కాదు అని వారి ఉద్దేశ్యము. అన్ని హాస్టల్స్‌లోనూ 17000/- నుండి 27000/ - రూపాయలు వసూలు చేయుచున్నారు. కార్పొరేటు సంస్థలలో ఇంకా ఎక్కువ వసూళ్ళు చేవావారు.

2016 సంవత్సరంలో కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ మందలపు బంగారుబాబుగారు కూడా హాస్టల్ పూర్వవిద్యార్థియే. జె.కె.సి. కళాశాలలో విద్యను అభ్యషించుచు మన హాస్టలు ఉండేవారు. వీరు బాధ్యతలు స్వీకరించిన తరువాత కూడా కిలారు జయలక్ష్మినారాయణగారు వార్డెన్‌గా, శ్రీ ముప్పవరపు సత్యనారాయణగారు డిప్యూటీ వార్డెన్‌గా కొనసాగుతూ, క్రమశిక్షణలోగాని, ఆహారములోగాని లోపము లేకుండా పట్టుతప్పకుండా, బంగారుబాబుగారి భాషలో Patch Work లేకుండా కొనసాగుటమైనది.

2014వ సంవత్సరంలో ప్రస్తుతము భోజనశాల ఉన్న భవనం 3వ అంతస్తు మధ్యలో ఆపటమైనది. దీనికి కారణము సెంట్రింగ్ పెట్టిన తరువాత మున్సిపల్ అధికారులు సక్రమమైన బిల్డింగ్ ప్లాన్ లేదని తొలగించుట జరిగినది. బంగారుబాబుగారి ఆధ్వర్యంలో డాక్టరు కొండబోలు బసవపున్నయ్య గారి పద్యవేక్షణలో ఆగిపోయిన 3వ అంతస్తు 2017వ సంవత్సరములో పూర్తిచేసి విశాలమైన 10 గదులు ఏర్పడినవి.

తరువాతి కార్యక్రమము, అమరావతిరోడ్డులో శ్రీ పాటిబండ్ల సీతారామయ్యగారు దానము చేసిన సుమారు 2 ఎకరముల భూమి చుట్టు 2018వ సంవత్సరంలో సుమారుగా 40 లక్షల వెచ్చించి ప్రహరీగోడ నిర్మించుట జరిగినది.

2019వ సంవత్సరంలో జంపాల సాంబయ్యగారి బిల్డింగ్‌కు రంగులు వేయుట మరియు రెండు బిల్డింగులకు C.C. కెమెరాలు ఏర్పాటు చేయటమైనది.

శ్రీ శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి ప్రాంగణములోని పాతభవనము కప్పుకూడ బలహీనపడుట వలన కొయ్య కడ్డీలను తొలగించి కొన్ని మార్పులు చేసి 2021వ సంవత్సరంలో R. C.C కప్పు వేయుట జరిగినది. భవనము గోడలుగాని, స్తంభములుగాని, పటిష్టముగా ఉండుట వలన ఏ విధమైన మార్పు చేయలేదు.

తెనాలి దగ్గర కోపల్లె గ్రామమునకు చెందిన శ్రీమతి నల్లూరి వరజాక్ష్మమ్మగారు శేకూరి గ్రామ పరిధిలో సుమారుగా 2 ఎకరముల భూమి తమయొక్క వీలునామా ద్వారా కమ్మ హాస్టల్ విద్యార్థుల భోజన వసతికై దానమిచ్చిరి. కాని కొందరు వారసులమని తెనాలి కోర్టులో న్యాయపరమైన చిక్కులు ఏర్పడి, 2012వ సంవత్సరంలో కోర్టుతీర్పు ద్వారా హాస్టల్ యాజమాన్యంవారికి స్వాధీనమైనది. ఆ భూమిపై వచ్చు కౌలు ఆదాయము

శేకూరి గ్రామస్తులయిన శ్రీ వాసిరెడ్డి రామారావుగారి పర్యవేక్షణలో కౌలు డబ్బులు హాస్టల్‌కు చెందినవి. కాని 2018వ సంవత్సరం తరువాత మరలా న్యాయపరమైన ఇబ్బందులు ఏర్పడినవి.

హాస్టలు పూర్వ విద్యార్థి శ్రీ యడ్లపాటి వెంకట్రావుగారి (మాజీ మంత్రివర్యులు) శతజయంతి సభను 2018 డిసెంబరులో నిర్వహించాము.

డాక్టర్ కొండబోలు బసవపున్నయ్యగారు హాస్టలుకు అధ్యక్షులుగా 50 సంవత్సరములు పూర్తి అయిన సందర్భముగా 2022 ఏప్రియల్‌లో వారిని ఘనంగా సత్కరించడమైనది.

2023 ఏప్రియల్‌లో హాస్టలుకు 100 సంవత్సములు నిండిన సందర్భములో మాజీ కేంద్రమంత్రి శ్రీ సుజనాచౌదరిగారు ముఖ్యఅతిథిగా కార్యక్రమమును నిర్వహించడమైనది.

# కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటి నేపథ్యం

కమ్మహాస్టలు పూర్వ విద్యార్థి, కొప్పర్రు గ్రామమునకు చెందిన డాక్టర్ జాష్టి వెంకటేశ్వర్లుగారు గుంటూరు A.C. కళాశాలలోను, J.K.C. కళాశాలలోను రసాయనశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసిరి. వీరు స్వయముగా తాను ఇతరుల సహాయముచే చదువును కొనసాగించినట్లుగా చెప్పుచుండెడివారు. తరువాత 1969వ సంవత్సరంలో అమెరికా వెళ్లి, ఆ దేశములో స్థిరపడిన తరువాత తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకొని, గుంటూరు కమ్మ హాస్టల్ మరియు దాతలు లేకపోయినచో నా చదువు కొనసాగెడిదికాదు అని అనేకమార్లు చెప్పిరి. కృతజ్ఞతాభావంతో సుమారుగా 1980 సంవత్సరం ప్రాంతంలో ఇంటర్నేషనల్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి, తాను, తన మిత్రుల సహాయముతో కొన్ని వేలమంది హైస్కూల్ విద్యార్థులకు సహాయము చేసిరి.

ఇదే క్రమములో 2001 వ సంవత్సరములో రిటైర్ అయిన తరువాత ప్రతి సంవత్సరము ఇండియా వచ్చి గుంటూరులో నివాసము ఉండి తనకు భిక్షపెట్టిన కమ్మ హాస్టల్ స్థితిగతులను తెలుసుకొనెడివారు. ఇదే క్రమములో హైస్కూలు విద్యార్థులకు కాకుండా కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా అవసరమైనవారికి కొంతవరకైనా ఆర్థిక సహాయము చేయవలెననే తలంపుతో 2003 వ సంవత్సరములో గుంటూరుకు చెందిన డాక్టర్ కొండబోలు బసవపున్నయ్యగారు అధ్యక్షునిగా శ్రీ కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీని ప్రారంభించారు.

అదే సంత్సరము వారు తిరిగి అమెరికా వెళ్లిన తరువాత అక్కడ ఉన్న తన మిత్రులను, ఇతర దాతలను సంప్రదించి శ్రీ కాకతీయ సొసైటీకి ఆర్థికపరంగా ఒక గుర్తింపు తెచ్చిరి. ఇదే క్రమంలో వారికి కెనడాలో స్థిరపడిన రేపల్లె దగ్గర నల్లూరు గ్రామమునకు చెందిన డాక్టర్ పుట్టగుంట

వేణుగోపాలరావుగారికి పరిచయం ఏర్పడుట, పెద్దమొత్తంలో ధన సహాయం వాగ్దానం చేయుట శ్రీ కాకతీయ సొసైటీకి పూర్తి రూపము ఏర్పడినది. ఈ సొసైటీ ప్రారంభించినపుడు, ప్రారంభించిన పెద్దలు, దాతలు ఊహించిన దానికన్న ఎక్కువగానే విజయవంతం అయినది.

ఈ సొసైటీవారు 2004వ సంవత్సరం నుండి క్రమము తప్పకుండా ప్రతి సంవత్సరం మొదటిలో 15 లక్షలతో ప్రారంభించి సుమారు 40 లక్షల వరకు అవసరమున్న, అర్హత కలిగిన కాలేజీ విద్యార్థులకు ప్రతి సంవత్సరం జనవరి మాసంలో బ్యాంకు చెక్కులరూపంలో ధన సహాయం చేయు చుండెడివారు. ఇదేక్రమంలో సొసైటీవారు నిర్ణయించిన అర్హత కమ్మ హాస్టలులో ఉన్న విద్యార్థులకు లేకపోవుట గమనించిన డాక్టరు జాష్టి వెంకటేశ్వర్లుగారు, డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావుగారు గమనించి కమ్మ హాస్టలు విద్యార్థులకు కనీస అర్హత తొలగించి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని హాస్టల్ కార్యదర్శి, వార్డెన్ పర్యవేక్షణలో సుమారు 50 మంది విద్యార్థులకు 5 నుండి 8 లక్షలు వరకు ఇచ్చుట జరిగినది. దానికి కారణం డాక్టర్ జాష్టి వెంకటేశ్వర్లు గారికి, తనకు భిక్షపెట్టిన కమ్మ హాస్టల్‌పైన ఉన్నటువంటి ప్రత్యేకశ్రద్ధ మరియు అభిమానము.


డాక్టర్ జాష్టి వెంకటేశ్వర్లుగారు అమెరికాలో ఉద్యోగ విరమణ తరువాత ప్రతి సంవత్సరము నవంబర్ మాసము నుండి మార్చి వరకు ఇండియాలో గడుపుచుండెడివారు. ఈ సందర్భంగా ఈ 4 నెలలు నేను కమ్మ హాస్టలులో ఉంటాను అని అభిప్రాయము వెలిబుచ్చగా డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య గారు ఆలోచించి, 2005వ సంవత్సరంలో శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి ప్రాంగణంలో, పాత భవనములో 2 గదులు ఆధునీకరించి అటాచ్డ్ బాత్రూమ్‌లో కూడిన అన్ని సౌకర్యములు ఏర్పరచిరి. కానీ ప్రతి సంవత్సరం వారి భార్యతో వచ్చుటవలన బయట వుండేవారు.

కానీ మరియొక దాత అయిన కెనడాకు చెందిన డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావుగారు మాత్రము ఈ ప్రత్యేక గదిలో కొన్ని సంవత్సరములు శ్రీమతి తోను, ఆమె గతించిన తరువాత ఒంటరిగాను ఉంటూ, హాస్టల్ విద్యార్థులతోనే భోజనం చేసెడివారు.

డాక్టరు పుట్టగుంట వేణుగోపాలరావుగారు ఈ అనుబంధానికి గుర్తుగా 2021)వ సంవత్సరములో శ్రీమతి శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి ప్రాంగణములో పాత భవనము కప్పు తొలగించినప్పుడు, అమెరికాలో ఉన్న కాకతీయ సొసైటీవారిని సంప్రదించి, TANA వారి సహకారముతో కమ్మ హాస్టలుకు ప్రత్యేకముగా 17 లక్షల రూపాయలు వరకు ధన సహాయము చేయుటలో తోడ్పడితిరి.



శ్రీ నామినేని కోటేశ్వరరావు, శ్రీ యలవర్తి రోశయ్య



1987–1988 : శ్రీ ఈదర భాస్కరరావు, శ్రీ జాగర్లమూడి నరేంద్రనాథ్,
శ్రీ గోగినేని కనకయ్య, శ్రీ ఏ.పి.వి.ఎస్. శర్మ (కలెక్టర్),
డా॥ కె. బసవపున్నయ్య.



1988 – సిండికేట్ బ్యాంక్ మేనేజరు, శ్రీ APVN శర్మ (కలెక్టర్),
డా॥ బసవపున్నయ్య, డా॥ పరంధామయ్య



1987 – 1988: శ్రీ ఐ.వి. రావు, డా॥ కె. బసవపున్నయ్య,
శ్రీ సాదినేని చౌదరయ్య, శ్రీ ఆలపాటి సత్యనారాయణ,
డా॥ గణేశుని పరంధామయ్య



1989 – డా॥ నూతక్కి వెంకటేశ్వరరావు




1991 – శ్రీ గడ్డిపాటి కోటేశ్వరరావు, శ్రీ ముక్కాల రాజగోపాలరావు,
డా॥ కె. బసవపున్నయ్య, డా॥ పరంధామయ్య



1991 – శ్రీ గుళ్ళపల్లి రామారాయుడు, డా॥ కె. బసవపున్నయ్య



1992 – డా॥ కె. బసవపున్నయ్య, శ్రీ పొనకల సాంబశివరావు,
శ్రీ పి. లక్ష్మణరావు



1992 – డా॥ గోపదేవశాస్త్రి, డా॥ కె. బసవపున్నయ్య,
డా॥ ముద్దన హనుమంతరావు



2006 – డా॥ గోపాలకృష్ణ, డా॥ బసవపున్నయ్య




2010 – శ్రీ నామినేని కోటేశ్వరరావు, డా॥ రాయపాటి శ్రీనివాస్,
డా॥ కె. బసవపున్నయ్య,



2010 – శ్రీ నామినేని కోటేశ్వరరావు, శ్రీ కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు,
డా॥ బిక్కిన రామారావు, డా॥ జె.వి.



2011 – డా॥ కె. బసవపున్నయ్య, డా॥ కామేపల్లి రత్నబాబు





2023 – డా॥ కె. కృష్ణప్రసాద్,  డా॥ కె. బసవపున్నయ్య,
శ్రీ సుజనాచౌదరి, శ్రీ యం. బంగారుబాబు



2023 – శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, శ్రీ బంగారుబాబు, డా॥ బసవపున్నయ్య



2023 – శ్రీ బంగారుబాబు, డా॥ బసవపున్నయ్య, శ్రీ రత్నగిరిబాబు



కీ.శే. చిరుమామాళ్ళ లక్ష్మీనారాయణప్రసాదుగారు



కీ.శే. జాగర్లమూడి కుప్పుస్వామిచౌదరిగారు



కీ.శే. బొల్లిన మునుస్వామినాయుడుగారు



కీ.శే. పాటిబండ్ల సీతారామయ్యగారు

# అనుబంధం - I

1928వ సంవత్సరం ప్రాంతంలో శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారి ఆధ్వర్యంలో ఈ క్రింద పేర్కొన్న దాతల విరాళముచే శాఖమూరి లక్ష్మీదేవమ్మగారిచే నిర్మించబడిన భవనముపైన మొదటి అంతస్తుగా 16 గదులు నిర్మించినట్లుగా తెలియుచున్నది. వారు చేసిన ధనసహాయము మొత్తమునకు వివరములు, ఆధారములులేవు. ఈ గదులను 1929వ సంవత్సరంలో అప్పటి ఉమ్మడి మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ బొల్లిన మునిస్వామినాయుడుగారిచే ప్రారంభింపబడినట్లు ఆధారాలు ఉన్నవి.

1. చిగురుపాటి రోశయ్య –దిడుగు
2. సూర్యదేవర బసవయ్య, బోడిపూడి భద్రయ్య –చేబ్రోలు
3. మల్లెల నాగేశ్వరరావు –గుంటూరు
4. కొత్తా సంగమయ్య –సంగం జాగర్లమూడి
5. కంచుమర్తి రాఘవయ్య –ఫణిదరం
6. వాసిరెడ్డి పెట్టెయ్య –చేబ్రోలు
7. అడుసుమల్లి నరసింహం –సిరిపురం
8. గోళ్ళమూడి చంద్రయ్య –వడ్లమూడి
9. జంపాల నరసింహం –దుగ్గిరాల
10. చాపరాళ్ళ మౌళయ్య –సిరిపురం
11. చాపరాళ్ళ సూరయ్య –సిరిపురం
12. దేవాబత్తుని వెంకట సుబ్బయ్య –చేబ్రోలు
13. పోసాని ప్రకాశరావు –కృష్ణాయపాలెం
14. జంపాల వెంకట రామారావు –దుగ్గిరాల
15. పరుచూరి చిన బసవయ్య –వడ్లమూడి
16. పాలడుగు వెంకటరాముడు –ముప్పాళ్ళ

# అనుబంధం - II

1980-81 సంవత్సరంలో శ్రీ జంపాల సాంబయ్యగారి హాస్టల్ దక్షిణంవైపున రెండతస్తులుగా నిర్మించిన 16 గదుల దాతలు (ఒక్కొక్కరు రూ|| 5000/-). మరియు హాస్టలులో ఉన్న మూలధనముతో.

1. శ్రీ కొడాలి వెంకటరత్నం చౌదరి
2. డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య
3. డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ
4. శ్రీ విద్వాన్ గోగినేని కనకయ్య
5. శ్రీ దేవరపు సూర్యనారాయణ
6. శ్రీ కోగంటి వెంకటేశ్వరరావు
7. శ్రీ లగడపాటి వెంకట రామానాయుడు
8. శ్రీ లగడపాటి వెంకటరత్నంనాయుడు
9. శ్రీ లగడపాటి అమరప్పనాయుడు
10. శ్రీ గోగినేని గోవర్ధనరావు
11. శ్రీ మాదల చినరంగారావు
12. శ్రీ పాములపాటి గోవిందప్రసాద్
13. శ్రీ రామినేని అంకమ్మ
14. శ్రీ అడుసుమల్లి ధర్మారావు
15. శ్రీ దేవరపు నరసింహారావు
16. శ్రీ పాలడుగు లక్ష్మణరావు

ఈ కార్యక్రమమునకు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీవారు రూ. 25,000/- లు ఇచ్చినారు. రెండవ అంతస్తుకు N.E.S. వారి పేరు పెట్టడమైనది. మొదటి అంతస్తుకు శ్రీ త్రిపురనేని రామస్వామిచౌదరిగారి పేరు పెట్టడమైనది.

## అనుబంధం - III

1991-92వ సం॥లో శ్రీ జంపాల సాంబయ్య గారి హాస్టల్‌లో దక్షిణం వైపున నిర్మింపబడిన రెండతస్తుల భవనముపైన 3వ అంతస్తుగా నిర్మాణం చేసిన ఎనిమిది గదుల దాతలు. (ఒక్కొక్కరు విరాళము రూ॥ 30,000/- ఇవ్వడమైనది).

1. శ్రీ గుళ్ళపల్లి రామారాయుడు
2. కమ్మ సేవా సంఘం - హైదరాబాద్
3. డా॥ కొండబోలు బసవపున్నయ్య
4. డా॥ మద్దినేని గోపాలకృష్ణ
5. శ్రీ కోగంటి వేంకటేశ్వరరావు
6. శ్రీ దేవరపు సూర్యనారాయణ
7. వైన్ డీలర్స్
8. డా॥ పావులూరి కృష్ణచౌదరి

# అనుబంధం - IV

2006-07వ సంవత్సరములలో శ్రీమతి శాఖమూరి లక్ష్మీదేవమ్మగారి హాస్టలు ప్రాంగణంలో అరండల్‌పేట 4వలైను వైపు నిర్మించిన భవన సముదాయమునకు దాతలు.

### 10 లక్షల రూపాయలు విరాళముగా ఇచ్చినవారు

1. డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

### 5 లక్షల రూపాయలు విరాళముగా ఇచ్చినవారు

2. డాక్టర్ కామేపల్లి రత్నబాబు
3. శ్రీ యర్రమనేని విజయ్‌కుమార్
4. డాక్టర్ పావులూరి కృష్ణచౌదరి

### 4 లక్షల రూపాయలు విరాళముగా ఇచ్చినవారు

1. శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు

### 1 లక్ష రూపాయలు విరాళముగా ఇచ్చినవారు

5. శ్రీ మెటూరి భాస్కరరావు
6. డాక్టర్ యలమంచలి జగన్మోహనరావు
7. శ్రీ కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు
8. డాక్టర్ గడ్డిపాటి బాబూరావు
9. శ్రీ కొర్రపాటి రామారావు
10. శ్రీ చిటిపోతు మస్తానయ్య

11. శ్రీ వల్లూరి జయప్రకాష్ బాబు
12. శ్రీ వి.వి.ఆర్. చౌదరి
13. శ్రీ దేవభక్తుని వెంకట బుచ్చిరావు
14. శ్రీ వాసిరెడ్డి పున్నారావు
15. విద్వాన్ గోగినేని కనకయ్య
16. శ్రీమతి ఈదర శరాక్షరి W/o భాస్కరరావు
17. శ్రీ గోగినేని వెంకటసుబ్బమ్మ
18. శ్రీ ఆరెకట్ల వెంకటసుబ్బమ్మ
19. శ్రీమతి అనంతమ్మ W/o సుబ్బయ్య

## అనుబంధం - V

2008-09వ సంవత్సరములలో శ్రీ జంపాల సాంబయ్య హాస్టలు ప్రాంగణంలో పడమరవైపు నూతనంగా నిర్మించిన భవనమునకు విరాళములు ఇచ్చిన దాతలు.

### 10 లక్షల రూపాయలు విరాళముగా ఇచ్చినవారు

1. డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య
2. డాక్టర్ బిక్కిన రామారావు
3. శ్రీ మండవ వెంకటరామయ్య
4. శ్రీ జాష్టి వెంకటరత్తయ్య
5. డాక్టర్ పావులూరి కృష్ణచౌదరి

### 2 లక్షల రూపాయలు విరాళముగా ఇచ్చినవారు

6. శ్రీ కొర్రపాటి రామారావు
7. శ్రీ జి.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు
8. శ్రీ చదలవాడ వెంకటరత్నం
9. శ్రీ మాదల రత్నగిరిబాబు
10. డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు

### 1 లక్ష రూపాయలు విరాళముగా ఇచ్చినవారు

11. శ్రీ మద్దినేని ఆంజనేయులు
12. శ్రీ పాపినేని లక్ష్మీనారాయణ
13. శ్రీ మల్లెల వెంకట రామారావు

14. శ్రీ పావులూరి సాంబశివరావు

15. డాక్టర్ ముద్దన హనుమంతరావు

16. డాక్టర్ రావిపాటి సత్యనారాయణ

17. డాక్టర్ రావిపాటి సీతారామయ్య

18. డాక్టర్ ఈధర లోకేశ్వరరావు (పాత హాస్టలుకు)

19. డాక్టర్ జె.వి.

20. శ్రీ వెంపరాల వెంకటేశ్వరరావు

21. శ్రీ రామినేని అంకినీడుచౌదరి

22. శ్రీ కోగంటి వెంకటేశ్వరరావు

23. డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ

24. శ్రీమతి మద్దినేని కమలాదేవి

# వారాల పద్ధతిలో ధనసహాయము చేసిన దాతలు

హాస్టలు విద్యార్థులకు వారాల పద్ధతిలో 1972వ సంవత్సరమునకు పూర్వం ధన సహాయం చేసిన దాతల వివరములు సేకరించలేక పోయితిని. కానీ శ్రీ జంపాల సాంబయ్య, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య, శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామిచౌదరిగారు వంటి కుల పెద్దలు హాస్టలు విద్యార్థుల అవసరాలను తెలుసుకుండెడివారు అని తెలియుచున్నది. 1972వ సంవత్సరము తరువాత ఎక్కువ కాలం హాస్టలు విద్యార్థులలో కొంతమందికి వారాల పద్ధతిలో ధన సహాయం చేసిన దాతల వివరములు.

1. శ్రీ కాసరనేని సదాశివరావు

1ఎ) శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ

2. శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి
3. శ్రీ కొడాలి వెంకటరత్నం
4. నవభారత్ టొబాకో కంపెనీ
5. డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య
6. డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ
7. డాక్టర్ పావులూరి కృష్ణచౌదరి
8. డాక్టర్ వట్టికూటి రంగారావు
9. డాక్టర్ కామేపల్లి రత్నబాబు
10. డాక్టర్ యడ్లపల్లి లక్ష్మణస్వామి
11. డాక్టర్ గడ్డిపాటి బాబూరావు
12. శ్రీ కొర్రపాటి రామారావు
13. శ్రీ గుమ్మడి వీరయ్య
14. శ్రీ గడ్డిపాటి కోటేశ్వరరావు
15. శ్రీ రామినేని అంకమ్మ
16. శ్రీ దేవరపు నరసింహారావు

17. గోగినేని టొబాకోస్
18. జయలక్ష్మి టొబాకోస్
19. బెస్ట్ ఇండియా టొబాకోస్
20. అమరావతి ఛారిటబుల్ ట్రస్ట్
21. శ్రీ రంజిత చిట్‌ఫండ్స్
22. శ్రీ చైతన్య కోల్డ్ స్టోరేజ్
23. డాక్టర్ లావు రత్తయ్య
24. డాక్టర్ మన్నే రవీంద్ర
25. శ్రీ మండవ వెంకటరామయ్య
26. డాక్టర్ జాష్ఠి వెంకటేశ్వర్లు (U.S.A.)
27. డాక్టర్ పావులూరి నరేంద్ర (U.S.A.)
28. శ్రీ కోగంటి వెంకటేశ్వరరావు
29. శ్రీ మాదినేని ఆంజనేయులు
30. శ్రీ జి.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు
31. డాక్టర్ ముద్దన హనుమంతరావు
32. డాక్టర్ బిక్కిన రామారావు
33. మాదల రత్నగిరి S/o శకుంతలమ్మ
34. విద్వాన్ గోగినేని కనకయ్య
35. శ్రీ జాగర్లమూడి నరేంద్రనాథ్
36. శ్రీ చేబ్రోలు హనుమయ్య
37. డాక్టర్ కె. వాసుదేవరావు
38. డాక్టర్ కొండబోలు వరప్రసాద్
39. డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్
40. శ్రీ గుళ్ళపల్లి రామారాయుడు

# అధ్యక్షులు, కార్యదర్శులు, వార్డెన్ల వివరములు

## అధ్యక్షులు

**1) డాక్టర పరుచూరి వీరయ్య చౌదరి :** 1957 - 1958

వీరి స్వగ్రామం తురుమెళ్ళ గ్రామం. గుంటూరులో 1947 కాలము నందు ప్రముఖ వైద్యులు. ప్రస్తుతం బ్రాడీపేట మెయిన్‌రోడ్డులో ఉన్న ఓవర్ బ్రిడ్జికి దక్షిణంవైపు బ్రిడ్జికి పడమరవైపు క్రిష్టియన్ మిషనరీలు నిర్వహించుచున్న విశాలమైన ప్రాంగణములో వీరి హాస్పిటల్ ఉండేది. గుంటూరులో మొట్టమొదటిసారిగా "X-Ray" ప్లాంట్ అమర్చిన ఘనత కూడా వీరికే చెందుతుంది. వీరు 1983లో సంవత్సరములో స్వర్గస్తులైరి.

**2) శ్రీ తేళ్ళ కృష్ణమ్మ చౌదరి :** 1958 - 1964

వీరి స్వగ్రామం పెదనందిపాడు దగ్గరలోని పాలపర్రు గ్రామము. న్యాయవాదవృత్తిని చేపట్టి అంచలంచెలుగా ఎదిగి, జిల్లా జడ్జిగా పదవీ విరమణ పొందిరి. వీరు చంద్రమౌళినగర్ ఏర్పరచిన తొలి రోజుల్లో జొన్నచేల మధ్యలో 3వ లైను నందు ఇంటిని నిర్మించుకున్నారు. 1968వ సంవత్సరములో పెదనందిపాడులో కళాశాలను స్థాపించుటలో ప్రముఖపాత్ర పోషించి తొలి అధ్యక్షులుగా వ్యవహరించిరి.

**3) డాక్టర్ కాసరనేని సదాశివరావు :** 1964-1970

వీరి స్వగ్రామం తక్కెళ్ళపాడు శివారు రామచంద్రాపాలెం. గుంటూరులో వైద్యవృత్తిని స్వీకరించిన మొదటి దంపతులు. వీరి కుమారులు, కోడళ్ళు, కుమార్తెలు, అల్లుళ్ళు డాక్టరు వృత్తిలోనే స్థిరపడిరి. మొదట సాంబశివపేటలో వైద్యవృత్తిని ప్రారంభించి తరువాత ప్రస్తుతం పీపుల్స్‌ట్రామాగా నడుపబడు చున్న హాస్పటల్ అంతయూ వీరి స్వంత ప్రాంగణమే. ప్రజల డాక్టరుగా, మనసున్న డాక్టరుగా, హస్తవాసి మంచిది అనిపించుకొని, ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రముఖ డాక్టరుగా పేరుగాంచిరి. వైద్యరంగంతో పాటు సాహిత్యాభిమానం

కలిగి, సాహితీసదస్సులను నిర్వహించుచుండెడివారు. వీరు జె.కె.సి. కాలేజి తొలి కార్యదర్శి. వీరి పదవీకాలంలోనే అప్పటి ఏ.సి. కాలేజిలో ఇంగ్లీషు లెక్చరర్ శ్రీ యలవర్తి రోశయ్యగారిని హాస్టల్ వార్డెన్‌గా నియమించి హాస్టల్ నిర్వహణ సరియైన పద్ధతిలో నిర్వహించుట మొదలైనది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత ఆ పార్టీ యం.ఎల్.ఏ.గా పెదకూరపాడు నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించిరి. అంతకు ముందు జనతాపార్టీ అభ్యర్ధిగా గుంటూరు పార్లమెంటు స్థానానికి వీరి గురువైన కాంగ్రెస్ అభ్యర్ధి శ్రీ ఎన్.జి. రంగా గారిపై పోటీ చేసినా విజయము సాధించలేకపోయిరి. వీరు 2012వ సంవత్సరములోస్వర్గస్తులైరి.

**4) డాక్టర్ పావులూరి కృష్ణచౌదరి :** 1971 - 1972

వీరి స్వగ్రామం గోవాడ. M.B.,B.S. పూర్తి చేసిన తరువాత కొద్దికాలం పొన్నూరులో ఆసుపత్రిని నిర్వహించిన తరువాత ఇంగ్లాండు వెళ్ళి హోమియోపతిలో డిగ్రీ పుచ్చుకొని, గుంటూరులో తొలితరపు హోమియోపతి డాక్టరుగా పేరుప్రఖ్యాతులు గడించిరి. ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడి హోమియో వైద్యునిగా ప్రపంచమంతటా గుర్తింపు పొందిరి. వీరు 2023లో సంవత్సరములో స్వర్గస్తులైరి.

**5) డాక్టర్ కె. బసవపున్నయ్య :** 1972 -

వీరి స్వగ్రామం చేబ్రోలు దగ్గర వేటపాలెం. 1957వ సంవత్సరంలో విశాఖపట్టణం మెడికల్ కాలేజీలో M.B.,B.S. పూర్తిచేసి, 1959 సంవత్సరంలో ఆసుపత్రిని ప్రారంభించి 50 సం॥లు వైద్యునిగా, ప్రజల డాక్టరుగా గుర్తింపు పొందిరి. 1967వ సం॥లో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ప్రారంభించుటలో వీరి పాత్ర కూడా ఉన్నది. 1976 నుండి 1988 వరకు జె.కె.సి. కాలేజి కార్యదర్శిగా వ్యవహరించి, కాలేజి అభివృద్ధికి తోడ్పడిరి. తనయొక్క విరాళంతో 1983వ సంవత్సరంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీవారి ఆధ్వర్యంలో డా॥ కె.ఎల్.పి. పబ్లిక్ స్కూలు స్థాపించిరి.

నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీవారు నిర్వహించుచున్న R.V.R. & J.C ఇంజనీరింగ్ కళాశాలకు ఉపాధ్యక్షునిగా, కోశాధికారిగా వ్యవహరించిరి. 2003వ సంవత్సరంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీకి మరియు సొసైటీ నిర్వహించుచున్న 9 కాలేజీలకు అధ్యక్షునిగా ఎన్నుకొనబడిరి.

వీరు కమ్మ హాస్టల్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తరువాత అనేక మార్పులు జరిగి కొత్త భవనములు, వసతులు ఏర్పడి విద్యార్థుల సంఖ్య సుమారుగా 400 మంది ఉండుటకు వీలుగా ఏర్పడినది. వీరికి సాహిత్యం మీద ఉన్న మక్కువతో 2001 సంవత్సరంలో తుమ్మలవారి కళాపీఠం స్థాపించి వారి ప్రచురణలన్నింటిని పుస్తకాల రూపంలోకి తెచ్చిరి. అదే విధముగా 2002 సంవత్సరంలో మహాకవి శ్రీ ఏటుకూరి వెంకటనరసయ్యగారి కావ్య ప్రచురణలు కూడా జరిగినవి. ఇంతేకాక అనేక గుడులను మరియు స్మశానాలను ఆధునీకరించటంలో ఇతోధిక ధన సహాయం చేసిరి. 2010 సంవత్సరంలో వారు ఒక్కరే అన్ని వసతులతో మిక్కిలి ధనం వెచ్చించి అన్ని హంగులతో 100 మంది ఉండుటకు వీలుగా వృద్ధాశ్రమమును స్థాపించి నడుపుచుండిరి.

# కార్యదర్శులు

**1) శ్రీ కొడాలి వెంకటరత్నం చౌదరి :** 1951 - 1958

వీరు స్వాతంత్ర్యం తరువాత గుంటూరులో ప్రముఖ న్యాయవాదిగా స్థిరపడిరి. నోటరీ విధానం ప్రవేశపెట్టిన తరువాత గుంటూరులో వీరు మొదట నోటరీగా వ్యవహరించిరి. వీరి కుమారుడు న్యాయవాది, కొడాలి సీతారామయ్య గారు ప్రస్తుతం నోటరీగా వ్యవహరించుచున్నారు. వీరి ఇల్లు బ్రాడీపేట 1/10లో ఉన్నది. అనేక సంవత్సరాలు హాస్టలు బీద విద్యార్థులకు వారాల పద్ధతిలో భోజనవసతిని ఏర్పరచిరి.

**2) శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు :** 1958 - 1963

వీరు న్యాయవాద వృత్తిలో ఉండేవారు. ఆ రోజులలో అరండల్‌పేట 3వ లైనులో నివాసం ఉంటూ, హాస్టల్ కార్యక్రమములను పర్యవేక్షించు చుండెడివారు. మృదుస్వభావి, మితభాషిగా అందరి మన్ననలను పొంది యున్నారు.

**3) శ్రీ పెద్ది వెంకటేశ్వరరావు :** 1964 - 1972

వీరి స్వగ్రామం ఫిరంగిపురం దగ్గర అమీనాబాద్. వీరు కూడా న్యాయవాద వృత్తిలోనే కొనసాగిరి. వృత్తిపరంగా సివిల్, క్రిమినల్ కేసులను వాదించుటలో దిట్ట. ఇంగ్లీషు, తెలుగుభాషలలో దిట్ట. ముక్కుసూటి తత్వానికి ప్రతీక. మంచి సమయస్ఫూర్తితో, సందర్భానుసారంగా వాక్పటిమను ప్రదర్శించుచుండెడివారు. వృత్తిలో స్థిరపడిన ప్రముఖులలో వీరు మొదటి వరుసలో ఉండెడివారు.

**4) డాక్టర్ గణేశుని పరంధామయ్య :** 1972 - 1994

వీరి స్వగ్రామం పెదనందిపాడు దగ్గర అన్నవరం. వృత్తిరీత్యా కంటి వైద్యులు. తొలి రోజులలో డాక్టర్ కాసరనేని సదాశివరావుగారి దగ్గర పని

చేసి తర్వాత కృష్ణా పిక్చర్ ప్యాలెస్ ప్రక్కన వున్న భవనమును కొనుగోలు చేసి, అందులో సుదర్శిని కంటి ఆసుపత్రి పేరుతో సుమారుగా 20 సంవత్సరాలుగా ప్రాక్టీసు చేసినారు. వారి కుమారుడు డా॥ రాజేష్, కోడలు డా॥ దుర్గాచైతన్య కూడా అదే వృత్తిలో స్థిరపడుట వలన, ఆ భవనములోనే వారి ప్రాక్టీసును కొనసాగించారు. వారి కుమారుడు డా॥ రాజేష్ పాత భవనమును తొలగించి దాని స్థానములో కొత్త భవనమును నిర్మించి, సుదర్శని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా నడుపుతున్నారు. డా॥ పరంధామయ్యగారిని ఎవరైనా "ఇన్ని సంవత్సరాలుగా కార్యదర్శిగా వున్నావు, నీవు హాస్టలుకు ఏమి చేసావు" అని అడిగితే నవ్వుతూ "నేను ఏమీ చెయ్యలేదు. దానిని అట్లానే ఉంచాను" అని జోక్ చేస్తుండేవారు.

**5) శ్రీ పాపినేని లక్ష్మీనారాయణ :** 1994 - 2009

వీరి స్వగ్రామం అమరావతి దగ్గర నెక్కల్లు గ్రామము. వృత్తిరీత్యా లాయరు. వారు హాస్టల్ పూర్వవిద్యార్థి. గుంటూరు కమ్మ సంఘంలోని, కమ్మ విద్యార్థి సహాయ సంఘంలోను వివిధ హోదాలలో వాటి ఉన్నతికి చురుకైనపాత్ర పోషించిరి. అప్పుడు గుంటూరులో ఉన్న సీనియర్ లాయర్‌లలో ఒకరు. ఇంతకుపూర్వం తెలుగుదేశం గవర్నమెంటు పాలనలో గవర్నమెంటు ప్లీడరుగా వ్యవహరించారు.

**6) శ్రీ నామినేని కోటేశ్వరరావు :** 2009 - 2016

వీరి స్వగ్రామం గుంటూరు జిల్లా కొప్పర్రు గ్రామం. హాస్టల్ పూర్వ విద్యార్థి. వృత్తిరీత్యా అధ్యాపకులు. గుంటూరు ఏ.సి. కాలేజీలో నాలుగు సంవత్సరములు, జె.కె.సి. కాలేజీలో 30 సంవత్సరములు పనిచేసి, జువాలజీ హెడ్‌గా స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన తర్వాత గుంటూరు డా॥ కె.ఎల్.పి. పబ్లిక్ స్కూలు నందు 11 సంవత్సరములు, యం.యస్. నర్సింగ్ కాలేజి నందు 15 సంవత్సరములు వివిధ బాధ్యతలు నిర్వర్తించిరి. కమ్మ

హాస్టల్ వార్డెన్‌గా 1987 నుండి 1998 సంవత్సరం వరకు, 1998 సంవత్సరం నుండి 2009 వరకు కోశాధిపతిగా, 2009-2016 వరకు కార్యదర్శిగా, 2016-2019 వరకు ఉపాధ్యక్షునిగా, చాలాకాలం హాస్టలుతో ప్రత్యక్ష అనుభవం కలిగిన వ్యక్తి.

**7) శ్రీ మందలపు బంగారుబాబు :** 2016 నుండి

వీరి స్వగ్రామము చేబ్రోలు మండలంలోని నడిగడ్డపాలెం. వీరిది మోతుబరి కుటుంబం. వీరు కూడా హాస్టలు పూర్వ విద్యార్థి. వీరు బాధ్యతలు స్వీకరించిన తరువాత ఎంతో పట్టుదలతో, క్రమశిక్షణ తప్పకుండా హాస్టలు నడుపబడుచున్నది. వీరు వ్యాపారరీత్యా గుంటూరులో స్థిరపడిరి. శ్రీ చేబ్రోలు హనుమయ్య వృద్ధాశ్రమమునకు కూడా కార్యదర్శిగా వ్యవహరించుచుండిరి.

# వార్డెన్లు

1958కి పూర్వం హాస్టలు వార్డెను అనేవారు ఉండేవారుకారు. ఆ రోజుల్లో విద్యార్థులు వారికి వారే క్రమశిక్షణతో విద్యను అభ్యసించు చుండెడి వారు.

**1) శ్రీ యలవర్తి రోశయ్య :** 1958 – 1964

వీరి స్వగ్రామం అమర్తలూరు దగ్గర యలవర్రు. వృత్తిరీత్యా అధ్యాపకులు. కొంతకాలం భీమవరం కాలేజీలోను, సుమారుగా 20 సంవత్సరములు గుంటూరు ఏ.సి. కాలేజిలోను, తర్వాత 1968 – 1976 వరకు గుంటూరు జె.కె.సి.కాలేజి మొదటి ప్రిన్సిపాల్‌గాను వ్యవహరించి, ఆ కాలేజికి గట్టిపునాది ఏర్పరచి స్వల్పకాలంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ కాలేజీగా గుర్తింపు పొందుటకు వీరి క్రమశిక్షణ, ముక్కుసూటితత్వం ముఖ్యంగా చెప్పుకోవచ్చును. వీరు ఇంగ్లీషు లెక్చరర్ అయినప్పటికి తెలుగుభాషపై కూడా గట్టిపట్టు ఉండేది. వీరు పుస్తకపఠనమునకు ఉదాహరణగా వారి జీవితకాలములో వారి ఇంట్లో ఉన్న సొంత లైబ్రరీ చూసినవారికి మాత్రమే ఆ విషయం అర్థం అవుతుంది. ఉద్యోగకాలం అంతయు ఎంతో నిబద్ధతతో ముక్కుసూటిగా ఎవరికి భయపడక తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన ఒకే ఒక మహావ్యక్తి.

**2) శ్రీ ముక్కాల రాజగోపాలరావు :** 1965 –

వీరి స్వగ్రామం ప్రత్తిపాడు దగ్గర ఉన్న రావిపాడు. వృత్తిరీత్యా గుంటూరు ఏ.సి.కాలేజీలో లాజిక్ లెక్చరర్. తర్వాత కొంతకాలం అమరావతిలోని కాలేజి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిరి. వీరు "Buddhist Phylosophy" పై అనేక ప్రచురణలు చేసిరి.

**3) శ్రీ నాగండ్ల చలపతిరావు :** 1966 – 1971

వీరి స్వగ్రామం గుంటూరు దగ్గరలోని పెదకాకాని గ్రామం. వృత్తిరీత్యా లాయరు. జె.కె.సి.కాలేజి స్థాపించిన తొలి సంవత్సరాలలో కామర్స్

విద్యార్థులకు “లా”కు సంబంధించి పాఠ్యాంశాలు బోధించెడివారు. ప్రస్తుతం ఉన్న సీనియర్ అడ్వకేట్‌లలో వీరు కూడా ఒకరు. కొంతకాలం గవర్నమెంటు ప్లీడరుగా బాధ్యతలు నిర్వర్తించిరి. గుంటూరు కమ్మ సంఘం స్థాపించుట, దాని పురోభివృద్ధికి మరియు కమ్మ విద్యార్థి సహాయ సంఘం అభ్యున్నతికి వివిధ హోదాలలో చురుకైనపాత్ర పోషించిరి.

**4) శ్రీ మారుపూడి కోటేశ్వరరావు :** 1972 - 1987

వీరి స్వగ్రామం గుంటూరు దగ్గర పెదకాకాని గ్రామం. వృత్తిరీత్యా జె.కె.సి. కాలేజిలో కామర్సు అధ్యాపకులుగా అనేక సంవత్సరములు పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిరి. వీరు వార్డెనుగా ఉన్న కాలములో అంతకు ముందులేని విద్యార్థులకు ఉపయోగమైన కార్యక్రమములను చేపట్టి మంచి “పాపులర్ వార్డెన్”గా పేరు గడించిరి. మంచి కళాభిమాని, నాటకములలో అనేక పాత్రలు పోషించినప్పటికి వారు పోషించిన వీరపాండ్య కట్టబొమ్మన పాత్ర చెప్పుకోదగినది.

**5) శ్రీ నామినేని కోటేశ్వరరావు :** 1987 - 1998

వీరి పరిచయం ఇంతకు ముందు పేజీలలో వ్రాయబడినది.

**6) శ్రీ పులిచర్ల సాంబశివరావు :** 1998 - 2001

వీరి పూర్వీకులు నెల్లూరు జిల్లా నుండి గుంటూరు వచ్చి స్థిరపడిరి. వీరు గుంటూరు జె.కె.సి. కాలేజి తెలుగు లెక్చరర్‌గా అధ్యాపకవృత్తిని ప్రారంభించి అదే కళాశాలలో పనిచేస్తూ Ph.D. పొంది, తెలుగు HODగా పదవీ విరమణ చేసిరి. వీరు బహుముఖ ప్రజ్ఞాశాలి. కార్టూనిస్ట్‌గా, గేయ రచయితగా, వచనసాహిత్యం, గ్రాంధీకభాష మొదలగు తెలుగుభాషకు సంబంధించిన శాఖపై మంచిపట్టు ఉన్న వ్యక్తి. ఆర్యసమాజ ఆలోచనలను తొలిగిబుచ్చుకొని వివేకానందుని వీరాభిమానిగా హిందూభావజాలం కలిగిన వ్యక్తి. వీరు వార్డెనుగా వున్న కాలంలోనే విద్యార్థులు చెప్పులు బయట విడిచి

భోజనం చేయుట, ఎవరి ప్లేటు వారే కడుగుకొనుట వంటి ఆదర్శభావములకు హాస్టలులో ప్రవేశపెట్టిరి.

**7) శ్రీ గోగినేని సాంబశివరావు :** 2001 - 2005

వీరి స్వగ్రామం ముట్లూరు. వృత్తిరీత్యా అధ్యాపకులు. గుంటూరు జె.కె.సి. కాలేజీలో కామర్స్ అధ్యాపకునిగా ప్రవేశించి HOD గా పదవీ విరమణ గావించిరి. హాస్టల్ నిర్వాహణలో విద్యార్థులపై తమయొక్క పరిపాలనాదక్షతతో క్రమశిక్షణను పెంపొందించి, మంచి ఫలితాలు వచ్చుటలో వీరి పాత్ర చెప్పుకొనదగినది.

**8) శ్రీ కొండబోలు రంగారావు :** 2006 -

వీరి స్వగ్రామం గూడవల్లి. హాస్టల్ పూర్వ విద్యార్థి. ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంటులో పదవీ విరమణ పొంది, హైదరాబాదులో స్థిరపడిన తరువాత ఏదైనా సేవా కార్యక్రమములు చేయవలెనని తలచి తను ఉన్నటువంటి కమ్మ హాస్టలు బాధ్యతలు హాస్టలులోనే ఉంటూ విద్యార్థులతోపాటు ఉంటూ నిర్వహించిరి. వీరు ఉన్న సంవత్సరకాలం వార్డెన్ లేరు. తర్వాత డాక్టర్ కొండబోలు బసవపున్నయ్యగారు స్థాపించిన వృద్ధాశ్రయమునకు వెళ్ళి వృద్ధాశ్రయం మేనేజరుగా వ్యవహరించుచు స్వర్గస్తులైనారు.

**9) శ్రీ గుత్తా శ్రీనివాసరావు :** 2006 - 2010

వీరి స్వగ్రామం ప్రత్తిపాడు దగ్గర కొప్పర్రు గ్రామం. హాస్టలు పూర్వ విద్యార్థి. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరు వార్డెనుగా బాధ్యతలు స్వీకరించినప్పుడు వీరు ప్రత్తిపాడు జెడ్.పి.హైస్కూలు హెడ్‌మాష్టరుగా వెళ్ళేవారు. ఎంతో నిబద్ధతతో రాజీ పడకుండా తను విద్యార్థిగా వున్న రోజులలో తన వార్డెన్ నిర్వహించిన పద్ధతిలోనే నిర్వహించవలెను అనే పట్టుదలతో ఎంతో శ్రమపడి విద్యార్థుల బాగోగులు గమనించేవారు.

**10) శ్రీ కిలారు జయ లక్ష్మీనారాయణ :** 2009 - 2022

వీరి స్వగ్రామం యడ్లపాడు దగ్గర సొలస. వీరు హాస్టలు పూర్వ విద్యార్థి. వృత్తిరీత్యా R.V.R. & J.C. Engineering College లో Maths Assistant Professor. వీరు వార్డెనుగా ఉన్నప్పుడు విద్యార్థులకు ఉదయం అల్పాహార ఏర్పాట్లు ప్రారంభమైనవి. మరియు నెలవారి మెస్ బిల్లులు కూడా సంవత్సరమునకు నిర్ణయించి, మొత్తం విద్యార్థులు చెల్లించునట్లుగా ఏర్పాటు జరిగినది. మరియు ఇదే కాలంలో విద్యార్థుల సంఖ్య పెరుగుట వలన ఇద్దరు డిప్యూటీ వార్డెన్లను కూడా నియమించటమైనది. వీరు, డిప్యూటీ వార్డెన్లు విద్యార్థులలో క్రమశిక్షణ పెంపొందించునట్లుగా ప్రోత్సహించిరి.